www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 163

బుధవారం | 10-9-2025

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: తదియ మ.3.38 తదుపరి చవితి; నక్షత్రం: రేవతి సా.4.03 తదుపరి అశ్వని; వర్జ్యం: శేషం ఉ.6.32; దుర్ముహూర్తం: ఉ.11.47-12.36; అమృతఘడియలు: మ.1.51-3.19; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.18

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

1) అగ్నికీలల్లో నేపాల్ పార్లమెంట్ 2) దాడికి గురైన మాజీ ప్రధాని షేర్ బహదూర్‌కు సైనికుల రక్షణ 3) యువ నిరసనకారులు





# నేపాల్ అగ్నిగుండం

యువత ఆందోళనలు హింసాత్మకం.. పార్లమెంట్ సహా సుప్రీంకోర్టు, ప్రముఖుల ఇళ్లకు నిప్పు

ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా.. అదే బాటలో అధ్యక్షుడు రామచంద్ర, మంత్రులు

నేతల ఇళ్లపై దాడులు, నిప్పు.. కాలిన గాయాలతో మాజీ ప్రధాని ఖనాల్ భార్య మృతి

ఆర్థిక, విదేశాంగ శాఖల మంత్రులపై దాడులు.. ఆర్మీ బ్యారక్‌లకు ప్రముఖులు

సైన్యం చేతికి పాలన?.. తదుపరి ప్రధానిగా కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షాకు అవకాశం?

కఠ్మాండూ, సెప్టెంబరు 9: సామాజిక మాధ్యమాలపై నిషేధానికి వ్యతిరేకంగా మొదలైన యువత ఉద్యమం.. నేపాల్ ప్రభుత్వాన్ని దించేసింది. సోమవారం మొదలైన ఆందోళనలు.. మంగళవారం హింసాత్మకంగా మారాయి. దీంతో.. హిమాలయ దేశం అగ్నిగుండంగా మారింది. నిరసనకారులు అధికారపక్షం.. విపక్షం అని చూడకుండా.. ప్రధాని సహా.. మంత్రులు, మాజీ ప్రధానుల ఇళ్లపై దాడులు జరిపారు. వారి అధికారిక, ప్రైవేటు ఇళ్లకు నిప్పు పెట్టారు. మాజీ ప్రధాని జలనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పు అంటించగా.. ఆ మంటల్లో ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రాకర్ సజీవ దహనమయ్యారు. ఆర్మీ కొందరు మంత్రులు, వీఐపీలను హెలికాప్టర్లలో తమ బ్యారక్‌లకు తరలించగా.. ఆ అవకాశం లేని మంత్రులపై ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. మహిళా మంత్రులపైనా

మిగతా 14వ పేజీలో...

జైళ్ల ధ్వంసం.. ఖైదీల పరారీ..

చిక్కుకుపోయిన పర్యాటకులు

14

నిన్న బంగ్లాదేశ్.. నేడు నేపాల్

ఉద్యమాల ఉధృతికి..

'పోరుగు' నేతలు పతనం!

ఆందోళనలను ఉక్కుపాదంతో

అణచివేసే ప్రయత్నాలు విఫలం

ప్రాణనష్టం సంభవించినా

వెనుకడుగు వేయని యువత

# క్విడ్ ప్రో కో!

## ఫార్ములా ఈ రేసులో కంపెనీలకు, బీఆర్ఎస్‌కు పరస్పర లబ్ధి

హెచ్ఎండీఏ రూ.45 కోట్లు చెల్లించగానే..

బీఆర్ఎస్‌కు రూ.44 కోట్ల విరాళం

అనుభవం లేని కంపెనీకి అందుకే అవకాశం

రెండో దశ జరక్కుండానే మళ్లీ చెల్లింపులు

కేటీఆర్‌పై చార్జిషీట్‌కు అనుమతించండి

రాష్ట్ర ప్రభుత్వానికి ఫైలు పంపిన ఏసీబీ

అర్వింద్ కుమార్, మరికొందరిపై అభియోగాలు

నేడు సీఎస్ నుంచి గవర్నర్ వద్దకు ఫైలు

జోక్యానికి సుప్రీం నిరాకరణతో చకచకా పావులు


గవర్నర్ అనుమతి తర్వాత అరెస్టు లేదా చార్జిషీట్



హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసు ఈవెంట్‌లో కేటీఆర్ (ఫైల్)

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ నిందితుడిగా ఉన్న ఫార్ములా-ఈ కారు రేసులో క్విడ్ ప్రో కో జరిగిందని ఏసీబీ తేల్చిందని సమాచారం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ ఖాతా నుంచి రూ.45 కోట్ల మేర నిధులు ఫార్ములా ఈ కారు రేస్‌లో భాగస్వాములైన కంపెనీకి బదిలీ చేయడం.... ఆ కంపెనీల నుంచి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో తిరిగి 44 కోట్ల రూపాయల నిధులు బీఆర్ఎస్‌కు రావడం స్పష్టంగా కనిపిస్తోందని ఏసీబీ అంచనాకు వచ్చింది. దీనికి సంబంధించి పలు ఆధారాలను ఏసీబీ సేకరించిందని తెలిసింది. క్విడ్ ప్రో కో ఫలితంగానే ఫార్ములా రేసింగ్‌లో ఏ మాత్రం అనుభవం లేని ఏస్ నెక్స్‌జెన్ భాగస్వామి అయ్యిందని ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆ వివరాలను తాజాగా ప్రభుత్వానికి పంపించిన నివేదికలో పొందుపరిచారు. మంత్రివర్గం ఆమోదం లేకుండానే నాటి మంత్రి కేటీఆర్ ఈ నిధులను బదిలీ చేసేశారని, అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా చేయడం నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికారులు అభిప్రాయానికి వచ్చారు. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఇతర నిందితులుగా ఏస్ నెక్స్ట్ జెన్ సీఈవో కిరణ్‌రావు, ఎఫ్ఈవో కంపెనీలను పేర్కొన్నట్లు తెలిసింది. ఈ మేరకు వారిపై ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఫైలును మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపారు. ఈ కేసులో మరింత ముందుకెళ్లేందుకు, నిందితులపై చర్యలు తీసుకునేందుకు అనుమతివ్వాలని కోరారు. దీనిపై విజిలెన్స్ కమిషనర్ అభిప్రాయం కూడా ప్రభుత్వం ఇప్పటికే తీసుకున్నట్లు తెలిసింది. జీఏడీ అనుమతి కూడా తీసుకున్నాక గవర్నర్ వద్దకు బుధవారం ఈ ఫైలును పంపించనున్నారు. ఫార్ములా ఈ కార్ రేసులో ఏసీబీ విచారణకు ప్రభుత్వం ఆదేశించినప్పుడు కూడా గవర్నర్ నుంచి అనుమతి తీసుకోగా..ఇప్పుడు విచారణ ముగిసి నివేదిక సిద్ధమైన తరుణంలో తదుపరి చర్యలు తీసుకునేందుకు కూడా అనుమతి ఇవ్వాలని కోరనున్నారు. గవర్నర్ అనుమతిస్తే ఈ కేసులో

మిగతా 10వ పేజీలో...



# ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో గెలుపు

రాధాకృష్ణన్‌కు 452, సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు

781 మంది ఎంపీల్లో 767 మంది ఓటు

14 మంది గైర్హాజరు.. చెల్లని ఓట్లుగా 15 గుర్తింపు

డీఎంకే సహా 15 మందికి పైగా విపక్ష ఎంపీల క్రాస్ ఓటింగ్

సుదర్శన్‌రెడ్డికి ఇద్దరు లేదా ముగ్గురు వైసీపీ ఎంపీల మద్దతు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించారు. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిపై 152 ఓట్ల ఆధిక్యంతో గెలిచి.. భారతదేశ 15వ ఉప రాష్ట్రపతిగా నిలిచారు. ఈ ఎన్నికలో విజయానికి 377 ఓట్లు అవసరం కాగా రాధాకృష్ణన్‌కు 452 ఓట్లు వచ్చాయి. ఆయన ప్రత్యర్థి, ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి 300 ఓట్లు సాధించారు. మొత్తం 781 మంది సభ్యులకుగాను 767 మంది పార్లమెంట్ సభ్యులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీఆర్ఎస్, బీజేడీ, శిరోమణి అకాళీదళ్ పార్టీలకు చెందిన 12 మంది సభ్యులతోపాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. 15 మంది సభ్యుల ఓట్లు చెల్లలేదు. ఎన్డీఏ కూటమి సభ్యులందరూ రాధాకృష్ణన్‌కు

మిగతా 2వ పేజీలో...

రాధాకృష్ణన్ గొప్ప ఉప రాష్ట్రపతిగా నిలుస్తారు: మోదీ

2

సీపీ నిబద్ధతకు సరైన గుర్తింపు

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

చంద్రబాబు, పవన్ అభినందన

ఎన్డీయేది నైతికంగా పరాజయమే

ఉప రాష్ట్రపతి ఫలితంపై ఖర్గే

'కోయంబత్తూరు వాజ్‌పేయి' సీపీ

2

తొలి నుంచి సౌమ్యుడిగా పేరు

రెండు సార్లు లోక్‌సభకు ఎన్నిక

ఉపరాష్ట్రపతిగా ఎన్నికవడం పట్ల

తమిళనాట బీజేపీ సంబరాలు



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో ఎంపీలు చామల కిరణ్, మల్లు రవి, బలరాంనాయక్, సురేశ్ షెట్కార్

# ఆ రూ.30 వేల కోట్లు.. అప్పు లెక్కల్లో వద్దు!

రాష్ట్రంలో 105 యంగ్ ఇండియా బడులు కడతాం

ఏటా 2.70 లక్షల మందికి కార్పొరేట్ స్థాయి విద్య

నిధుల సమీకరణకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయింపు ఇవ్వండి

చదువుపై ఖర్చును పెట్టుబడిగా పరిగణించండి

పాత సర్కారు అప్పులకు సులభ వాయిదాలివ్వండి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు సీఎం రేవంత్ వినతి

హైదరాబాద్-బందరు మధ్య

12 వరుసల కొత్త రోడ్డుకు అనుమతివ్వండి

ఆర్ఆర్ఆర్ ఉత్తరం పనులు ప్రారంభించండి


శ్రీశైలానికి 4 వరుసల ఎలివేటెడ్ కారిడార్ కావాలి

కేంద్ర మంత్రి గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చదువులు మెరుగు పరచడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని, ఇందుకు కేంద్రం అన్ని విధాలా సహకరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. మంగళవారం ఆయన కేంద్ర మంత్రిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లోని పిల్లలకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. తెలంగాణ విద్యా రంగంలో సమూల మార్పులు తేవడానికి తాము చేస్తున్న ప్రయత్నానికి మద్దతు ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా పాఠశాలలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని తెలిపారు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయన్నారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు ఉంటారని, ఏటా 2.70 లక్షల మంది విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందని వివరించారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, క్రీడా సదుపాయాలతో నిర్మించే 105 యంగ్ ఇండియా సమగ్ర గురుకులాల నిర్మాణానికి రూ.21 వేల కోట్ల వ్యయం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు వివరించారు. ఈ నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతి

మిగతా 13వ పేజీలో...

# గ్రూప్-1 ఫలితాల రద్దు



మెయిన్స్ మార్కులు, ర్యాంకుల జాబితాను కొట్టేసిన హైకోర్టు

జవాబు పత్రాలను పునర్ మూల్యాంకనం చేయాలని ఆదేశం

8 నెలల్లో పూర్తి చేయాలి.. లేదంటే మెయిన్స్ రద్దు చేస్తాం

టీజీపీఎస్సీ అసమర్థత వల్ల నిరుద్యోగులకు ఇబ్బందులు

గతంలో 2 సార్లు గ్రూప్-1 పరీక్షలు రద్దయినా బుద్ధి రాలేదు

తన సొంత నిబంధనల్ని తానే తుంగలో తొక్కింది: హైకోర్టు

222 పేజీల తీర్పు వెలువరించిన సింగిల్ జడ్జి ధర్మాసనం

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్ పరీక్షల్లో మెరిట్ సాధించి.. ఉద్యోగాలకు ఎంపికై.. నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. గ్రూప్-1 మెయిన్ పరీక్షల అనంతరం టీజీపీఎస్సీ ప్రకటించిన తుది మార్కుల జాబితాను, సాధారణ ర్యాంకుల జాబితాను హైకోర్టు మంగళవారం రద్దు చేసింది. మెయిన్స్‌కు హాజరైన మొత్తం అభ్యర్థుల సమాధాన పత్రాలను పునర్ మూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. పునర్ మూల్యాంకనంలో మోడరేషన్ పద్ధతిని అవలంబించాలని, మాన్యువల్‌గా పేపర్లు దిద్దాలని పేర్కొంది. దీనికి సంబంధించి 'సంజయ్‌సింగ్ అండ్ అదర్స్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పాటించాలని సూచించింది. పునర్ మూల్యాంకనం

మిగతా 12వ పేజీలో...

హైకోర్టు తీర్పును గౌరవిస్తాం

12

పదేళ్లు పరీక్ష నిర్వహించలేని అసమర్థత బీఆర్ఎస్‌ది: మంత్రి జూపల్లి

గ్రూప్-1పై అప్పీలుకెళ్దామా?

ఆలోచనలో టీజీపీఎస్సీ యంత్రాంగం

డివిజన్ బెంచ్‌లో న్యాయం జరక్కుంటే

సుప్రీంకోర్టుకూ వెళ్లేందుకు సిద్ధం

12

గ్రూప్-1కు ఎంపికైన అభ్యర్థులు



## కొత్త దళపతి.. తిరుపతి!

మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం!

2

పోలీసు వర్గాల వెల్లడి.. అధికారికంగా ప్రకటించని పార్టీ

క్యాడర్ రిక్రూట్‌మెంట్లు, ఆయుధ నిపుణుడిగా తిరుపతికి పేరు

చంద్రబాబుపై దాడిలో ప్రమేయం

74 మంది జవాన్లను బలిగొన్న దంతేవాడ దాడికి సారథ్యం

దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా మాద్వి హిడ్మా!

## ఎల్ఆర్ఎస్ జారీకి 4.50 లక్షల లంచం

ఏసీబీకి చిక్కిన నార్సింగ్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి

రూ.4 లక్షలు తీసుకుంటూ పట్టుబడిన మణిహారిక

3

## పాత స్టాకుపై కొత్త ధరలతో స్టిక్కర్లు

2

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం ప్రజలకందేలా కేంద్రం చర్యలు

మారిన పన్నుతో కొత్త ఎమ్మార్పీ





## కూలిన గురుకుల హాస్టల్ భవనం

ముగ్గురు విద్యార్థులకు గాయాలు

భోజన విరామ సమయంలో కూలడంతో తప్పిన పెనుప్రమాదం

3

సంగారెడ్డి జిల్లా లింగంపల్లిలో ఘటన

## గ్రామాల్లోనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

త్వరలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలు

వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ

34 జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ప్రారంభం

ఆ సెంటర్లలో క్యాన్సర్ డయాగ్నసిస్, కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ సేవలు

13

నర్సింగ్ విద్యార్థులకు విదేశీ భాషల బోధన

ఇఫ్లూతో ఎంవోయూ ఖరారు



# ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

(మొదటిపేజీ తరువాయి)

ఓటు వేయగా.. విపక్షాలకు చెందిన సభ్యుల్లో 15 మందికి పైగా క్రాస్ ఓటింగ్ చేసి ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు పలికారని స్పష్టమైంది. తెలుగు ఆత్మ గౌరవం పేరుతో ఇండియా కూటమి పక్షాలు తెలుగు ఎంపీల ఓట్లను చీల్చేందుకు చేసిన ప్రయత్నాలు దాదాపు విఫలం కాగా, డీఎంకేకు చెందిన పలువురు సభ్యులు తమిళ ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిచ్చి రాధాకృష్ణన్‌కు ఓటు వేయడం గమనార్హం. ఇక.. ఎన్డీఏ అభ్యర్థికే తమ మద్దతు అని వైసీపీ ప్రకటించినప్పటికీ.. కనీసం ముగ్గురు వైసీపీ ఎంపీలు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.



కొందరు డీఎంకే ఎంపీలు ఆయనకు ఓటేసినట్టు తెలుస్తోంది. అదే సమయంలో.. ఎన్డీయే కూటమికి మద్దతు తెలిపిన వైసీపీ ఎంపీల్లోనూ ఇద్దరు.. ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి ఓటు వేసినట్టు తెలిసింది. వారితోపాటు సుదర్శన్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే మరో వైసీపీ ఎంపీ సైతం ఆయనకే ఓటేసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇక.. పోలైన ఓట్లలో 15 ఓట్లు చెల్లనివిగా అధికారులు ప్రకటించారు. ఆ 15 మంది ఏ కూటమికి చెందిన వారన్నదానిపై రెండు కూటములు విశ్లేషిస్తున్నాయి. ఇండియా కూటమికి చెందిన మొత్తం 315ఓట్లు పూర్తిగా పోలయ్యాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించిన కొద్దిసేపటికే, ఆ కూటమి అభ్యర్థికి సుదర్శన్ రెడ్డికి 300 ఓట్లు మాత్రమే వచ్చినట్టు ఎన్నికల అధికారి ప్రకటించడం గమనార్హం. నిజానికి ఉభయసభల్లోనూ ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న 12 మంది ఎంపీలు కూడా ఇండియా కూటమికి వేస్తే 327 ఓట్లు రావాలి. కానీ.. 300 ఓట్లు మాత్రమే రావడం ఇండియా కూటమి పార్టీల అనైక్యతను సూచిస్తోందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కాగా, చెల్లని ఓట్లలో ఎన్డీఏ సభ్యులవే 10 ఓట్లు ఉన్నట్టు, మిగతా ఐదు ఓట్లూ ఇండియా కూటమికి చెందిన వారివని తెలుస్తోంది.

### 98 శాతం పోలింగ్..

పార్లమెంట్ కొత్త భవనంలోని 'ఎఫ్-101 వసుధ'లో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. ఏడున్నర తర్వాత... 152 ఓట్ల ఆధిక్యంతో రాధాకృష్ణన్ గెలుపొందినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ ప్రమోద్‌చంద్ర మోదీ ప్రకటించారు. ఎన్నికల్లో సుమారు 98% పోలింగ్ జరిగింది.

### క్రాస్ ఓటింగ్..

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ జరుగుతుందని ఎన్డీయే, ఇండియా.. రెండు పక్షాలూ మొదటి నుంచి చెబుతున్నాయి. తమకు 315 మంది సభ్యుల మద్దతు ఉందని ఇండియా కూటమి చెబుతుండగా.. ఎన్డీయే కూటమికి 427 ఓట్లు ఉన్నాయి. ఏపీకి చెందిన వైసీపీ సైతం ఎన్డీయేకి మద్దతు ప్రకటించింది. ఆ పార్టీకి ఉభయసభల్లోనూ కలిపి 11 మంది ఎంపీలు ఉన్నారు. వారిని కూడా కలుపుకొంటే ఎన్డీయే కూటమికి 438 ఓట్లు రావాలి. కానీ, ఆ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు అనూహ్యంగా 452 ఓట్లు వచ్చాయి. అంటే.. ఇండియా కూటమి నుంచి సుమారు 14 మంది ఎన్డీఏకు క్రాస్ ఓటింగ్ చేసినట్టు. రాధాకృష్ణన్ తమిళుడు కాబట్టి..

### ఓటింగ్‌కు దూరంగా...

ఎన్డీయే కూటమి.. ఇండియా కూటమి.. రెండింటికీ తాము సమానదూరం పాటిస్తామంటూ నవీన్‌పట్నాయక్ నేతృత్వంలోని బిజు జనతాదళ్ (బీజేడీ) ఈ ఎన్నికకు దూరంగా ఉంది. ఆ పార్టీకి లోక్‌సభలో ఒక్క ఎంపీ కూడా లేరు. రాజ్యసభలో ఏడుగురు సభ్యులున్నారు. ఇక.. రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయంటూ తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఈ ఎన్నికకు దూరంగా ఉంది. ఆ పార్టీకి కూడా లోక్‌సభలో ఎంపీలు లేరు. రాజ్యసభలో నలుగురు ఎంపీలున్నారు. ఇక.. దేశానికి ఏ కష్టం వచ్చినా ఆదుకోవడానికి ముందుండే పంజాబ్‌కే ఇప్పుడు వరదలతో తీవ్ర కష్టం వస్తే అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ ఆదుకోలేదంటూ శిరోమణి అకాలీదళ్ ఈ ఎన్నికకు దూరంగా ఉంది. ఆ పార్టీకి ఉన్న ఒకే ఒక ఎంపీ.. కేంద్ర మాజీ మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ బాదల్. వీరు కాక మరో ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు.

### సైద్ధాంతిక పోరు సాగుతుంది: జస్టిస్ సుదర్శన్ రెడ్డి

ఉపరాష్ట్రపతి ఎన్నిక ఫలితాలు తనకు అనుకూలంగా లేనప్పటికీ.. తమ లక్ష్యం విలువ తగ్గిపోలేదని ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి తన ప్రకటనలో తెలిపారు. ఇకపై మరింత తీవ్రంగా తమ సైద్ధాంతిక యుద్ధం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై పూర్తి విశ్వాసంతో తాను ఈ ఫలితాలను వినయంగా ఆమోదిస్తున్నానని చెప్పారు. తనకు లభించిన ఈ అవకాశమే ఎంతో గొప్పదని, ఎంతో గౌరవం కల్పించిందని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యం విజయాల ద్వారానే పటిష్ఠం కాలేదని.. చర్చలు, నిరసన, భాగస్వామ్యం ద్వారా పరిపక్వం అవుతుందని తెలిపారు. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు.

## ఎన్డీయేది నైతికంగా పరాజయమే

» ఉప రాష్ట్రపతి ఎన్నిక ఫలితంపై ఖర్గే



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీఏ సంఖ్యాపరంగా గెలిచినా నైతికంగా, రాజకీయంగా మాత్రం ఓటమి పాలైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఇది కేవలం ఎన్నిక మాత్రమే కాదని, అంతకుమించిన సైద్ధాంతిక యుద్ధమని పేర్కొన్నారు. ఈ ఎన్నికలో ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా నిలబడ్డాయన్నారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అత్యున్నత పార్లమెంటరీ సంప్రదాయాలు పాటిస్తారని, ప్రతిపక్షానికి సమాన గౌరవం, అవకాశం ఇస్తారని, అధికార పక్షం ఒత్తిళ్లకు తలొగ్గరని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## గొప్ప ఉప రాష్ట్రపతిగా నిలుస్తారు: మోదీ

న్యూఢిల్లీ/హైదరాబాద్/అమరావతి, సెప్టెంబరు 9: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు ప్రధాని మోదీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సమాజసేవకు, పేదలు, అణగారినవర్గాల వారి సాధికారతకు రాధాకృష్ణన్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఆయన ఒక గొప్ప ఉపరాష్ట్రపతిగా నిలిచి.. రాజ్యాంగవిలువలను మరింత బలోపేతం చేస్తారన్న నమ్మకం తనకుందని మోదీ పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా శుభాకాంక్షలు తెలిపారు. రాధాకృష్ణన్ గెలుపు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో మరో చరిత్రాత్మక విజయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. సిద్ధాంతం కోసం అహర్నిశలు శ్రమించిన రాధాకృష్ణన్ ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడం స్ఫూర్తిదాయకమని, ఆయన నిబద్ధతకు సరైన గుర్తింపు అని కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. సీపీ రాధాకృష్ణన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'ఎక్స్' వేదికగా, మంత్రి లోకేశ్ ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు

## హిమాచల్‌కు రూ.1500 కోట్ల తక్షణ సాయం

» పంజాబ్‌కు రూ.1600 కోట్లు..ప్రకటించిన ప్రధాని మోదీ

సిమ్లా, ధర్మశాల, చండీగఢ్, న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 : భారీవర్షాలు, వరదలతో అతలాకుతలమైన హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రధాని మోదీ మంగళవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. హిమాచల్‌కు రూ.1,500 కోట్ల తక్షణ సాయం, పంజాబ్‌కు రూ.1,600 కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇప్పటికే పంజాబ్ విపత్తు సహాయ నిధిలో రూ.12,000 కోట్లు ఉండగా వాటికి అదనంగా ఈ సహాయాన్ని ప్రకటించారు. రెండు రాష్ట్రాల్లో వరదల్లో మరణించిన వారికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేల సాయం ప్రకటించారు. కాగా హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రాలో సహాయ, పునరావాస చర్యలపై ప్రధాని సమీక్షించారు. పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. అనంతరం ప్రధాని వరద బాధితులను పరామర్శించారు. అలాగే వరదలతో సతమతమవుతోన్న పంజాబ్ రాష్ట్రంలో తీవ్రంగా ప్రభావితమైన గురుదాస్‌పూర్ జిల్లాలో పర్యటించారు. దశాబ్దాలుగా ఎన్నడూ లేని స్థాయిలో వచ్చిన వరదలను పంజాబ్ ఎదుర్కొంటోంది. ఈ కారణంగా 52 మంది మరణించారు. 1.91 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. కాగా ప్రధాని వరద సహాయ నిధికి సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, ఇతర జడ్జిలు రూ.25,000 చొప్పున విరాళం ఇవ్వనున్నారు.

## ఆడుకుంటున్న రుతుపవనాలు!

» దేశంలో కొన్ని ప్రాంతాల్లో భారీవర్షాలు

» ఇంకొన్ని చోట్ల వర్షాభావం.. కరువు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: దేశవ్యాప్తంగా రుతుపవనాలు ఏకరూపంగా ప్రభావం చూపించడం లేదు. కనీవినీ ఎరుగని భారీవర్షాలు, మెరుపు వరదలు, కొండచరియలు, మట్టిచరియలు విరిగిపడుతుండడంతో కొన్ని ప్రాంతాలు అతలాకుతలమవుతుండగా.. ఇంకొన్ని ప్రాంతాలు తీవ్ర వర్షాభావం, కరువుతో అల్లాడుతున్నాయి. వాతావరణ మార్పు దీనికి ప్రధాన కారణమని పలువురు అంటున్నా.. అదొక్కటే కారణం కాదని ఐఐటీ భువనేశ్వర్‌లోని స్కూల్ ఆఫ్ ఎర్త్, ఓషన్-క్లైమేట్ సైన్సెస్ అసోసియేట్ ప్రొఫెసర్ సందీప్ పట్నాయక్ చెబుతున్నారు. పట్టణ ప్రణాళికలు, డ్రైనేజీ వ్యవస్థలు సరిగా లేకపోవడం.. మితిమీరిన కాంక్రీటు వినియోగం కారణంగా వర్షపు నీరు భూమిలో ఇంకకపోవడం.. ఇవన్నీ విపత్తులకు కారణాలేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది రుతుపవన కాలంలో వర్షపాతంలో నాటకీయ మార్పులు కనిపించాయి. వాతావరణ మార్పుల్లో పాశ్చాత్య అవాంతరాల కారణంగా జమ్మూకశ్మీరు, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్రల్లో మెరుపు వరదలు సంభవించాయి. మట్టి, కొండచరియలు విరిగిపడ్డాయి. ఉత్తరాఖండ్, బిహార్‌లలో భారీవరదలకు చాలా గ్రామాలు కొట్టుకుపోయాయి. వందల మంది గల్లంతయ్యారు. మరోవైపు, గంగా మైదాన ప్రాంతాల్లో జూన్‌లో చుక్క వర్షం పడడం లేదని.. అవి ఎండిపోతున్నాయని.. ఇంకోవైపు.. మధ్యభారతం తడిసిముద్దవుతోందని పట్నాయక్ తెలిపారు. ఆగస్టు నెలలో పలు హిమాలయ రాష్ట్రాల్లో కుండపోత వర్షాలు, క్లౌడ్ బరస్టులు సంభవించాయి. ఉత్తరాఖండ్‌లోని ధారలి, జమ్మూకశ్మీరులోని కథువా, హిమాచల్‌లో వ్యవసాయం సర్వనాశనమైంది. ఈ ప్రాంతంలో భారీ ఉష్ణోగ్రతల కారణంగానే వరదలు సంభవించాయని అంటున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా నీరు ఆవిరవడం అధికమవుతోంది. ఇది వాతావరణంలో తేమను పెంచుతోంది. మేఘాలు దట్టమై బరువెక్కడంతో ఆయా ప్రాంతాల్లో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీవర్షాలు.. కొండచరియలు విరిగిపడేందుకు కారణమవుతున్నాయి. వీటి బంగాళాఖాతంలో అల్పపీడన వ్యవస్థ, రుతుపవన వర్షాలు కలిసి.. పర్వతాలపై గాలి వ్యతిరేక దిశలో అపరిమిత వర్షాలకు కారణమవుతున్నాయని.. ఈ కారణంగా కేరళలో కొండచరియలు, మట్టిచరియలు విరిగిపడి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని పట్నాయక్ వివరించారు. ఇందులో వాతావరణ మార్పు అనేది ఒక కోణం మాత్రమేనన్నారు.

## పాత స్టాకుపై కొత్త ధరలతో స్టిక్కర్లు

» జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం ప్రజలకు అందేలా కేంద్రం వెసులుబాటు..మారిన పన్ను మేరకే కొత్త ఎమ్మార్పీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం ప్రజలకు పక్కాగా అందించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. పాత స్టాకు మీద ముద్రించి ఉన్న గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)ను మార్చుకునేందుకు కంపెనీలకు వెసులుబాటు కల్పిస్తూ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. సాధారణంగా కంపెనీలు ఏవైనా వస్తువులను ఉత్పత్తి చేసి మార్కెట్‌లోకి విడుదల చేశాక.. వాటిపై ఉన్న ఎమ్మార్పీని మార్చేందుకు అవకాశం ఉండదు. కానీ ఈ నెల 22 తర్వాత జీఎస్టీ శ్లాబుల మార్పు, పన్ను తగ్గింపు అమల్లోకి వస్తుండటంతో.. ఆ రోజు నాటికి ఇంకా నిల్వ ఉన్న పాత స్టాకుపై కొత్త ధరలతో స్టిక్కర్లు వేయడానికి ప్రభుత్వం అనుమతించింది. కేవలం పన్నుల్లో మార్పుల మేరకు మాత్రమే ధరల సవరణ ఉండాలని, ఇతర మార్పులేమీ ఉండొద్దని పేర్కొంది. అంతేగాక ఉత్పత్తులపై పాత ఎమ్మార్పీ కూడా కనిపించేలా ఉండాలని స్పష్టం చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు, లేదా పాత స్టాక్ అయిపోయే వరకు మాత్రమే ఇలా ధరల మార్పు స్టిక్కర్లను వేసే వెసులుబాటు ఉంటుందని ప్రభుత్వం పేర్కొంది. ప్రజల ప్రయోజనాలను పరిరక్షించేందుకు, జీఎస్టీ పన్ను తగ్గింపు అమలులో పారదర్శకత కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి 'ఎక్స్'లో తెలిపారు.

### మరిన్ని వాహన కంపెనీల ధరల తగ్గింపు ప్రకటన

జీఎస్టీ తగ్గింపు నేపథ్యంలో.. తమ వాహనాల ధరలు ఎంతవరకు తగ్గుతాయన్న దానిపై మరిన్న వాహన తయారీ కంపెనీలు ప్రకటనలు జారీ చేశాయి. ద్విచక్ర వాహనాల సంస్థలు యమహా తమ వాహనాలపై రూ.17,581 వరకు.. బజాజ్ రూ.20 వేలవరకు తగ్గింపు ఉంటుందని తెలిపాయి. మోడళ్లు, వేరియంట్లను బట్టి తమ కార్ల ధరలు రూ.57 వేల నుంచి రూ.95వేల వరకు తగ్గుతున్నట్టు హోండా కార్ల కంపెనీ వెల్లడించింది. ఇక టాటా అనుబంధ సంస్థ జాగ్వార్ లాండ్ రోవర్ (జేఎల్ఆర్) తమ వాహనాల ధరలు రూ.4.5 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు.. వోల్వో సంస్థ తమ కార్ల ధరలు రూ.6.9 లక్షల వరకు తగ్గుతున్నట్టు ప్రకటించాయి.

## లోకం తీరు




## పేద దేశాలకు సవాల్‌గా మధుమేహం

» పరీక్షించుకోని 44 శాతం మంది

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సమస్యల్లో మధుమేహం ఒకటి. మధుమేహంతో బాధపడుతున్న చాలామందిలో అసలు తమకు ఈ సమస్య ఉన్నట్టే తెలియడం లేదు. 2023లో ప్రపంచంలోని మధుమేహ రోగుల్లో దాదాపు 44 శాతం మంది పరీక్షలకు దూరంగా ఉంటున్నారని తాజా అధ్యయనంలో గుర్తించారు. పేద, మధ్య ఆదాయ దేశాలకు ఈ పరిస్థితి ఒక సవాల్‌గా మారిందని ఈ అధ్యయనం పేర్కొంది. లాన్సెట్ డయాబెటిస్, ఎండోక్రినాలజీ జర్నల్‌లో ప్రచురించిన వివరాల ప్రకారం.. 2023లో భారత్‌లోని మధుమేహ జనాభాలో 43.6 శాతం మందికి వ్యాధి ఉన్నట్టు తెలీదు. అయితే వ్యాధి నిర్ధారణ అయిన వారిలో 97 శాతం మంది చికిత్స పొందుతున్నారని 'గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ (జీబీడీ)' పేరిట అధ్యయనం చేపట్టిన అంతర్జాతీయ పరిశోధకుల బృందం గుర్తించింది. 2050 నాటికి ప్రపంచవ్యాప్తంగా మధుమేహ రోగుల సంఖ్య 130 కోట్లకు చేరుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

# 'కోయంబత్తూరు వాజ్‌పేయి' సీపీఆర్

» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తమిళనాడులో రథయాత్ర

చెన్నై, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత 15వ ఉపరాష్ట్రపతిగా తమిళనాడుకు చెందిన సీపీ రాధాకృష్ణన్(సీపీఆర్) ఎన్నికవడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తిరుప్పూర్‌కు చెందిన వ్యాపార, వ్యవసాయ కుటుంబంలో సీకే పొన్నుస్వామి-కె.జానకి దంపతులకు 1957 అక్టోబరు 20వ తేదీన ఆయన జన్మించారు. సీపీఆర్‌కు భార్య సుమతి, ఇద్దరు పిల్లలున్నారు. తొలి నుంచి సౌమ్యుడిగా పేరున్న సీపీఆర్‌ను అందరూ ముద్దుగా 'కోయంబత్తూర్ వాజ్‌పేయి'గా పిలుచుకుంటారు. తూత్తుకుడిలోని వీవోసీ కాలేజీలో బీబీఏ చదివిన రాధాకృష్ణన్.. టేబుల్ టెన్నిస్‌లో కాలేజీ చాంపియన్. చిన్నతనం నుంచే ఆయన ఆర్ఎస్ఎస్, భారతీయ జనసంఘ్‌లతో మమేకమయ్యారు. 1974లో జనసంఘ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. అనంతరం 1980లో బీజేపీలో చేరారు. 1998 ఫిబ్రవరిలో కోయంబత్తూరులో వరుస బాంబు పేలుళ్లు జరిగాయి. అనంతరం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి 1.50 లక్షల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించారు. అనంతరం మళ్లీ 1999లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అదే స్థానం నుంచి 55 వేల వేట్ల మెజారిటీతో గెలిచి సత్తా చాటారు. 2004లో సీపీఐ నేత కె.సుబ్బరాయన్ చేతిలో పరాజయం పాలయ్యారు. 2014, 2019లలో కూడా ఆయన కోయంబత్తూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసినా విజయం సాధించలేకపోయారు. 2004 నుంచి రెండేళ్లపాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించిన సీపీఆర్.. దేశవ్యాప్తంగా నదులను అనుసంధానించాలని, అంటరానితనాన్ని నిర్మూలించాలని, ఉగ్రవాదాన్ని తుదముట్టించాలని కోరుతూ 93 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా రథయాత్ర చేపట్టారు. తరువాత బీజేపీ జాతీయ కార్యవర్గంలోనూ పని చేశారు. 2016 నుంచి నాలుగేళ్లపాటు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ పరిధిలోకి వచ్చే కొబ్బరి పీచు బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరించారు.

### నాలుగు రాష్ట్రాలకు గవర్నర్

సీపీఆర్‌కు పార్టీ పట్ల ఎనలేని విధేయత, భవిష్యత్ ప్రణాళికల వ్యూహరచన వంటి వాటిని గమనించిన ప్రధాని మోదీ.. ఆయనను గవర్నర్‌గా నియమించారు. అనతికాలంలోనే సీపీఆర్ నాలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా వ్యవహరించడం విశేషం. 2023 ఫిబ్రవరి 18వ తేదీన జార్ఖండ్ గవర్నర్‌గా పదవీప్రమాణం చేసిన సీపీఆర్.. తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఇన్‌చార్జ్ గవర్నర్‌గా కొంతకాలం అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం 2024 జూలై 27లో మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. దక్షిణ భారత వ్యక్తికి ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వాలని నిర్ణయించిన ప్రధాని.. సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

### తమిళనాట నుంచి మూడో ఉపరాష్ట్రపతి

తమిళనాడు నుంచి ఇప్పటి వరకు ఇద్దరు ఉపరాష్ట్రపతి పదవిని అధిరోహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదట 1952 మే 13 నుంచి 1957 మే 13 వరకు ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత ఐదేళ్లు కూడా ఆయన ఆ పదవిలో కొనసాగారు. అనంతరం ఆయన రాష్ట్రపతిగానూ వ్యవహరించారు. ఆయన తర్వాత కాంగ్రెస్ సీనియర్ నేత ఆర్.వెంకట్రామన్ ఉపరాష్ట్రపతిగా (1984-1987) వ్యవహరించడంతో పాటు ఆ తరువాత రాష్ట్రపతి పదవిని కూడా అధిరోహించారు. నాలుగు దశాబ్దాల తరువాత మళ్లీ రాష్ట్రాన్ని ఉపరాష్ట్రపతి పదవి వరించింది. తమిళ ప్రాంతం నుంచి ఆ పదవికి ఎన్నికైన మూడో వ్యక్తిగా సీపీఆర్ రికార్డులకెక్కారు.



చెన్నైలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సంబరాలు చేసుకుంటున్న పార్టీ నేతలు, శ్రేణులు

# కొత్త దళపతి.. తిరుపతి!

### మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియామకం!

హైదరాబాద్, కోరుట్ల, కోరుట్ల రూరల్, చర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ప్రధాన కార్యదర్శిగా తిప్పిరి తిరుపతి (58) అలియాస్ దేవ్‌జీ నియమితులైనట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని మావోయిస్టు పార్టీ అధికారికంగా ప్రకటించనప్పటికి, పోలీసు నిఘా వర్గాలు అవుననే అంటున్నాయి. సీపీఐ (మావోయిస్టు) పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఈ ఏడాది మే 21న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన విషయం తెలిసిందే. నక్సలైట్ ఉద్యమం చరిత్రలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోవటం ఇదే ప్రథమం. తదుపరి ప్రధాన కార్యదర్శిగా పార్టీ ఎవరిని ఎంపిక చేస్తుందనే విషయమై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో మావోయిస్టు పార్టీలో నెంబర్ టూ స్థానంలో ఉన్న తిరుపతి పేరు బలంగా విన్పించింది. ఈ నేపథ్యంలోనే, ఆయన పార్టీ అధిపతిగా నియమితులయ్యారని, ఈ మేరకు మావోయిస్టు పార్టీ ఒక లేఖను విడుదల చేసినట్లు తాజాగా ప్రచారం జరుగుతోంది. తిరుపతి ప్రస్తుతం సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్‌గా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. 2003లో తిరుపతిలోని అలిపిరిలో చంద్రబాబుపై జరిగిన దాడిలో నంబాల కేశవరావుతో పాటు తిరుపతి పాత్ర ఉన్నట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. 2010లో దంతెవాడ సమీపంలో 74 మంది సెంట్రల్ రిజర్వ్ జవాన్లను పొట్టన పెట్టుకున్న నక్సల్స్ దాడికి తిరుపతి సారథ్యం వహించినట్లు ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. తిరుపతిపై ఎన్ఐఏ రూ.కోటి రివార్డు ప్రకటించినట్లు సమాచారం. మరోవైపు, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ కార్యదర్శిగా ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన మాద్వి హిడ్మా అలియాస్ సంతోష్‌ని మావోయిస్టు పార్టీ నియమించిటనట్లు తెలుస్తోంది. గతంలో దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ అనేది లేనప్పటికీ పార్టీకి కొత్త రూపం తీసుకొచ్చేందుకు ఈ పోస్టుని పార్టీ కేటాయించినట్లు సమాచారం. బస్తర్ అడవుల్లోని దండకారణ్యంలో మాద్వి హిడ్మాకు మంచి పట్టుంది. దాడులు చేసి తప్పించుకోవటంలో ఆరితేరిన వ్యక్తిగా చెబుతుంటారు. హిడ్మా చేసిన పలు దాడుల్లో దాదాపు 200 మందికి పైగా పోలీసులు, జవాన్లు మృతి చెందినట్లు సమాచారం. అడవుల్లోని గిరిజనులతో మాద్వి హిడ్మా మమేకమై ఉంటాడని, పేదలకు సాయం చేస్తాడని.. అందువల్లే ఇంతకాలం పోలీసులకు దొరకలేదని ప్రచారం.

### కోరుట్ల నుంచి అజ్ఞాతంలోకి..

తిరుపతి కరీంనగర్ జిల్లా కోరుట్లకు చెందినవారు. ఆయన తల్లిదండ్రులు గంగుబాయి, వెంకట నర్సయ్య. వారికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉండగా తిరుపతి పెద్ద కుమారుడు. పాఠశాల, ఇంటర్ విద్యను తిరుపతి కోరుట్లలో పూర్తి చేశారు. 1978 సెప్టెంబరు 9న జగిత్యాలలో కొండపల్లి సీతారామయ్య వర్గం 'జగిత్యాల జైత్రయాత్ర' పేరుతో నిర్వహించిన భారీ బహిరంగ సభ తిరుపతిని విప్లవ రాజకీయాలవైపు మళ్లించినట్లు చెబుతారు. ఈ సభకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన రైతులు, కూలీలు, ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. గణపతి, కిషన్‌జీ, శీలం నరేశ్, మైరి గంగారాం, గజ్జెల గంగారాం, ఓదెలు, గద్దర్ తదితరులు పాల్గొని ప్రజలను ఉత్తేజ పరిచారు. ఈ సభకు హాజరైన తిరుపతి అనంతరకాలంలో, 1983లో రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)లో చేరారు. కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్న సమయంలో నిర్బంధం పెరగడంతో 1984లో అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, వరంగల్, హన్మకొండ తదితర ప్రాంతాల్లో దళ నాయకుడిగా, కార్యదర్శిగా, కమిటీ సభ్యుడిగా పని చేశారు. బీదర్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో మావోయిస్టు పార్టీ ఆయుధ కర్మాగార బాధ్యుడిగా ఆయన విధులు నిర్వహించినట్లు సమాచారం. ఆయుధాలు తయారు చేయడంలో తిరుపతికి ప్రావీణ్యం ఉందని చెబుతారు. పార్టీకి కార్యకర్తలను సమీకరించటం, వారికి శిక్షణ ఇవ్వటంలోనూ ఆయనది కీలకపాత్ర. మావోయిస్టు పార్టీలో తిరుపతి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయనను ఆంధ్ర, తెలంగాణలో తిరుపతి అని పిలుస్తుండగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లో దేవ్‌జీగా పిలుస్తారు. నల్లగొండకు చెందిన సృజనను తిరుపతి వివాహం చేసుకున్నారన్న ప్రచారం ఉంది. ఆపరేషన్ కగార్, వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో తిరుపతి పశ్చిమ బెంగాల్ వైపు వెళ్లి ఉంటారని పోలీసు వర్గాలు అనుమానిస్తున్నాయి.

### లొంగిపో! పెదనాన్నా!..

ఈ ఏడాది మే 29న తిరుపతి తమ్ముడు గంగాధర్ కూతురు సుమ.. 'పెదనాన్నా! మావోయిస్టు ఉద్యమాన్ని వదిలిపెట్టి ప్రభుత్వానికి లొంగిపో!' అని కోరుతూ రాసిన లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తిరుపతి ప్రస్తుతం మావోయిస్టు పార్టీ సారథిగా బాధ్యతలు చేపట్టినట్లు వార్తలు వెలువడటంతో కోరుట్ల తదితర ప్రాంతాల్లో స్థానికంగా చర్చనీయాంశమైంది.



జగిత్యాల జిల్లా కోరుట్లలోని తిరుపతి ఇల్లు; మాద్విహిడ్మా

### తెలుగు వ్యక్తులే సారథులు

నాటి పీపుల్స్‌వార్ నుంచి నేటి మావోయిస్టు పార్టీ వరకు సాయుధ పోరాటానికి తెలుగువారే సారథ్యం వహించే పరంపర కొనసాగుతోంది. తొలుత కొండపల్లి సీతారామయ్య, తరువాత ముప్పాళ్ల లక్ష్మణరావు, నంబాల కేశవరావు, నేడు తిరుపతి అలియాస్ దేవ్‌జీ పార్టీ చీఫ్‌లుగా బాధ్యతలు చేపట్టారు. వీరందరూ తెలుగు వారే కావడం విశేషం.

## పెన్షన్ కోసం లైన్‌లో ఉన్న వృద్ధులపై రష్యా గ్లైడ్ బాంబు

» 21మంది మృతి.. 30మందికి గాయాలు

కీవ్, సెప్టెంబరు 9: ఉక్రెయిన్‌లో ఘోరం జరిగింది. మంగళవారం రష్యా ప్రయోగించిన గ్లైడ్ బాంబ్ ఒకటి డోనెస్క్ ప్రాంతంలోని యరోవా గ్రామంలో పెన్షన్ కోసం లైన్‌లో నిల్చున్న వృద్ధులపై పడింది. ఈ ఘటనలో 21మంది చనిపోయారు. దాదాపు 30మంది గాయపడ్డారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ విషయాన్ని వెల్లడించారు. రష్యా చర్యను తీవ్రంగా ఖండించారు. రష్యా దారుణాలపై ప్రపంచం మౌనంగా ఉండొద్దని కోరారు. మరిన్ని ఆంక్షలు విధించాలని విజ్ఞప్తి చేశారు. రష్యా దాడుల్లో ఉక్రెయిన్‌లో ఇప్పటివరకు 12వేల కంటే ఎక్కువ మంది సాధారణ పౌరులు మరణించినట్లు ఆయన వెల్లడించారు.

## దోహాపై ఇజ్రాయెల్ బాంబులు

» ఇద్దరు హమాస్ నేతలు.. ముగ్గురు అంగరక్షకుల మృతి

» మాదే బాధ్యత: నెతన్యాహు

» ఖండించిన సౌదీ, ఫ్రాన్స్

» బంకర్‌లోకి ఇరాన్ సుప్రీంలీడర్!

టెల్‌అవీవ్, సెప్టెంబరు 9: ఖతార్ రాజధాని దోహాలో ఉన్న హమాస్ తిరుగుబాటుదారులే లక్ష్యంగా ఇజ్రాయెల్ మంగళవారం "ఆపరేషన్ జడ్జిమెంట్ అసెంబ్లీ" పేరుతో బాంబు దాడులు చేసింది. నగరంలోని ఖతారా జిల్లా పరిధిలో పలు చోట్ల పేలుళ్లు సంభవించాయని, ఆకాశంలో దట్టమైన పొగలు అలుముకున్నాయని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. హమాస్ సీనియర్ నాయకులను గురిపెట్టి, ఈ దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) తెలిపింది. ఈ దాడుల్లో హమాస్ నేతలు ఖలీల్-అల్-ఖాయా, ఖాలెద్ మషాల్‌తో పాటు.. వారి అంగరక్షకులు ముగ్గురు చనిపోయారని భావిస్తున్నట్లు పేర్కొంది. "సామాన్య పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా.. అత్యంత కచ్చితత్వంతో దాడులు చేశాం. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్ పౌరులపై హమాస్ దాడి జరిపింది. ఆ దృశ్యాలను టీవీల్లో చూస్తూ.. 'థాంక్స్ గివింగ్ ప్రేయర్స్' చేసిన వారిలో ఖలీల్, ఖాలెద్ ఉన్నారు" అని వెల్లడించింది. గాజాలోనూ మంగళవారం ఏడు టవర్లను లక్ష్యంగా చేసుకుని, జరిపిన దాడుల్లో హమాస్ నేతలు చనిపోయినట్లు తెలిపింది. అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైతం దోహా దాడులకు తమదే బాధ్యత అని ప్రకటించారు. ఈ దాడులను ఫ్రాన్స్, సౌదీ అరేబియా ఖండించాయి. సౌదీ యువరాజు సల్మాన్ ఇజ్రాయెల్ చర్యను అంతర్జాతీయ నేరంగా పేర్కొంటూ.. ఖతార్‌కు తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. కాల్పుల విరమణ దిశలో ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం.!



# కూలిన గురుకుల హాస్టల్ భవనం

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు
- భోజన విరామ సమయంలో కూలడంతో తప్పిన పెనుప్రమాదం
- సంగారెడ్డి జిల్లా లింగంపల్లిలో ఘటన
- ఘటనాస్థలిని పరిశీలించిన మంత్రి దామోదర రాజనర్సింహ


గాయపడ్డ శివానంద్, జ్ఞానేశ్వర్, అరవింద్

మునిపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని గురుకుల పాఠశాలలోని హాస్టల్ భవనం మంగళవారం కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు. పాఠశాలకు చెందిన విద్యార్థులంతా ఆ భవనంలోనే వసతి పొందుతున్నారు. కానీ, అదృష్టం కొద్దీ భోజన విరామ సమయంలో భవనం కూలడం వల్ల పెను ప్రమాదమే తప్పింది. లింగంపల్లి గురుకుల పాఠశాలలో మొత్తం 601 మంది విద్యార్థులు ఉన్నారు. ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న పాఠశాలలోని ఓ భవనంలో విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. ఎప్పట్లాగే విద్యార్థులంతా మంగళవారం ఉదయం హాస్టల్ నుంచి పక్కనే ఉన్న పాఠశాలకు వెళ్లిపోయారు. అయితే, భోజన విరామ సమయంలో హాస్టల్ ముందుకు ముగ్గురు విద్యార్థులు వస్తున్న క్రమంలో.. ఆ భవనం వెనుక భాగం గోడ ఒక్కసారిగా కూలిపోయింది. ఆ పెచ్చులు, ఇటుకలు తగిలి తిరూర్ జ్ఞానేశ్వర్(పదో తరగతి), శివ(ఇంటర్ ఫస్టియర్), అరవింద్(ఆరో తరగతి) అనే విద్యార్థులు గాయపడ్డారు. బాధిత విద్యార్థులను పాఠశాల సిబ్బంది హుటాహుటిన జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇక, విషయం తెలిసి ఘటనాస్థలికి చేరుకున్న టీఎస్ఎఫ్‌డీ, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు శిథిలాల కింద ఉన్న విద్యార్థుల సామగ్రి, ఇతర వస్తువులను తరలించే పని మొదలుపెట్టాయి. వారు విద్యార్థుల ట్రంక్ పెట్టెలను బయటకు తీస్తున్న క్రమంలో భవనంలో మిగిలిన భాగం కూడా నేలమట్టమైంది. శిథిలాల కింద 80 మంది ఏడో తరగతి విద్యార్థులకు చెందిన వస్తువులు ఉన్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ఇక, పాఠశాల భవనం కూలిన విషయం తెలుసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. పాఠశాల, హాస్టల్‌లో నెలకొన్న సమస్యలపై నివేదిక ఇవ్వాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురభి చైతన్యను ఆదేశించారు. అలాగే, పాఠశాలల్లో పురాతన భవనాలను గుర్తించి వెంటనే కూల్చివేయాలని అధికారులకు సూచించారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, డీఈఓ వెంకటేశ్వర్లు పాఠశాల భవనాన్ని పరిశీలించారు. భవనం శిథిలావస్థలో ఉన్న విషయాన్ని అధికారుల దృష్టికి ఎందుకు తీసుకురాలేదంటూ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య లింగంపల్లి గురుకుల పాఠశాల నిర్వాహకులపై ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనంలో విద్యార్థులు ఉన్న సమయంలో ప్రమాదం జరిగి ఉంటే పరిస్థితి ఏంటి ? అని ప్రశ్నించారు. విద్యార్థులు ఉన్నప్పుడు ఘటన జరిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేందన్నారు. విద్యార్థులకు తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేయించిన కలెక్టర్.. పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం రూ.7 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. భవనం కూలిన సంగతి తెలిసి మిగిలిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు.

# ముగ్గురి ఉసురు తీసిన ట్యాంకు

- మోటారు ఆన్ చేసేందుకు లోపలికి వెళ్లి ఊపిరాడక మృతి
- మరొకరికి అస్వస్థత.. మృతుల్లో ఒకరిది ఏపీలోని తణుకు?

చర్ల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. కొత్తగూడెం జిల్లా చర్ల మండలం ఉంజుపల్లిలో ఈ విషాద ఘటన జరిగింది. మృతుల్లో ఇద్దరు కూలీలు, మరొకరు రైతు. ఉంజుపల్లిలో మిషన్ భగీరథ పథకం కింద 90వేల లీటర్ల సామర్థ్యంతో కూడిన వాటర్ ట్యాంకును నిర్మిస్తున్నారు. ప్రస్తుతం స్లాబ్ వేసే పనులు జరుగుతున్నాయి. మంగళవారం ట్యాంకులోని నీటిని తొలగించేందుకుగాను అందులో ఉన్న డీజిల్ మోటారును ఆన్ చేసేందుకు తొలుత కార్మికుడు నీలం తులసీరాం (37) దిగాడు. లోపల ఊపిరాడకపోవడంతో బిగ్గరగా కేకలు వేస్తూ పడిపోయాడు. ఇది గమనించిన కార్మికులు ఇసాక్ (50), అప్పలరాజు లోపలికి దిగారు. ఊపిరాడకపోవడంతో వారూ అపస్మారక స్థితికి చేరుకున్నారు. కార్మికులు కేకలు వేయడంతో అదే దారిన వెళ్తున్న రైతు కాకా మహేశ్ (36) వారిని కాపాడేందుకు లోపలికి దిగాడు. ఈ క్రమంలో మహేశ్ కూడా ఊపిరాడక పడిపోయాడు. దీనిపై చర్ల పోలీసులకు సమాచారం అందడంతో వారొచ్చి.. నలుగురినీ బయటకు తీశారు. అప్పటికే తులసీరాం, మహేశ్ మృతిచెందారు. అపస్మారక స్థితిలో ఉన్న ఇసాక్, అప్పలరాజును భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఇసాక్ మార్గమధ్యలోనే మృతిచెందారు. అప్పలరాజు పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. తులసీరాంది చర్ల మండలం లింగాపురం. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మహేశ్‌ది ఉంజుపల్లి. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇసాక్ స్వస్థలం ఏపీలోని తణుకుగా తెలుస్తోంది. చికిత్స పొందుతున్న అప్పలరాజుది కూడా ఏపీలోని కాకినాడ అని తెలుస్తోంది.

## ఎల్ఆర్ఎస్ జారీకి రూ.4.50 లక్షల లంచం

- ఏసీబీకి చిక్కిన నార్సింగ్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి


లంచం సొమ్ముతో మణిహారిక

నార్సింగ్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ వెయ్యి గజాల ప్లాట్‌కు సంబంధించిన ఎల్ఆర్ఎస్ అనుమతుల జారీకి రూ.4.50 లక్షలు డిమాండ్ చేసిన నార్సింగ్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి మణిహారిక ఏసీబీకి పట్టుబడ్డారు. మంచిరేవులకు చెందిన వినోద్‌కు వెయ్యి గజాల ప్లాట్ ఉంది. ఆ భూమికి ఎల్ఆర్ఎస్ పర్మిషన్ క్లియర్ చేసేందుకు గండిపేట మండలం నార్సింగ్ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారిణి మణిహారిక రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. చివరికి రూ.4.5 లక్షలకు అంగీకరించారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని వినోద్ ఏసీబీని ఆశ్రయించారు. మంగళవారం వినోద్ నుంచి మొదటి విడతగా రూ.4లక్షలు తీసుకుంటుండగా మణిహారికను పట్టుకున్న అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు. కాగా, కొద్ది రోజుల క్రితం మణిహారికను చేవెళ్ల ప్రాంతంలో పట్టుకొనేందుకు ఏసీబీ ప్రయత్నించినట్టు తెలిసింది. చేవెళ్ల ఇన్‌చార్జి టౌన్‌ప్లానింగ్ అధికారిగా ఉన్న మణిహారికపై తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్నాయి. చేవెళ్లలో ప్రైవేటు వ్యక్తులను పెట్టి వసూళ్లు చేయించినట్లు సమాచారం.

# డ్రగ్స్ కేసుల పేరుతో బెదిరిస్తూ.. ఎస్టీఎఫ్ కానిస్టేబుల్ వసూళ్లపర్వం

- ఇన్‌స్పెక్టర్‌నని చెప్పుకుంటూ అరాచకాలు
- సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలే లక్ష్యం
- అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్టీఎఫ్)లో ఓ కానిస్టేబుల్.. ఇన్‌స్పెక్టర్‌నని నమ్మబలుకుతూ అక్రమాలకు పాల్పడిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఉమామహేశ్వర్‌రావు అలియాస్ మహేశ్వర్‌రావు ఎస్టీఎఫ్-బీ బృందంలో కానిస్టేబుల్. కానీ, తాను ఎస్సైని, సీఐని అని చెప్పుకుంటూ సినీ ప్రముఖులను, వ్యాపారులను, సామాన్యులను బెదిరించి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏడేళ్లుగా ఎస్టీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఉమామహేశ్వర్‌రావు ట్రూకాలర్‌లో తన పేరును ఇన్‌స్పెక్టర్‌గా పెట్టుకుని, డ్రగ్స్‌ను పట్టుకోవడంలో దిట్టనని చెప్పుకుంటూ మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అధికారాన్ని అడ్డంపెట్టుకుని మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడం, డబ్బులు ఇవ్వకుంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు సమాచారం. సినీ పరిశ్రమకు చెందిన కొంతమంది ప్రముఖులను కూడా ఉమామహేశ్వర్‌రావు బెదిరించడంతో వారు టాస్క్ ఫోర్స్ పోలీసులను ఆశ్రయించారు. దాంతో పోలీసులు అతడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతడు ఒక్కడే ఈ నేరాలకు పాల్పడ్డాడా లేక ఎవరైనా అధికారులు, ఇతరులు సహకరిస్తున్నారా అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అతడి కాల్‌డేటా, ఆర్థిక లావాదేవీలు, సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అతను ఇప్పటి వరకు ఎంతమందిని బెదిరించాడు, ఎంత డబ్బులు వసూలు చేశాడనే వివరాలు సేకరిస్తున్నారు.

### సస్పెండ్ అయినా మారని తీరు

ఉమామహేశ్వర్‌రావు ఇటీవల బంజారాహిల్స్‌లో ఒక బార్ నిర్వాహకుడిని బెదిరించి రూ.6 లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. ఒక కేసులో నలుగురిపై డ్రగ్స్ కేసు కూడా పెడతానని బెదిరించి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు మహిళలను బెదిరించి రూ.2 లక్షలు తీసుకుని, ఆపై అసభ్యంగా ప్రవర్తించడంతో నాలుగు రోజుల క్రితం ఎక్సైజ్ ప్రధాన కార్యలయం వద్ద అతడికి దేహశుద్ధి చేశారనే ప్రచారం సాగుతోంది. గతంలో ఎస్టీఎఫ్-ఏ టీంలో ఉండగా కూడా ఉమామహేశ్వర్‌రావు పలువురిని బెదిరించి డబ్బులు వసూలు చేయడంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆరు నెలలు తిరగకుండానే మరో టీమ్ (ఎస్టీఎఫ్-బీ)లోకి రాగలిగాడు. ఎక్సైజ్ పోలీసు సంఘం నాయకుడికి బంధువు కావడంతో అతడి అరాచకాలకు అడ్డులేకుండా పోయింది. జాయింట్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ల పర్యవేక్షణ లోపంతో ఉమామహేశ్వర్‌రావు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

## సైబర్ మోసగాళ్ల వలకు చిక్కిన టెకీ

- గ్రోయాప్‌లో రూ.22.30 లక్షల పెట్టుబడి హాంఫట్
- గద్వాల జిల్లా ఉండవల్లి మండలంలో ఘటన

అలంపూరు చౌరస్తా, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను సైబర్ నేరగాళ్లు మోసం చేసిన ఘటన తాజాగా వెలుగు చూసింది. గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ఇటిక్యాలపాడుకు చెందిన వెంకటేశ్వరరెడ్డి.. వర్క్ ఫ్రం హోంలో భాగంగా సొంతూళ్లోనే ఉన్నాడు. రెండేళ్లుగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతున్న బాధితుడు.. జూన్ 25న తన వాట్సా్ప్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేస్తే వచ్చిన గ్రోఅనే యాప్‌లో పెట్టుబడులతో అధిక లాభాలొస్తాయని నమ్మి తొలుత రూ.50 వేలు జమ చేశాడు. రెండ్రోజుల్లోనే రూ.2 లక్షల లాభం వచ్చినట్లు మెసేజ్ రావడంతో పొలం తనఖా పెట్టి మరీ.. 9 విడతల్లో మొత్తం రూ.22.30 లక్షలు జమ చేశాడు. రూ.50 లక్షల లాభం చూపడంతో విత్‌డ్రా చేసుకుంటానంటే రూ.13 లక్షల పన్ను చెల్లించాలన్న జవాబు రావడంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే, బజాజ్ ఫైనాన్స్‌లో రుణం ఇస్తామంటూ బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్.. హైదరాబాద్ యూసఫ్‌గూడకు చెందిన వ్యక్తిని మోసం చేసి రూ. 3.04 లక్షలు కొల్లగొట్టారు.

# కమలదళంలో 'కమిటీ' చిచ్చు!

**మా మాటకు విలువ లేకుండాపోయింది.. కొత్త కమిటీ కూర్పుపై ఎంపీలు, ఎమ్మెల్యేల అసంతృప్తి**

- అంత పనికిరాకుండాపోయామా? సీనియర్ నాయకుల ఆగ్రహం



హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కమలదళంలో రాష్ట్ర కమిటీ ఏర్పాటు చిచ్చు రాజేసింది. కమిటీలో ప్రాంతీయ సమతుల్యం లోపించిందని కొందరు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఆరోపిస్తున్నారు. తమ మాటను పట్టించుకోలేదంటూ ఈ కమిటీ కూర్పుపట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రమశిక్షణ గల పార్టీ అయినందున తాము బహిరంగంగా తమ అభిప్రాయాలు వెల్లడించలేకపోతున్నట్లు చెప్పారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్ వైఖరి పట్ల ఎంపీలు, ఎమ్మెల్యేలు మండిపడుతుండటం పార్టీవర్గాల్లో చర్చనీయాంశమైంది. 'ఇది పార్టీ ఆధారిత కమిటీ కాదు.. నాయకుల ఆధారిత కమిటీ. పార్టీ రాష్ట్ర చరిత్రలో ఇంత వ్యతిరేకత ఎన్నడూ కనిపించలేదు' అని బీజేపీ ఎంపీ ఒకరు వ్యాఖ్యానించారు. 'బీజేపీ అంటే నగరాలకు మాత్రమే పరిమితమైన పార్టీ అనే అపప్రద ఇప్పటికే ఉంది.. ఇప్పుడిప్పుడే గ్రామీణ ప్రాంతాలకు చేరువవుతున్న తరుణంలో పార్టీ కమిటీలో 70శాతం పదవులు నగరవాసులకు, అందునా హైదరాబాద్‌లో స్థిరపడ్డవారికే ఇవ్వడం ఎలాంటి సంకేతాలు ఇస్తుందో ఆలోచన చేయకపోవడం విచారకరం. ఇప్పుడు మాకు న్యాయం జరగలేదు. ఇక ఏదో ఒక సెల్ (పార్టీ విభాగం) ఇస్తరు. మాకు అవి కూడావొద్దు. సాధారణ కార్యకర్తలుగానే ఉండిపోతాం' అని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత ఆవేదన వ్యక్తం చేశారు. 'ఎంపీ, ఎమ్మెల్యేల ఎన్నికలతో పాటు మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ మా శ్రమంతా ధారపోశాం. అభ్యర్థులు సహకరించకున్నా పార్టీ కోసం కష్టపడ్డాం.. రెండు సీట్లూ గెలుచుకున్నాం. కనీసం ఈ ఫలితాలను దృష్టిలో ఉంచుకొనైనా మా ప్రాంతానికి కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాల్సింది' అని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత వాపోయారు. 'ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకున్న మాలాంటి వాళ్లకు ఎన్నికల్లో టికెట్లు ఇవ్వరు.. కొత్తగా వచ్చినోళ్లకే ఇచ్చి మమ్మల్ని పనిచేయాలని అంటారు. అయినా, క్రమశిక్షణ గల కార్యకర్తలుగా పనిచేస్తూ వస్తున్నాం. ఇప్పుడు పార్టీకోసం కమిటీలో కూడా పనిచేయడానికి పనికిరానోళ్లమయ్యామా? జిల్లా ఇన్‌చార్జి అంటూ మాతో గొడ్డుచాకిరి చేయిస్తూ పదవులేమో ఇతరులకు ఇస్తారా? కమిటీలో అవకాశం కల్పించేందుకు నాయకులే కరువయ్యారా?' అని సదరు నేత పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌పై మండిపడ్డారు. 'పార్టీ కోసం లాఠీదెబ్బలు తిన్నవాళ్లు.. ప్రాణాలకు తెగించి కొట్లాడినవాళ్లున్నరు.. అలాంటివారిని కాదని కేవలం ఆఫీసుకే పరిమితమయ్యేవారికి కమిటీలో చోటు కల్పించడం దురదృష్టకరం' అని ఉమ్మడి వరంగల్ జిల్లా నేత ఒకరు వాపోయారు. కాగా, గత ఎన్నికల్లో తనను ఓడించేందుకు ప్రయత్నించిన ఓ నేతకు రాష్ట్ర కమిటీలో అవకాశం ఇవ్వొద్దని ఒక ఎంపీ పట్టుబట్టారు. అయితే, తన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంతో సదరు ఎంపీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు పార్టీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తన పార్లమెంటు నియోజకవర్గంలో తాను సూచించిన వ్యక్తికి కాకుండా ఇంకొకరికి కమిటీలో చోటు కల్పించడం పట్ల మరో ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పార్టీవర్గాలు పేర్కొన్నాయి.

### డైనమిక్ టీమ్ ఇది: రాంచందర్‌రావు



బీజేపీ కొత్త రాష్ట్ర కమిటీ డైనమిక్ టీమ్ అని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు వ్యాఖ్యానించారు. యువతను ప్రోత్సహించామని, పారీకి కొత్త రక్తం ఎక్కించే ప్రయత్నం జరిగిందన్నారు. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలకు దాదాపుగా ప్రాతినిధ్యం కల్పించినట్లు తెలిపారు. 'కమిటీ కూర్పులో సామాజిక సమతుల్యం పాటించాం. అన్ని వర్గాలకు అవకాశం ఇచ్చాం. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలతో కలిపితే 35 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి.. అందువల్ల ఇక్కడ కొంత ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాల్సివచ్చింది. కొత్తవారికి అవకాశం ఇచ్చాం.. సీనియర్లకు, పాతవారికి మరో బాధ్యత ఇస్తాం. కమిటీలో చోటు దక్కనంత మాత్రాన వారిని గుర్తించనట్లు కాదు. ఏ నాయకుడూ బాధపడొద్దు.. వారి సేవలను ఏదోవిధంగా వినియోగించుకుంటాం' అని రాంచందర్‌రావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

# 2027 డిసెంబరుకు ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తి

**డిండి ఎత్తిపోతల పథకం కూడా పూర్తి చేస్తాం : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్**

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) సొరంగం తవ్వకాన్ని 2027 డిసెంబరు నెలాఖరుకు పూర్తిచేస్తామని నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దీనిద్వారా 4 లక్షల ఎకరాలకు గ్రావిటీతో సాగునీటిని, సురక్షితమైన తాగునీటిని అందిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నెలకు రూ.1.2 కోట్ల కరెంట్ బిల్లుల భారం తప్పుతుందని ఆయన తెలిపారు. మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి మంగళవారం జలసౌధలో ఆయన ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష జరిపారు. టన్నెల్ కోసం మ్యాగ్నెటిక్ సర్వేను వేగవంతం చేయాలన్నారు. టన్నెల్ పునరుద్ధరణపై అధికారులు రూపొందించిన నివేదిక, సవరణ అంచనాలపై 15వ తేదీన జరుగనున్న మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నట్లు ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తయితే హైలెవల్ కెనాల్ ద్వారా ఉదయసముద్రం ప్రాజెక్టుకు నీటిని తరలించి, లక్ష ఎకరాలకు సాగునీటిని అందిస్తామన్నారు. లోలెవల్ కెనాల్ ద్వారా 80,000 ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. ఇక డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా 8 రిజర్వాయర్ల కింద 3.61 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా పనులు చేస్తున్నామన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచి దుందుభి నదిలో నీటిని పోసి.. రబ్బర్ డ్యామ్ కట్టి, నీటిని డిండి ఎత్తిపోతల పథకం కింద మళ్లిస్తామని, ఈ పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి చేస్తున్నామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీకి అనుబంధంగా నిర్మించిన ఉదయసముద్రం పనులు ఇప్పటికే 70 శాతం మేర పూర్తికాగా.. మిగిలిన పనుల పూర్తిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ పనులు 93 శాతం మేర పూర్తయ్యాయని.. గంధమల్ల రిజర్వాయర్ పరిధిలోని రావల్‌కోల్ లింక్ కెనాల్, తురకపల్లి పనులు పురోగతిలో ఉన్నాయని వెల్లడించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఇప్పటికే నిర్మాణంలో ఉండి.. తుది దశలో ఉన్న ప్రాజెక్టులకు నిధు లు కేటాయించాలని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కోరారు.

### ప్రపంచంలోనే అతిపెద్ద ఇరిగేషన్ టన్నెల్: కోమటిరెడ్డి

ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయితే ప్రపంచంలో అతిపెద్ద ఇరిగేషన్ టన్నెల్‌గా నిలవనుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాజకీయ దురుద్దేశంతో పదేళ్లు ఈ ప్రాజెక్టును పక్కనపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్కట్‌పల్లి మండలం జిల్లాలో ఫ్లోరైడ్ ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఒకటని.. అందుకే బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు చేపట్టామని గుర్తుచేశారు. రూ.3 వేల కోట్లు ఖర్చుచేస్తే ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రాజెక్టున్నీ పూర్తవుతాయన్నారు.

## ఆస్పత్రిలో యువతిపై రేప్ కేసులో కాంపౌండర్ అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువతిపై లైంగిక దాడి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియాకు వివరాలు తెలిపారు. జ్వరంతో బాధపడుతున్న బాధితురాలిని ఆమె తల్లిదండ్రులు ఈ నెల 6న ఆస్పత్రిలో చేర్పించారు. మహారాష్ట్రకు చెందిన పెద్ది దక్షన్ మూర్తి అలియాస్ దక్షిణామూర్తి (23) అదే ఆస్పత్రిలో కాంపౌండర్/ఓటీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. 6న రాత్రి విధుల్లో ఉన్న అతను 7వ తేదీ వేకువజామున బాధితురాలికి మత్తు ఇంజక్షన్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డాడు. నిందితుడు తరచూ అశ్లీల వెబ్‌సైట్లు చూస్తూ, మద్యం తాగి విధులకు హాజరయ్యేవాడు. లైంగిక దాడికి పాల్పడిన రోజు కూడా మద్యం తాగి వచ్చాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

# శాంతిసీమగా మణిపూర్!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 13న మణిపూర్‌ను సందర్శించనున్నారు. ఎప్పుడో జరగాల్సిన ఈ పర్యటన ఆ దుఃఖభూమికి ఇప్పటికైనా ఉపశమనం కలిగిస్తే అదే పదివేలు!

దురదృష్టకర ప్రజాసమూహాల కథలన్నీ వలసపాలనతో ప్రారంభమయ్యాయి. మణిపురీల చరిత్ర ఇందుకు భిన్నంకాదు. బ్రిటిష్ వలస పాలకులు మణిపూర్‌ను కొండ ప్రాంతాలు, మైదాన ప్రాంతాలుగా విభజించి ఆ రెండిటిని వేర్వేరు పరిపాలనా వ్యవస్థల కింద ఉంచారు. ఈ వేర్పాటు కొండ ప్రాంతాలలో అధికంగా ఉండే కుకీజోలు, మైదాన ప్రాంతాలలో సంపూర్ణ ప్రాబల్యమున్న మెయితీల మధ్య వైమనస్యతను సృష్టించింది. అది క్రమంగా తీవ్రతను సంతరించుకుని ఇప్పటికీ వైషమ్యాలను రగుల్కొలుపుతోంది.

కొండ ప్రాంతాలలో ఉండే కుకీజోలు, ఇంకా నాగాలు మొదలైన తెగలవారు రాష్ట్ర జనాభాలో 47 శాతంగా ఉన్నారు. అయితే వీరి అధీనంలో విస్తారమైన భూములు ఉన్నాయి. మైదాన ప్రాంతాలలో ఉండే మెయితీలు రాష్ట్ర జనాభాలో 53 శాతంగా ఉన్నారు వీరికి భూ వసతి తక్కువే అయినప్పటికీ మొదటి నుంచీ రాజకీయ అధికారం చెలాయిస్తున్న సామాజిక వర్గమిది. భూమి హక్కులతో పాటు రాజకీయ అధికారంలో అసమ ప్రాతినిధ్యం విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణలు ఎప్పటి నుంచో ఉన్నాయి. స్వతంత్ర భారతదేశంలో ప్రభుత్వాలు అనుసరించిన విధానాలతో ఆ ఘర్షణలు విషమించాయి. రాష్ట్ర రాజకీయాలపై పెత్తనం చెలాయిస్తున్న మెయితీలు తమకు షెడ్యూల్డు తెగ హోదా సాధించుకునేందుకు పూనుకున్నారు. తద్వారా కొండ ప్రాంతాలలోని భూములను తమ ఆర్థిక బలంతో కైవసం చేసుకోవచ్చునేది వారి ఆలోచన. మణిపూర్ హైకోర్టు 2023 ఏప్రిల్ 14న మెయితీలకు ఎస్టీ హోదా ఇవ్వాలని ఆనాడు అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రభుత్వానికి సూచించింది. మెయితీలకు ఎస్టీ హోదా లభిస్తే కొండ ప్రాంతాల భూములు సమస్తమూ వారి అధీనమవుతాయని తమకు మనుగడే కష్టమవుతుందని కుకీలు ఆందోళనకు గురయ్యారు.

తమ భవిష్యత్తును కాపాడుకునేందుకు కుకీజోలు పోరాటపథం పట్టారు. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ పూర్తిగా మెయితీ పక్షపాతం వహించారు. కుకీజోల అలజడిని నిర్లక్ష్యం చేశారు. పైగా వారిని నార్కో టెర్రరిస్టులు అని నిందించారు. దీంతో కుకీజోలు మే 3న ఒక బృహత్ నిరసన ప్రదర్శనకు ఉద్యుక్తులయ్యారు. మెయితీలు ప్రతిదాడులకు పూనుకున్నారు. హింస ప్రజ్వరిల్లింది. అది దావానలంలా రాష్ట్రమంతటా వ్యాపించింది. వందల మంది బలయ్యారు. వేలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రెండేళ్లు దాటినా ఆ హింసాగ్నులు ఇంకా పూర్తిగా ఆరనేలేదు.

మెయితీలు, కుకీజోలను దహించివేస్తున్న పరస్పర విద్వేషాగ్నులు మణిపురి సమాజాన్ని సైనికీకరణ చేశాయనడం సత్యదూరం కాదు. ఇంత జరుగుతున్నా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎడతెగని మౌనమే పాటించింది. రాజ్యాంగ వ్యవస్థలు కూలిపోయిన సంక్షోభానికి కారకుడైన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించేందుకు కూడా సంకల్పించలేదు. చివరకు పరిస్థితులు పూర్తిగా దిగజారిపోయిన తరువాత బీరేన్ సింగ్ రాజీనామా చేశారు. ఆయన స్థానంలో ఎవరిని నియమించాలో నిర్ణయించుకోలేకపోయిన మోదీ సర్కార్ రాష్ట్రపతి పాలనను విధించింది. అయినా పరిస్థితులు యథాతథంగా కొనసాగుతున్నాయి.

మెయితీలతో తమ సహజీవనం అసాధ్యమని, తమ ప్రాంతాలకు శాసన నిర్మాణ అధికారాలతో కేంద్ర పాలిత ప్రాంత హోదా నివ్వాలని కుకీజోలు డిమాండ్ చేస్తున్నారు. మెయితీలు, కుకీజోల మధ్య హింసాత్మక ఘర్షణలను నివారించేందుకు ఇరువర్గాల ప్రాంతాల మధ్య తటస్థ మండలాల నేర్పాటు చేసి వాటిని కేంద్ర భద్రతా బలగాల కాపలాలో ఉంచారు. దీనివల్ల మణిపూర్‌లో ప్రజల, సరుకుల రవాణా నిర్నిరోధంగా సాగడం అసాధ్యమైపోయింది. మరో సమస్య ఘర్షించుకుంటున్న సామాజిక వర్గాల సైనికీకరణ. ఈ పరిస్థితులలో రెండు కీలక పరిణామాలు సంభవించాయి. అవి: కుకీజో మిలిటెంట్ గ్రూపులతో సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ ఒప్పందం పునరుద్ధరణ; జాతీయ హైవే–02ను ప్రజల, సరుకుల స్వేచ్ఛాయుత రవాణాను అనుమతించేందుకు కుకీజో గ్రూపుల నిర్ణయం. మణిపూర్‌లో పరిస్థితులు మెరుగుపడాలంటే కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించాలి. ఇది జరగాలంటే బీజేపీతో సహా అన్ని రాజకీయ పక్షాలు విశాల దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవల్సి ఉన్నది. 'ఎట్టి పరిస్థితులలోను హింసాత్మక ఘర్షణలు మళ్లీ ప్రజ్వరిల్లకుండా చూడాల్సిన బాధ్యత నాయకులపై ఉన్నది. ఇందుకు విరుద్ధంగా వ్యవహరించేవారు నాయకులే కారని' నిక్కచ్చిగా చెప్పుతూ 'ఒక కొత్త ఆరంభం మణిపూర్‌కు అవసరం' అని ప్రజామేధావి ఒకరు వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో ఒక కొత్త ఉదయం ఉదయించి, శాంతిసీమగా ఆ ఈశాన్య భారత రాష్ట్రం పునరుజ్జీవం పొందేందుకు ప్రధాని మోదీ పర్యటన నాంది అవ్వాలనేదే సమస్త భారతీయుల ఆకాంక్ష.

# సర్వేపల్లి నుంచి చంద్రాపురం దాకా..



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


అనుకున్నట్లుగానే ఉపరాష్ట్రపతి ఎన్నిక విషయంలో పెద్ద ఆశ్చర్యాలు ఏమీ లేవు. ఎన్డీఏ అభ్యర్థి చంద్రాపురం పొన్నుసామి రాధాకృష్ణన్‌కే మెజారిటీ ఓట్లు ఉన్నాయి కనుక ఆయన అవలీలగా ఉపరాష్ట్రపతిగా ఎంపికయ్యారు. ఇరుపక్షాల మధ్య టొటాటొటి ఓట్ల తేడా ఉంటే ఈ ఎన్నిక ఆసక్తికరంగా ఉండేది. కాని ఎన్డీఏ మిత్రపక్షాలన్నీ కలిసికట్టుగా ఉండడమే కాక, ఎన్డీఏ యేతర పార్టీలు కూడా కొన్ని మద్దతు ప్రకటించడం, కొన్ని పార్టీలు తటస్థంగా ఉంటామని ప్రకటించడంతో ఈ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో ముందుగానే స్పష్టమైపోయింది. సీపీ రాధాకృష్ణన్‌కు రావాల్సిన ఓట్ల కంటే ఎక్కువ రాగా ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పడాల్సిన ఓట్ల కంటే తక్కువ పడ్డాయి. ప్రతిపక్షాలకు చెందిన 315 మంది ఎంపీలూ ఓటు వేశారు అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ ప్రకటించిన కొద్ది గంటల్లోనే జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి 300 ఓట్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ప్రతిపక్షాల శిబిరం నుంచే క్రాస్ ఓటింగ్ జరిగిందన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. ప్రజాస్వామ్యంలో ఇది అనూహ్యం కాదు. ఆశ్చర్యకరమయిన విషయం ఏమంటే ఇరుపక్షాలు వర్క్‌షాప్‌లు, మాక్ ఓటింగ్‌లు నిర్వహించినా 15 ఓట్లు చెల్లకుండా పోయాయి!

ఉపరాష్ట్రపతి పదవి మన దేశంలో రెండవ అత్యున్నత రాజ్యాంగ హోదా. ఇది కూడా లాంఛనమైన పదవి అయినప్పటికీ జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా తర్వాత జరిగిన ఈ ఎన్నికకు ప్రాధాన్యత పెరిగింది. మోదీ ప్రభుత్వమే ఏరి కోరి తెచ్చుకున్న జగదీప్ ధన్‌ఖడ్ వారికే తలనొప్పిగా మారడంతో ఆయనను వదిలించుకున్నారన్న విషయం స్పష్టమే అయినప్పటికీ ఉపరాష్ట్రపతి పదవికి ఉన్న ప్రాధాన్యత తగ్గలేదు. అందుకు కారణం తొలి ఉపరాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ నుంచి ఎందరో ఆ పదవికి వన్నె తెచ్చారు. రాజ్యసభ చైర్మన్‌గా కూడా ఉపరాష్ట్రపతి పదవి చర్చలో ఉంటుంది కనుక ఆ పదవిలో ప్రాధాన్యతను విస్మరించలేనిది. వారి ప్రతి చర్యనూ ప్రజలు గమనించే అవకాశం ఉంటుంది. రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికైన రాధాకృష్ణన్ సాధు స్వభావి, మృదుభాషి. ఉపరాష్ట్రపతి పదవికి ఉన్న ప్రాధాన్యతను కాపాడేందుకు ఆయన ప్రయత్నిస్తారనడంలో సందేహం లేదు. రాధాకృష్ణన్‌కు ఉన్న నేపథ్యం, సైద్ధాంతిక నిబద్ధత రీత్యా ఆయనను ధన్‌ఖడ్ మాదిరి వదిలించుకునే అగత్యం బీజేపీ అగ్రనేతలకు రాకపోవచ్చు. అంత సాహసం కూడా వారు చేసే అవకాశం లేదు.

ఏదిఏమైనప్పటికీ గత నెల రోజులుగా ఉపరాష్ట్రపతి పదవిపై మీడియాలో విస్తృత చర్చ జరిగింది. సీపీ రాధాకృష్ణన్ ఎక్కడా పెద్దగా నోరు విప్పనప్పటికీ, ప్రతిపక్షాల శిబిరం తరపున పోటీ చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఉధృతంగా ప్రచారం చేశారు. వివిధ రాష్ట్రాల్లో తిరిగి అక్కడి నేతల్ని, ప్రజాప్రతినిధులను కలుసుకున్నారు. రాజ్యాంగ విలువల్ని కాపాడేందుకు, ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉండేందుకు ఉపరాష్ట్రపతి పదవి అనేది ఎంత ముఖ్యమో అని ఆయన వివరించారు. ఈ పదవి పార్టీలకు అతీతమైనదని, ఎంపీలు స్వేచ్ఛగా ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజకీయాల్లో అంతర్గత ప్రయోజనాలే కాని అంతరాత్మ ప్రబోధాలు ఎక్కడ పనిచేస్తాయి?

ఉపరాష్ట్రపతి పదవీ ఎన్నిక ప్రతిపక్షాలు సంఘటితం అయ్యేందుకు దోహదం చేసింది. ఓట్ చోరీ, బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు కలిసికట్టుగా ఉభయసభల్ని స్తంభింపచేశాయి. పహల్గామ్‌పై జరిగిన చర్చలో ప్రభుత్వాన్ని అనేక అంశాలపై నిలదీశాయి. అనుకున్న దానికంటే కొన్ని ఓట్లు తగ్గినప్పటికీ ఉపరాష్ట్రపతి ఎన్నికల ఫలితం ప్రతిపక్షాల ఐక్యతపై పెద్దగా ప్రభావం చూపే అవకాశాలు లేవు. పై పెచ్చు ఎన్డీఏకూ, ఇండియా కూటమికీ మధ్య ఉన్న సైద్ధాంతిక వ్యత్యాసాల్ని స్పష్టంగా చెప్పేందుకు ఈ ఎన్నికలు అవకాశం కల్పించాయి. బాల్యం నుంచీ హిందూత్వ భావజాలంతో ఎదిగిన సీపీ రాధాకృష్ణన్‌కు పోటీగా సోషలిస్టు భావజాలం గల సుదర్శన్‌రెడ్డిని అన్ని పక్షాలు ఏకగ్రీవంగా తమ అభ్యర్థిని ఎంచుకోవడమే ఈ సైద్ధాంతిక వ్యత్యాసానికి నాంది పలికింది. రాజ్యాంగ నైతికత, అందరికీ సామాజిక న్యాయం, ప్రతి ఒక్కరికీ సమాన విలువ అన్న అంశాలపై సుదర్శన్ రెడ్డి ప్రచారం చేశారు. ఒకరకంగా ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి ఇదివరకు లేని ఒక సిద్ధాంతవేత్త రూపంలో సుదర్శన్‌రెడ్డి లభించారని చెప్పవచ్చు. ఇండియా కూటమి అభ్యర్థి ఓటమి చెందినప్పటికీ ఆయన ప్రచారం చేసిన అంశాల ప్రాధాన్యత మాత్రం తగ్గిపోయే అవకాశం లేదు.

ప్రతిపక్షాలు ఎదుర్కొంటున్నది ఎన్డీఏనో, బీజేపీనో కాదు, దేశ రాజకీయాల్లో ఒక బలమైన శక్తిగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీని అని స్పష్టంగా చెప్పక తప్పదు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ, ఆ మాటకొస్తే అధికారంలోకి రానప్పటి నుంచీ నరేంద్రమోదీ అనేక ప్రతికూలతలను ఎదుర్కొన్నారు. గుజరాత్ అల్లర్ల నుంచీ ఎన్నో ఆటుపోట్లు ఆయనకు ఎదురయ్యాయి. ప్రధానిగా పెద్దనోట్ల రద్దు, సాగు చట్టాల నుంచి ఇటీవల పహల్గామ్ సంఘటన, అమెరికాతో విభేదాల దాకా ఆయన ఎన్నో సమస్యలను, స్వీయ ప్రతిష్ఠ దెబ్బతినడాన్ని ఎదుర్కొన్నారు. కాని ఆసక్తికరమైన దేమిటంటే ఆయన గ్రాఫ్ ఎప్పుడు పడిపోతుందో, ఎప్పుడు పెరుగుతుందో చెప్పడం కష్టం. ఆయన జాబితాలో వైఫల్యాలెన్నో విజయాలూ అంతకు మించి ఉన్నాయి. అందువల్ల ప్రధానమంత్రి అనుకూల పక్షాలే కాదు, మోదీని మనస్ఫూర్తిగా సమర్థించని ఎన్నో పక్షాలు కూడా ప్రత్యక్షంగా ఆయనను వ్యతిరేకించడానికి భయపడతాయి. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి గెలిచినప్పటికీ ఆయనకు సమస్యలు తొలగిపోతాయని కాని, కొత్త సమస్యలు రావని కానీ, ఆయన వాటిని ఎదుర్కోలేరని కానీ చెప్పడానికి వీల్లేదు. ఆయన డిగ్రీ గురించి వివాదం తలెత్తినప్పటికీ అవతలి వారి కంటే నాలుగాకులు ఆయన ముందే చదివి ఉంటారన్నదానిలో సందేహం లేదు. రష్యా, చైనా అధినేతలు పుతిన్, జిన్‌పింగ్‌లతో ఇటీవల ఎస్‌సీఓ సదస్సులో నవ్వుతూ మాట్లాడుతున్న దృశ్యాలను చూపిస్తూ ఒక రాజకీయ నాయకుడు 'ఈ వ్యక్తి డిగ్రీల గురించి ఎవరు పట్టించుకుంటారు?' అని ప్రశ్నించారు.




'ప్రతిపక్షాలు ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా స్పష్టంగా విమర్శించడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశత్వంలోకి దిగజారిపోయే అవకాశం ఉంది. అదే సమయంలో విపక్షాలు సైతం పార్లమెంటు కార్యకలాపాలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేంతగా దిగజారిపోకూడదు' అని సర్వేపల్లి రాధాకృష్ణన్ రాజ్యసభ చైర్మన్‌గా సభలోనే ప్రకటించారు. 15వ ఉపరాష్ట్రపతి చంద్రాపురం రాధాకృష్ణన్ మరో సర్వేపల్లి రాధాకృష్ణన్ కాగలరా? ప్రభుత్వం, ప్రతిపక్షాలు పార్లమెంట్‌కు కలసికట్టుగా పూర్వ వైభవం సంతరింపచేయగలవా?

మరోవైపు ప్రతిపక్షాలకు చాలా కాలం తర్వాత ఒక నాయకుడు దొరికాడని చెప్పవచ్చు. వారు ఆయన వెనుక నడిచేందుకు వెనుకాడడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాహుల్ ఒక నిప్పుకణంలా మండిపడుతున్నాడు. ఓట్లచోరీతో సహా ఆయన లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యత లభిస్తోంది. బిహార్‌లో ఆయన నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. ఆర్‌జేడీ నేత తేజస్వి యాదవే ఆయన వెంట నడవాల్సి వస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీ అవలంబించిన సిద్ధాంతాలు ఎలా ఉన్నప్పటికీ రాహుల్ తమ పార్టీకి ఒక కొత్త సిద్ధాంతాన్ని ఏర్పర్చే ప్రయత్నం చేస్తున్నారు. విభిన్న సామాజిక వర్గాలను తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదే ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య సైద్ధాంతిక వ్యత్యాసాలను నిర్ధారించేందుకు ఆస్కారం కలిగిస్తోంది. ఈ సైద్ధాంతిక పోరు ప్రతి అసెంబ్లీ ఎన్నికలోనూ, సార్వత్రిక ఎన్నికల వరకు సంఘటితం చేసి తమది భిన్నమైన సైద్ధాంతిక కూటమి అని ప్రజలు అర్థం చేసుకునేలా చేయడం అంత సులభమైన విషయం కానే కాదు. కానీ రాహుల్ వెనక్కు తగ్గే అవకాశాలు లేవు.

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు అసలు పరీక్ష ఆయన రాజ్యసభ చైర్మన్ సీటులో కూర్చున్న తర్వాతే మొదలవుతుంది. భారత తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ అధిష్ఠించిన ఆసనమది. తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు, దౌత్యవేత్త అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ హిందూ ధర్మాన్ని ఒక తాత్విక అంశంగా స్వీకరించిన మహోన్నత దార్శనికుడు. తన మూలాలు భారతీయ సాంస్కృతిక వారసత్వంలో ఉన్నప్పటికీ తన ఆలోచనలు ఆధునికమని ఆయన ప్రతి సందర్భంలో నిరూపించేవారు. తొలి ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ తొలి చైర్మన్‌గా ఆయన తన తర్వాత ఆ పదవులు నిర్వహించేవారికి ఒక పథనిర్దేశం చేసి వెళ్లారు. 'రాజ్యసభ అంటే కేవలం చట్టాలు చేసే సభ కాదు. అది చర్చించే సభ. అందరూ విలువైన చర్చలకు పూనుకునే అవకాశం ఈ సభ కల్పించింది. లోక్‌సభ, రాజ్యసభ రెండూ మన రాజ్యాంగంలో భాగమయ్యాయి కనుక ఈ వ్యవస్థను సమర్థంగా కొనసాగించడం అనేది మన పనిపైనే ఆధారపడి ఉన్నది' అన్న ఉదాత్తుడు సర్వేపల్లి రాధాకృష్ణన్. ఉపరాష్ట్రపతిగా తన కార్యకలాపాలను రాజకీయ, దౌత్య రంగాల్లో విస్తరించి దేశ ప్రతిష్ఠను పెంచే స్వేచ్ఛ ఆయనకు లభించింది. రాధాకృష్ణన్ సభాధ్యక్ష స్థానంలో ఉన్నంతకాలం ఎటువైపూ మొగ్గు చూపే ప్రసక్తి ఉండదని, సభ్యుల హక్కులకు భంగం వాటిల్లబోదని నిరూపించారు. నెహ్రూ, భూపేశ్ గుప్తా, రాధాకృష్ణన్‌ల మధ్య జరిగే వాదనలు నిశితమూ తీవ్రమైనవి అయినా సుహృద్భావ వాతావరణంలో జరిగేవి. హెచ్‌ఎన్ ఖుంజ్రూ, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి హేమాహేమీలు సర్వేపల్లి సభా నిర్వహణను ప్రశంసించేవారు. 'ప్రతిపక్షాలు ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా స్పష్టంగా విమర్శించడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశత్వంలోకి దిగజారిపోయే అవకాశం ఉంది. అదే సమయంలో ప్రతిపక్షాలు సైతం పార్లమెంటు కార్యకలాపాలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకునేంతగా దిగజారిపోకూడదు' అని ఆయన రాజ్యసభ చైర్మన్‌గా సభలోనే ప్రకటించారు. 15వ ఉపరాష్ట్రపతి చంద్రాపురం రాధాకృష్ణన్ మరో సర్వేపల్లి రాధాకృష్ణన్ కాగలరా? ప్రభుత్వం, ప్రతిపక్షాలు పార్లమెంట్‌కు కలసికట్టుగా పూర్వ వైభవం సంతరింపచేయగలవా?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

# వర్ణ మాంత్రికుడు వడ్డాది పాపయ్య

రంగుల రారాజు, వపా అనే పేర్లతో ప్రశస్తిగాంచిన చిత్రకారుడి పూర్తి పేరు వడ్డాది పాపయ్య. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో ఒక సామాన్య కుటుంబంలో సెప్టెంబర్ 10, 1921న మహాలక్ష్మి, రామమూర్తి దంపతులకు జన్మించారు. వడ్డాది పాపయ్య తన ఐదవ ఏటనే చిత్రకళ ఆరంగ్రేటం చేసారు. ఆయన తండ్రి చిత్రకళా ఉపాధ్యాయుడు కావడంతో చిత్రకళలో ఓనమాలు తండ్రి వద్దనే నేర్చి, ఆయన బొమ్మలు గీచే పద్ధతిని పరిశీలించి అతి చిన్న వయసులోనే ఇంటిలో ఉన్న రవివర్మ గీచిన 'కోదండరామ' చిత్రంను ప్రేరణగా తీసుకుని హనుమంతుని చిత్రాన్ని గీసారు పాపయ్య.

పాపయ్య చిత్రాలను తొలినాళ్ళలో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు తన పత్రికలలో ప్రచురించి, ప్రోత్సహించారు. ఆ తరువాత రేరాణి, మంజూష, అభిసారిక, ఆంధ్రపత్రిక, భారతి, ఆంధ్రజ్యోతి, యువ, చందమామ, బాలి, జ్యోతి, స్వాతి వార, మాస పత్రికల్లో వపా వర్ణ, రేఖా చిత్రాలు, కార్టూన్లు గీయటం ప్రారంభించారు. వపా తన కుంచెతో చందమామ పిల్లల మాసపత్రికను దాదాపు అర్థశతాబ్దం పాటు తీర్చిదిద్దారు. అప్పటిలో చందమామ వివిధ భాషలలో ప్రచురితమయ్యేది. ఆ విధంగా పాపయ్య చిత్రాలు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయి.

దీపావళి ప్రత్యేక సంచికలు వడ్డాది పాపయ్య వర్ణ చిత్రాలతో పాఠకుల మనసులను దోచుకునేవి. ముఖచిత్రాలు చూసి వార, మాసపత్రికలు కొనేలా చేసిన చిత్రకారుడు ఆయన. చందమామలో ఆయన మూడు దశాబ్దాల పాటు క్రమం తప్పకుండా ఐదు వందలకు పైగా ముఖచిత్రాలు గీచారు. ఆయన జీవించి ఉన్నంతకాలం మరొకరు ఆ పత్రిక ముఖచిత్రం గీయలేదు. నవ్వులు పువ్వులు, వాణి, ఆనందవాణి, యువ, ఆంధ్రజ్యోతి తదితర పత్రికల్లో వపా వందల కార్టూన్లు తనదైన శైలిలో వేశారు. ప్రాచీన సాహిత్యాన్ని ఆకళింపు చేసుకొని తన కుంచెకు సాహితీ సౌరభాలు అద్ది చిత్రాలను చిత్రించిన ప్రత్యేక చిత్రకారుడు ఆయన. వపా కార్టూన్లు, రేఖాచిత్రాలు గీయడమే కాదు, కొన్ని కథలూ రాసారు. చందమామలో కొడవటిగంటి కుటుంబరావు మొదలుపెట్టిన 'దేవీ భాగవతం' కథలను పూర్తి చేసింది ఆయనే. పౌరాణిక సీరియల్ 'విష్ణుకథ' కూడా ఆయనే రాసారు. ఆయన రంగుల చిత్రాలు ఒక అద్భుత ప్రపంచాన్ని పాఠకుల మదిలో ఆవిష్కరించేవి. పౌరాణిక, జానపద ఘట్టాలకు రూపాలనిచ్చి, వాటికి జీవం పోసిన చిత్రబ్రహ్మ తన చిత్రాల ద్వారా ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు.



తెలుగు చిత్రకళకు జాతీయస్థాయి కీర్తి తెచ్చిన అమర చిత్రకారుడు వడ్డాది పాపయ్య (వపా). తెలుగు సంస్కృతిని, ఇతిహాసాలు, పురాణాలు, కాలాలు, రాగాలు, నక్షత్రాలు, గ్రహాలు, నదులు, పౌర్ణమిలు, కావ్యనాయకులు, పురాణ పురుషులు, పండుగలు, ఆచారవ్యవహారాల్ని తన కళాచాతుర్యంతో కమనీయ దృశ్యకావ్యాలుగా మలచారాయన. ఎందరో ఔత్సాహికులకు ఆయన చిత్రాలు స్ఫూర్తినిస్తున్నాయి.

1940వ దశకంలో పిల్లల్ని ఆకట్టుకోవడానికి ఆయన 'బాల' పత్రికలో తమాషా అయిన బొమ్మలు ఎన్నో వేశారు. బొమ్మను మామూలుగా చూస్తే ఒక రూపం, తిరగవేసి చూస్తే మరొకరూపం కనిపించేవి. సాధారణంగా చిత్రకారులు మోడల్స్ లేదా వారి నమూనాలనో చూస్తూ చిత్రాలు గీస్తుంటారు. కాని పాపయ్య మాత్రం తన ఆలోచనల రూపాలనే చిత్రాలుగా చిత్రించేవారు. ఆయన ఎక్కువగా స్త్రీలకు సంబంధించిన చిత్రాలే గీచారు. అసభ్యతకు తావులేకుండా అమలిన శృంగారం తన చిత్రాల్లో చూపించారు.

తన చిత్రాలతో తెలుగు సంస్కృతిని, ఇతిహాసాలు, పురాణాలు, కాలాలు, రాగాలు, నక్షత్రాలు, గ్రహాలు, నదులు, పౌర్ణమిలు, కావ్యనాయకులు, పురాణ పురుషులు, పండుగలు, ఆచారవ్యవహారాల్ని తన కళాచాతుర్యంతో కమనీయ దృశ్యకావ్యాలుగా మలచి కళాభిమానుల్ని రంగుల లోకంలో విహరింపజేసిన మహోన్నత చిత్రకారుడు వడ్డాది పాపయ్య. ఆయన రంగుల మిశ్రమం ప్రత్యేకంగా ఉంటుంది. ఎప్పుడూ మనం చూసే రంగులే అయినా, ఆకర్షణగా ఉండేవి. ఆయన దేశవాళీ రంగులే వాడి పేరు పొందారు. పౌరాణిక చిత్రాలను నీటి రంగులతో చిత్రించేవారు. ప్రపంచంలో నక్షత్రాలకు సంబంధించిన చిత్రాలను గీసిన ఒకే ఒక చిత్రకారుడు పాపయ్య. 27 నక్షత్రాలకు చక్కని రూపు కల్పించడంతోపాటు వాటి లక్షణాలను అంతర్లీనంగా చాటి చెప్పారు. రామాయణం, భారతం, భాగవతం, హనుమాన్, శివపురాణం తదితర కథలకు తనదైన శైలిలో వర్ణ చిత్రాలు సహజ సుందరంగా చిత్రించారు. చిత్రకళా ప్రపంచంలో వపా చిత్రించని అంశం లేదంటే అతిశయోక్తికాదు.

ఆయన గీసిన చిత్రాల క్రింద 'వ.పా.' అనే పొడి అక్షరాల సంతకం పెట్టేవారు. వీరి బొమ్మలకు గల మరొక కుంచె గుర్తు '0|0' అని ఉండడం. దీని గురించి ఆయన చెప్పిన భాష్యం – "గతం శూన్యం, వర్తమానం శూన్యం, భవిష్యత్తులో నిలుచున్నానని". అది ఆయన 'లోగో'గా తన చిత్రాలలో ఉపయోగించేవారు. ఆయన ప్రపంచంలో 'లోగో' గలిగిన ఏకైక చిత్రకారుడు కావటం తెలుగువారికి గర్వకారణం.

వపా మిత్రుల బలవంతంపై ఖరగ్‌పూర్, శ్రీకాకుళంలలో చాలకాలం కింద చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించారు. వారిని సత్కరించడానికి ఆంధ్రవిజ్ఞాన సమితి 'సంక్రాంతి' పర్వదినం పురస్కరించుకొని వపా చిత్రకళా ప్రదర్శన తొలిసారి నిర్వహించింది. ఈ సందర్భంగా అప్పటికప్పుడు ఇరవై వర్ణ చిత్రాలు సృష్టించి ప్రదర్శించారు.

చిత్రకారునిగా ఎంత గొప్పవారో, వ్యక్తిగా అంత నిరాడంబరంగా, ప్రచారార్భాటాలకు దూరంగా ఉండి ఇంట్లో కూడా ముభావంగా తన పని చేసుకునేవారు. వపా చిత్రాలు తెలిసినంతగా ఆయన జీవిత విశేషాలు ప్రజలకు తెలియవు. ఆ చిత్రకారుడిని గురించి సుంకర చలపతిరావు, సి.పి.బ్రౌన్ అకాడమీ వారి పుణ్యమా అని ఒక గ్రంథమే రాయడం, తెలుగుజాతి రత్నాలు పరంపరలో అది వెలువడటం– ఎంతో సంతోషదాయకమైన విషయం. వడ్డాది పాపయ్య శత వసంతాల ప్రత్యేక సంచిక 'వపాకు వందనం' 2021లో విశాఖపట్నం చిత్రకళా పరిషత్ వారు ఆవిష్కరించారు. గత ముప్పై సంవత్సరాలుగా విశాఖ నగరంలో చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో పాపయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

తెలుగు చిత్రకళకు జాతీయస్థాయి కీర్తి తెచ్చిన అమర చిత్రకారుడు వడ్డాది పాపయ్య (వపా). ఆయన కాలధర్మం చెంది మూడు దశాబ్దాలు దాటినా, నేటికీ ఆయన కళాప్రతిభ మసకబారలేదు. ఎందరో ఔత్సాహికులకు ఆయన చిత్రాలు స్ఫూర్తినిస్తున్నాయి. భౌతికంగా వపా నేడు మన మధ్య లేకపోయినా ఆయన సృష్టించిన వేలాది చిత్రకళా రూపాలు మన హృదయాలలో ఎప్పటికీ సజీవంగా ఉంటాయి.

• జి.కె. విశ్వనాథరాజు

(సౌభాగ్య గజపతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాఖ పబ్లిక్ లైబ్రరీలో నేడు వపా జయంతి)

# శాస్త్రీయ దృక్పథంతో మానవీయ సమాజం

ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి దగ్గర యలవర్రు గ్రామంలో 1922 సెప్టెంబరు 10న వ్యవసాయ కుటుంబంలో జన్మించిన యలవర్తి నాయుడమ్మ ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రసాయన శాస్త్రవేత్త. చర్మ పరిశోధనలలో విశేష కృషి చేసిన మేధావి. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ & ఇండస్ట్రియల్ రీసెర్చి సంస్థ అత్యున్నత (డైరక్టరు జనరల్) పదవి నిర్వహించారు. సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో చేరి, 1985 జూన్ 23న మరణించేదాకా నిత్య పరిశోధకుడిగానే జీవించారు.



సామాజిక విషయాలలో కూడా శాస్త్రీయ అభినివేశాన్ని ప్రదర్శించటం నాయుడమ్మ ఆశయం. మూఢ విశ్వాసాల్నీ ముహూర్త బలాల్నీ వీడి, హేతుబద్ధమైన ఆలోచనతో కూడిన మనిషి చైతన్యమూ, వ్యక్తిత్వమూ వికసించే మానవీయ సమాజం వైపు జాతి జనుల అడుగులు పడాలనేది ఆయన ఆశ, ఆదర్శం కూడా! దేశమంతా విద్యారంగం, ఇతర మార్గాల ద్వారా శాస్త్రీయ అభినివేశం (సైంటిఫిక్ టెంపర్) లోతుగా విస్తరించాలని ఆయన తపించారు. హేతుబద్ధ చింతన, శాస్త్రీయ వివేచనా, నిరంతర అధ్యయనం, నిత్య పరిశోధనా... ఆయన జీవధాతువులు. మూఢ విశ్వాసాలను ఖండించటం, కాలం చెల్లిన భావాలను తిరస్కరించటం ఆయన వ్యక్తిత్వంలో, జీవిత ఆచరణలో ఒక భాగం.

కుల-మతతత్వాలు, దోపిడీ-దౌర్జన్యం, ఆభిజాత్యం, జాతి విద్వేషం... మొదలైన సామాజిక రుగ్మతలను మనంగా అర్థం చేసుకుని పరిష్కరించుకోవాల్సి ఉండగా – మన జీవన కష్ట నిష్ఠురాలన్నిటికీ పుట్టుక సమయం నాటి గ్రహగతులూ, కుజదోషాలూ అంటూ మనిషినీ, సమాజాన్నీ దేవుడు, కర్మ, గ్రహబలం పేరిట పరాధీనాలుగా మార్చివేస్తున్న ఈనాటి కొందరి భక్తి పరిశ్రమాధిపతుల విధానాలను మనం ప్రశ్నిస్తున్నామా? నాయుడమ్మయితే ఇటువంటి సమయంలో ఏం చేసేవారో ఆలోచించామా? సామాజిక సమస్యలను సమాజంలోనే నిలవేసి, ప్రశ్నించి తర్కించి ఒక జవాబుని రాబట్టాలి. అదీ నాయుడమ్మ పద్ధతి. శాస్త్రీయ అభినివేశానికి పట్టంగట్టటమే నాయుడమ్మకి నిజమైన నివాళి.

– దివి కుమార్, జనసాహితి

(నేడు తెనాలి రామకృష్ణ కవి సభా మందిరంలో నాయుడమ్మ 103వ జయంతి పురస్కార సభ)

# ప్రైవేటు వైద్యంపై నియంత్రణ ఏది?

మెరుగైన వైద్యం ప్రజల హక్కు. దీనిని ప్రజలకు అందించే బాధ్యత ప్రభుత్వాలది. కానీ దేశంలో ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులో లేదు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న 35 శాతం మందికి, దళిత–గిరిజనులకు 47 శాతం మందికి వైద్య ఆరోగ్య సేవలు అందుబాటులో లేవని ప్రభుత్వాలే ఒప్పుకుంటున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 80 శాతం పైగా స్పెషలిస్టులు, అవసరమైన పరికరాలు, సదుపాయాలు, మందులు అందుబాటులో లేవనేది అనేక సర్వేల్లో వెల్లడైంది. సీజన్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన వందలాదిమందికి వైద్య సేవలు అందించే పరిస్థితి లేదు. ఈ పరిస్థితిని పర్యవేక్షించే నాథుడే లేడు. ప్రభుత్వ వైద్యుల స్పందన, హెల్త్ కేర్ ప్రజలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో, ప్రభుత్వ వైద్యం మీద ప్రజలకు విశ్వాసం సన్నగిల్లి, రోగులు ప్రైవేటు బాట పడుతున్నారు.

అన్ని రంగాల్లో మార్కెట్ శక్తుల ప్రాబల్యం పెరిగినట్లుగానే, వైద్యరంగంలో కూడా మార్కెట్ శక్తులు ప్రవేశించాయి. దీని వల్ల వైద్యుడు–రోగి సంబంధం పోయి, వైద్యం ఒక సరుకుగా మారింది. వైద్య రంగానికి సంబంధం లేనివారు కార్పొరేట్, మల్టీ స్పెషాలిటీ పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులను నెలకొల్పుతున్నారు. వీటిలో లాభాపేక్ష తప్ప, సేవాభావం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఉదంతం ఇందుకు సజీవ సాక్ష్యం. ఈ సంతాన సాఫల్య కేంద్రం పిల్లలు లేని జంటల కోరికపై ఏ స్థాయిలో వ్యాపారం చేసిందో, ఎంత అనైతిక పద్ధతులను పాటించిందో విదితమే.

80 శాతం ప్రజలు వైద్య సేవల కోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెడుతున్నారు. ఇవి రోగం స్థితి, రోగుల అనుమానాలు–భయాలను క్యాష్ చేసుకుంటున్నాయి. ఆస్పత్రుల్లో చేరిన రోగికి బంధువులకు మనోధైర్యాన్ని ఇచ్చే బదులు, మానసిక ఒత్తిడి పెంచి వారి నుంచి డబ్బు పిండుకుంటున్నారు. రోగనిర్ధారణ చేయవలసిన ల్యాబ్‌లు, డాక్టర్ అడిగినట్లుగా రిపోర్ట్స్ తయారు చేస్తున్నాయి. రోగ నిర్ధారణకు చేయాల్సిన టెస్టుల స్థానంలో రోగి నుంచి బిల్లు వసూలు చేసే లక్ష్యంగా అనవసరపు టెస్టులు చేస్తున్నారు. మాస్టర్ చెకప్‌ల పేరిట కార్పొరేట్ కంపెనీలు చేస్తున్న ప్రచారానికి మధ్యతరగతి ప్రజలు బాగా ఆకర్షితులవుతున్నారు.

పేషెంటుకున్న వ్యాధిపై పోరాడే సందర్భంలో డాక్టర్ ప్రధాన వనరు ఔషధాలే. ఈ ఔషధాలపై డాక్టర్లదే నిర్ణయాధికారం. దీంతో వీరికి పార్టీలు, టూర్స్, ఖరీదైన గిఫ్టులు, సెమినార్స్ వంటివి ఎరవేసి సేవకులుగా మార్చుకుంటున్నాయి ఫార్మా కంపెనీలు. అందుకే డాక్టర్ రాసిన మందులు అనుబంధ ఫార్మసీలో తప్ప బయట ఎక్కడా దొరకవు. వారి ఆదాయాల కోసం అవసరం లేని మందులను కూడా రోగితో తినిపిస్తున్నారు. దీంతో రోగుల ఆరోగ్యం ప్రమాదకరమైన స్థితిలోకి చేరుతోంది.



తెలుగు రాష్ట్రాలలో 40–50 సంవత్సరాల మధ్య గల మహిళల్లో ఎక్కువ మందికి గర్భసంచిలు లేవనేది సత్యమే. గర్భసంచికి ఏ చిన్న సమస్య వచ్చినా క్యాన్సర్ పేరిట భయాలు నెలకొల్పి ఆపరేషన్లు చేసి వాటిని తీసేస్తున్న ఉదంతాలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గర్భిణీలకు నార్మల్ డెలివరీ చేయాలి. కానీ అనేక మంది గైనకాలజిస్టులు అధిక ఫీజుల కోసం తమ వద్ద చేరిన పేషెంట్లలో 90 శాతానికి పైగా సర్జరీలు చేసే బిడ్డల్ని తీస్తున్నారు. జిల్లాలో ఏ ఆస్పత్రిలో ఎంతమంది మహిళలకు సర్జరీలు జరిగాయో డేటా డీఎంహెచ్ఓ వద్ద ఉన్నా కూడా కనీసం వారిని ప్రశ్నించడం లేదు. అప్పుడే పుట్టిన బిడ్డపై కూడా రకరకాల భయాలు పెంచి, వారాల తరబడి బాక్సుల్లో పెట్టి డబ్బు దండుకుంటున్నారు. ఆస్పత్రుల్లో ధరల పట్టికను ప్రదర్శించాలి. కానీ ప్రదర్శించరు.

వైద్య రంగంలో కమిషన్ల కక్కుర్తి విపరీతంగా పెరిగిపోయింది. లోకల్ ప్రాక్టీషనర్, అంబులెన్స్ డ్రైవర్, ఆటో డ్రైవర్, ఆస్పత్రి సిబ్బంది ఇలా అందరికీ పేషెంట్ చెల్లిస్తున్న అన్ని రకాల బిల్లుల నుంచి 30 నుంచి 40శాతం కమిషన్లు పంపుతున్నారు. కమిషన్ ఇవ్వని డాక్టర్లు ఆస్పత్రి మూత వేసుకోవడమే. ఈ కమిషన్ల దందాని అడ్డుకోకపోతే రోగులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంది. నైతిక విలువలు కలిగిన వైద్యులు, విలువలతో క్లినిక్ నడిపే పరిస్థితి లేదు. నైతిక విలువలను కాపాడే డాక్టర్లు ఈ రంగం నుంచి వెళ్ళిపోతే పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది.

ప్రైవేటు వైద్యం వల్ల ఏటా ఆరు కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నట్టు కేంద్ర ప్రభుత్వం గణాంకాలు విడుదల చేసింది. ఈ దోపిడీని అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు, ఓట్లు తెచ్చిపెట్టే నాలుగు పథకాలని ఆర్భాటంగా ప్రచారం చేసి పాలన కొనసాగించడం తప్ప. అందరికీ నాణ్యమైన, సమానమైన, పారదర్శకమైన విద్య, వైద్యాన్ని అందించే బాధ్యతకు హామీ పడటం లేదు. మానవత్వానికి, సేవకు మారుపేరైన ఈ వృత్తిలో ప్రస్తుతానికి అది లేదు. వైద్యులలో స్వీయ నియంత్రణ కరువవుతోంది. అవకతవకలను సరి చేయవలసిన యంత్రాంగం లేదు. ఈ అక్రమాలపై పాలకులు దృష్టి సారించి, పరిస్థితిని చక్కదిద్దాలి. ప్రభుత్వ వైద్యాన్ని బలోపేతం చేసి ప్రైవేట్ వైద్యాన్ని నియంత్రించి, వైద్య రంగంలో జరుగుతున్న దోపిడీని సమూలంగా మార్చి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అందుకు పాలకులపై పౌర సమాజం ఒత్తిడిని పెంచాలి.

▪ ఆవుల అశోక్
సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు

# పుస్తకావిష్కరణ సభ

కాళ్ళ కింద దుమ్ములా పడి ఉంటారనుకుంటున్న మట్టి మనుషుల కళ్ళల్లో నలుసైన దొరలు, భూస్వాములు, పోలీసులు, రాజ్య వివక్షపై ఎదురీదిన చరిత్రకు అక్షర రూపం ఇనుకొండ తిరుమలి రచనలు. అట్టడుగు వర్గం నుంచి వచ్చి అంతర్జాతీయ స్థాయి వరకు ఆయనొక సుపరిచిత రచయిత. ఆయన రచనలన్నీ అణగారిన వర్గాల చరిత్రలో భాగంగానే వచ్చాయి. అందులో భాగమే "అడుగడుగునా అగౌరవం, అనాదరణ". ఈ పుస్తకంలో సంచార విముక్తి జాతుల దుర్భర జీవితాల గురించి ఉంది. భారతీయ సమాజంలో కుల వ్యవస్థ మిగిల్చిన చేదు నిజాలను రచయితే స్వయంగా గుడిసెలను, వారి గుండె గొంతుకలోని ఆవేదనలు, ఆక్రందనలను ఫీల్డ్ సర్వేలు చేసి, చారిత్రక సమాచారం సేకరించి, రచించిన పుస్తకమిది. తనను తాను వెతుక్కుంటున్న ఓ చరిత్ర– ఈ పుస్తకం. ఎస్.వినయకుమార్ అనువదించిన ఈ పుస్తకావిష్కరణ సభ నేటి ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, మెయిన్ హాల్‌లో జరుగనున్నది. తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథి.

– భూపతి వెంకటేశ్వర్లు
రాష్ట్ర అధ్యక్షులు, టీపీఎస్‌కే




- ఎన్‌ఐఆర్‌ఎఫ్ తాజా ర్యాంకుల్లో వెనుకబాటు
- న్యాక్ ర్యాంక్ 3.36 నుంచి 3.27కి పడిపోయిన వైనం
- నత్తనడకన సాగుతున్న రూసా ప్రాజెక్టు పనులు
- అవినీతి ఆరోపణలు.. ఏసీబీ, విజిలెన్స్ విచారణలు..
- పాలనలో ఒకే సామాజికవర్గ ఆధిపత్యంపై విమర్శలు
- పాలనను సమూలంగా ప్రక్షాళన చేయాలంటున్న విద్యావేత్తలు
- పరిశోధన, అకడమిక్ అభివృద్ధిపై దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

# గతమెంతో ఘనం.. వర్తమానం దైన్యం

కాకతీయ విశ్వవిద్యాలయం- రాష్ట్రంలో అతిపెద్ద రెండో యూనివర్సిటీ. ఉన్నత విద్యను అందించడంలో, ప్రమాణాలు పాటించడంలో, పరిశోధనలు సాగించడంలో, నిష్ణాతులను అందించడంలో ఈ యూనివర్సిటీ ఒకప్పుడు కేరాఫ్‌గా ఉండేది. ఉస్మానియా తర్వాత, చారిత్రక వరంగల్ కేంద్రంగా కేయూ తనదైన అస్థిత్వాన్ని చాటుకుంది. లక్షలాది మంది విద్యార్థులకు విద్యావెలుగులు పంచింది. వారు ఉన్నత స్థానాల్లో స్థిరపడేందుకు దోహదపడింది. అయితే కొన్నాళ్లుగా కేయూ ప్రతిష్ఠ మసకబారుతోంది. ఇందుకు గత పాలకుల నిర్లక్ష్యం ఒక కారణం కాగా, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం, అలసత్వం మరో కారణంగా కనిపిస్తోంది. తాజాగా వెలువడిన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో వెనుబడటమే కాకుండా, 2023లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) సీజీపీఏ పడిపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అవినీతి అక్రమాలు, కులాలూ వర్గాల పక్షపాతం, రాజకీయ ప్రాపకం వంటివి యూనివర్సిటీకి మచ్చ తెస్తున్నాయి. కేయూ ప్రతిష్ఠ మరింత దిగజారకముందే, కొత్త పాలకవర్గం... అకడమిక్, పరిశోధనల మెరుగుకు చర్యలు చేపట్టాలని, లోపాల దిద్దుబాటుకు ఉపక్రమించాలని విద్యానిపుణులు కోరుతున్నారు.

## ఏడాదికేడాది మసకబారుతున్న కేయూ ప్రతిష్ఠ

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాకతీయ విశ్వవిద్యాలయం తెలంగాణలో అతి పెద్ద రెండో యూనివర్సిటీగా గుర్తింపు పొందింది. ఉస్మానియా వర్సిటీ తరువాత రాష్ట్రంలో కేయూకే పేరుంది. గతంలో కేయూ అనేక ప్రతిష్ఠాత్మక విజయాలు సాధించింది. 2017లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ)లో 3.36 సీజీపీఏ (క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్)తో కేయూ ఎ-గ్రేడ్ సాధించింది. 2018లో నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) 2 బ్యాండ్‌లో (101-150), 3 బ్యాండ్‌లో (151-200)లో స్థానంలో మెరుగైన స్థానాన్ని కేయూ సాధించింది. ఈ విజయాలకు సూచికగా అదే ఏడాది రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూసా) నుంచి పరిశోధన, ఇన్నోవేషన్ కోసం రూ.50 కోట్లు గ్రాంట్ కూడా కాకతీయ విశ్వవిద్యాలయం పొందింది. అలాగే ఫార్మసీ కళాశాల 2021లో 48వ ర్యాంక్, 2022లో 46వ ర్యాంక్ సాధించడం విశ్వవిద్యాలయం ప్రతిష్ఠను మరింత పెంచింది. కానీ, ఈ విజయాలన్నీ చరిత్రగా మిగిలిపోతున్నాయి. వరుసగా ర్యాంకింగ్‌లో వెనుకబడిపోతుండటం గత చరిత్రను కనుమరుగు చేస్తోంది. తాజాగా ప్రకటించిన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకింగ్స్‌లో కేయూ వెనుబడిపోయింది. ఆంధ్ర, ఉస్మానియా వంటి యూనివర్సిటీలు ర్యాంకింగ్‌లో ముందంజలో ఉండగా, కేయూ వెనుకబడి పోవటంపై అధ్యాపక, విద్యార్థి వర్గాల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

ఇంజనీరింగ్ విభాగంలో వరంగల్‌కు చెందిన ఓ ప్రైవేటు వర్సిటీ 2 బ్యాండ్‌లో (101-150) సాధించింది. కొత్తగా పుట్టుక వచ్చిన ప్రైవేటు వర్సిటీలు ర్యాంకులు సాధిస్తుంటే, ఘన చరిత్ర ఉన్న కేయూ వెనుబడటం విచారకరమని అధ్యాపకుల అభిప్రాయ

(మిగతా 7లో..)





హనుమకొండలో కాళోజీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

## కాళోజీకి ఘన నివాళి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి కలెక్టర్ స్నేహ శబరీష్, ఆర్‌డీవో రాథోడ్ రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కాళోజీ జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేష్, జిల్లా ఖజానా అధికారి శ్రీనివాస్‌కుమార్ కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, జిల్లా పరిశ్రమల శాఖ జిల్లా జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, సాహిత్యకారులు, భిన్న వర్గాల ప్రతినిధులు కాళోజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

చార్మినార్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లకు
డోర్నకల్‌లో హాల్టింగ్

7

## రోడ్ల పక్కన దేవత ప్రతిమలను అమ్మొద్దు..

### జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో ఇకపై రోడ్లకు ఇరుపక్కల దేవతా మూర్తుల విగ్రహాల క్రయ విక్రయాలు జరుపడం నిషేదమని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై వరంగల్‌లో రంగలీల మైదానం, హనుమకొండలో హైగ్రీవచారీ కాంపౌండ్‌లో మాత్రమే అమ్మకాలు జరపాలని ఆయన వెల్లడించారు. రోడ్లపై దేవతా మూర్తుల విగ్రహాల విక్రయాలు జరుపడం వల్ల ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ అవుతుందని దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యాపారులు కేటాయించిన ప్రాంతాల్లో మాత్రమే అమ్మకాలు జరపాలని ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చంద్రశేఖర్ తెలిపారు.




నిందితుడికి పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్

## వ్యాపారిపై పీడీ యాక్టు

### కొన్నాళ్లుగా నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయించిన హైదరాబాద్ మెహదీపట్నంకు చెందిన ముద్దంగుల ఆదిత్యపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పీడీ యాక్టు నమోదు చేశారు. ఈ మేరకు పరకాల జైలులో ఉన్న నిందితుడికి సీపీ జారీచేసిన పీడీ యాక్టు ఉత్తర్వులను పరకాల ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ మంగళవారం అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. కాగా, పీడీ యాక్టు అందుకున్న నిందితుడితో పాటు మరో ఆరుగురు వ్యక్తులు కలిసి ముఠాగా ఏర్పడి కాలంచెల్లిన పురుగు మందులను ఫర్టిలైజర్ డీలర్ల నుంచి తక్కువ డబ్బులకు కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తూ గత జూన్ 6న పరకాల పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా ముఠా నుంచి రూ.63లక్షల 62వేల విలువ గల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకుకొని పరకాల జైలుకు తరలించారు. నిందితుడిపై గతంలో ఇదే తరహా మోసంలో మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో 3 కేసులు నమోదయ్యాయి.

## త్వరితగతిన మేడారం అభివృద్ధి పనులు

- సమన్వయంతో మాస్టర్‌ప్లాన్ అమలు చేయాలి
- గద్దెల మార్పులో సంప్రదాయాలు పాటించాలి
- మంత్రి ధనసరి సీతక్క
- కలెక్టర్, ఎస్పీతో కలిసి పర్యటన
- మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో కోయల మూలాలు లేవు: ఆదివాసీ సంఘాలు

తాడ్వాయి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మేడారం మహాజాతర అభివృద్ధి పనుల్లో ఏమాత్రం జాప్యం చేయకుండా త్వరగతిన పూర్తిచేయాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, పలు శాఖల అధికారులతో కలిసి మంత్రి మంగళవారం పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వీఐపీ పార్కింగ్ రోడ్డు, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూం, హరిత హోటల్, గద్దెల పరిసరాలు, క్యూ లైన్లను పరిశీలించారు. మహాజాతర సమీపిస్తున్న దృష్ట్యా అభివృద్ధి పనులను వంద రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గద్దెల పరిసరాలను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా మారనున్న గద్దెల రూపుపై పూజారులు, అధికారులతో చర్చించారు. వెంటనే గద్దెల ప్రాకారం అభివృద్ధి పనులను చేపట్టాలని అన్నారు. అనంతరం ఐటీడీఏ అతిథి గృహంలోని సమావేశం గదిలో పూజారులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్లైడ్‌షో ద్వారా గద్దెల మాస్టర్ ప్లాన్ రూపకల్పనను మరోసారి వివరించారు. పూజారులు, అధికారులు సమన్వయంతో పనులను త్వరిగతిన పూర్తి చేయాలన్నారు. గోవిందరాజు, పగడిద్దరాజు గద్దెల మార్పు, ప్రాకారం విస్తరణ, అతిథి గృహాల నిర్మాణం, ఫ్లడ్ లైట్లు, డ్రెయినేజీ వ్యవస్థ, ఉప మండపం ఏర్పాటు, క్యూ లైన్ల విస్తరణ, రహదారుల మరమ్మతు, భక్తుల సౌకర్యాలు తదితర అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. యావత్తు ప్రపంచమే అబ్బురపడేలా మేడారంలో అభివృద్ధి జరగాలని తెలిపారు. పూజారులు సమన్వయంతో

(మిగతా 6లో..)




మేడారంలో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్, ఎస్పీ, తదితరులు

## 13న మేడారంలో సీఎం పర్యటన



ములుగు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న మేడారంలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని మంత్రి సీతక్క మంగళవారం ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు మేడారం మహాజాతర జరగనున్న నేపథ్యంలో.. అక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను, గద్దెల మార్పు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సీఎం రానున్నారు. హైదరాబాద్‌లో మంత్రులు కొండా సురేఖ, ధనసరి సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌తో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్‌తో సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి తన పర్యటన గురించి ప్రస్తావించారు. వారం రోజుల్లోగా మేడారానికి వచ్చి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని తెలిపారు. ఈ క్రమంలోనే మంత్రి సీతక్క మంగళవారం మేడారంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.





లంబాడీ నాయక్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు

## లంబాడీల రిజర్వేషన్లపై కుట్ర

### అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ నేతల డిమాండ్

### ఎస్టీ హోదా పరిరక్షణకు బాలసముద్రంలో ధర్నా

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లంబాడీల రిజర్వేషన్లను అడ్డుకునే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్‌జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి ఆధ్వర్యంలో మంగళవారం ఎస్టీ హోదాను పరిరక్షించాలని బాలసముద్రంలోని రాణునాయక్ విగ్రహానికి పూలమలలు వేసి ఘనంగా నివాళులర్పించి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి లంబాడీలు విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, మహిళలు హనుమకొండకు తరలి వచ్చారు.

ఈ సందర్భంగా ఎల్‌జేఏసీ కన్వీనర్లు జైసింగ్ రాథోడ్ , జాటోత్ కిషన్ నాయక్‌లు మాట్లాడుతూ.. లంబాడీలపై నిరాధార ఆరోపణలు చేస్తున్న కోయ, గోండుకు చెందిన రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లంబాడీల రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. లంబాడీల పక్షాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడకపోయినా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ లంబాడీల వ్యతిరేకమైన పార్టీలను బొందపెడుతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని తెలిపారు. లంబాడీల ఎస్టీ హోదా పరిరక్షణకై 32 జిల్లాలలో ఆత్మగౌరవ ర్యాలీలు, సభలను నిర్వహించి నిరసనను తెలపాలని కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావులు లంబాడీల రిజర్వేషన్లపై కుట్ర చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధంగా ఆర్టికల్ 342 ద్వారా 1976లో ఎస్టీ జాబితాలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్, రాష్ట్రపతి ముద్ర ద్వారా బిల్లు పాస్ చేశారని, రాజకీయ కుట్రతో మాజీ ఎంపీ సోయం బాబురావు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్ల వెంకటరావులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం సిగ్గు చేటని అన్నారు. కాగా, లంబాడీల శాంతి ర్యాలీకి పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో కొద్ది సేపు పోలీసులకు, ఎల్ జేఏసీ నాయకులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ కార్యక్రమంలో సమన్వయ కర్త వీఎన్ నాయక్, జాక్ నేత రాజు నాయక్, వినోద్, లంబాడీ జాయింట్ యాక్షన్ నేతలు వాంకుడోత్ వీరన్న నాయక్, గోవింద్ నాయక్, వీరమ్మ, గోపీసింగ్ నాయక్, వసంత్ నాయక్, బానోతు వెంకన్న నాయక్, డాక్టర్ ఉదయ్ సింగ్ నాయక్, బానోతు భిక్షపతి నాయక్, రాజు నాయక్, అజ్మీరా వెంకట్ నాయక్, జోహార్ నాయక్, భీమా నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదర్ రాజనర్సింహాకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన సీనియర్ రెసిడెంట్లు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖమంత్రి దామోదర్ రాజనర్సింహను టీఎస్ఆర్‌డీఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో సినియర్ రెసిడెంట్ డాక్టర్ సంఘం ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరునెలల సీనియర్ రెసిడెన్సీ పూర్తి చేసిన 2025 బ్యాచ్ సీనియర్ రెసిడెంట్లు కూడా టీవీవీపీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల మెగా నోటిఫికేషన్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం కాలేజీలలోఉన్న సర్టిఫికెట్లను విడుదల చేయాల్సిందిగా కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీనియర్ రెసిడెంట్ల వినతిని పరిశీలించాల్సిందిగా ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరవింద్, డాక్టర్ ప్రతిమ, డాక్టర్ సౌజన్య, డాక్టర్ నాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో క్యాన్సర్ కేర్ సెంటర్

● వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన మంత్రి రాజనర్సింహా

మహబూబాబాద్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో క్యాన్సర్ కేర్ సెంటర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి దామోదర రాజ నర్సింహ వర్చువల్ పద్ధతిలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ క్యాన్సర్ కేర్ సెంటర్‌ను ఎంఎన్‌జే క్యాన్సర్ కర్ సెంటర్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ క్యాన్సర్ సెంటర్‌లో జనరల్ సర్జన్, అనస్తీసియా డిపార్ట్‌మెంట్ అనుసంధానంగా క్యాన్సర్ పేషంట్లకు వైద్యం అందించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఆస్పత్రిలో క్యాన్సర్ కేర్‌తో 20 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. దీనిలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలో 160 మంది క్యానర్సర్ రోగులు ఉన్నారని, వీరందరికి ఉచితంగా క్యాన్సర్ వైద్య అందుతుందన్నారు. మహబూబాబాద్ నుంచి వర్చువల్ విధానంలో పాల్గొన్న ఆస్పత్రి సూపరంటెండెంట్ శ్రీనివాసరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ లకావత్ వెంకట్, ఆర్ఎంవో జగదీష్, డిప్యూటీ ఆర్ఎంవో హర్షవర్ధన్, ప్రొఫెసర్ గోదాదేవి, సునీల్, వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## జూనియర్ అసిస్టెంట్‌ను వేధించిన వ్యక్తిపై కేసు

నల్లబెల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లబెల్లి తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం కేసులో మాలోతు చరణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వాంకుడోత్ కల్పనపై కాంగ్రెస్ నాయకుడు చరణ్‌సింగ్ కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నారు. ఆమె వినకపోయే సరికి ఆమె పనితీరు సరిగా లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీనిపై తహసీల్దార్ ముప్పు కృష్ణను కల్పన అడగగా.. చరణ్‌సింగ్‌తో మాట్లాడుకోవాలని చెప్పాడు. ఆవేదనకు గురైన కల్పన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం పాల్పడగా ప్రస్తుతం కల్పన నర్సంపేట దవాఖానలో చికిత్స పొందుతోంది. కాగా, ఆమె భర్త లకావత్ దుప్‌సింగ్ ఇచ్చిన ఫిర్యాదుతో చరణ్‌సింగ్‌పై కేసు నమోదు చేసినట్లు మంగళవారం రూరల్ సీఐ సాయిరమణ వెల్లడించారు. అలాగే తహసీల్దార్‌పై కూడా విచారణ జరుగుతోందన్నారు.

# పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించాలి

**హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్**

**అధికారులు, మహిళా సమాఖ్యుల అధ్యక్షులతో సమీక్ష**

హనుమకొండ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పండ్లు, కూరగాయల సాగులో జిల్లా రైతులను ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మంగళవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో వివిధ శాఖల అధికారులు, మహిళా సమాఖ్య అధ్యక్షులతో జిల్లాలో పండ్లు, కూరగాయల సాగు, వాటి అమ్మకాలు, ఇతర ప్రాంతాల నుండి రవాణా, పట్టు పరిశ్రమ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతోందని, చాలా మంది రైతులు వరి సాగుకే మొగ్గు చూపిస్తున్నారని అన్నారు. పండ్లు, కూరగాయలకు ఎప్పుడూ మంచి మార్కెట్ ఉంటుందని, ఇతర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోకుండా జిల్లాలోనే పండ్లు, కూరగాయలు సాగు అయ్యేలా అధికారులు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. పండ్లు, కూరగాయలను మహిళా సమాఖ్యల ద్వారా బ్రాండింగ్ చేస్తూ లాభాల బాటలో పయనించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొంత భూమిని లీజుకు తీసుకొని పట్టు సాగు చేయాలని సూచించారు. మహిళా సమాఖ్య ద్వారా కందులు కొనుగోలు చేసి ప్రాసెస్ చేసిన అనంతరం పప్పు అమ్మకాలు సాగించాలని సూచించారు. మహిళా సమాఖ్య, మహిళా ఎఫ్‌పీవోలకు మార్గనిర్దేశనం చేస్తూ లాభాలు పొందే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్యల ద్వారా దాల్‌మిల్ నిర్వహణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ మండలంలో పండ్లు, కూరగాయల సాగును ప్రోత్సహించాలన్నారు. ధాన్యం కొనుగోలుపైనే కాకుండా పండ్లు, కూరగాయాల మార్కెటింగ్‌పై పార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్స్ మహిళా సమాఖ్యలు ప్రధానంగా దృష్టి పెట్టాలని సలహా ఇచ్చారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఈ సమావేశంలో డీఆర్‌డీవో మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి అనసూయ, మార్కెటింగ్ శాఖ అధికారి అనురాధ, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నవీన్ కుమార్, ఇతర అధికారులతో పాటు ఐనవోలు ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

## ఆర్టీఏ కార్యాలయానికి ట్రైనీ ఎంవీఏఐలు

● ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు, ఖమ్మం జిల్లాలో 15 రోజుల పాటు శిక్షణ

ఖిలావరంగల్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ హైదరాబాద్‌లో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ట్రెయినీ ఎంవీఏఐ)లు మంగళవారం వరంగల్ జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. శిక్షణలో భాగంగా వీరు వివిధ విభాగాలలో విధులు నిర్వర్తిం చారు. ఈ నెల 6 నుంచి 21వరకు 15 రోజుల పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో క్షేత్రస్థాయిలో శిక్షణ తీసుకుంటున్నామని, అందులో భాగంగానే ఇక్కడికి వచ్చామని తెలిపారు. వీరికి వరంగల్ సీనియర్ మోటార్ వెహికిల్ అధికారి (ఎంవీఐ) టీ.జయపాల్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ట్రెయినీ అధికారులు 10 మంది హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాల్‌పల్లి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్‌సీ, టీసీ, జాతీయ రోడ్డు పర్మిట్‌లను తనిఖీ చేసి కేసు నమోదు చేస్తారు. మంగళవారం వరంగల్ జిల్లాలో 35 వాహనాలను చెక్ చేసి, సరైన పత్రాలు లేని వాహనాలకు కేసు నమోదు చేశారు. బుధవారం మహబూబాబాద్ జిల్లాలో శిక్షణలో భాగంగా తనిఖీ చేస్తారని సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ జయపాల్‌రెడ్డి తెలిపారు.

## యూనిఫామ్‌ల అందజేత

మడికొండ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని మంగళవారం కాజీపేట మండలం అయోధ్యపురం ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూల మా లలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రవాస భారతీయ దంపతులు సుష్మ-శ్రీనివాస్ టై, బెల్టులు, యూనిఫామ్‌లను అందజేశారని ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్య తెలిపారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న శారదాదేవి కుమార్తె ఎన్నారై సుష్మశ్రీనివాస్ పేద విద్యార్థుల కోసం పంపిన టై బెల్టులు, యూనిఫామ్‌లను మంగళవారం కాజీపేట ఎంఈవో బండారు మనోజ్‌కుమార్ చేతుల మీదుగా చిన్నారులకు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ఫలితాలను వెల్లడిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రాజేందర్, సురేశ్‌లాల్, తిరుమల, వెంకటయ్యలు

## కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాల వెల్లడి

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలో డిగ్రీ 6వ సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు సోమవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌లు ఫలితాలను విడుదల చేశారు. సెప్టెంబరు 2న పరీక్షలు నిర్వహించారు. అన్ని విభాగాల పరీక్షల్లో 83 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు పరీక్షల అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్‌చిర్రా రాజు గౌడ్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ పి.వెంకటయ్యలు పాల్గొన్నారు. ఫలితాలను కేయూ వెబ్‌సైట్https://kakatiya.ac.in/ లో చూడాలని సూచించారు.

### కేయూ న్యాయశాస్త్ర పరీక్షల రీ షెడ్యూల్ విడుదల

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెప్టెంబరు 12న జరగాల్సిన కేయూ న్యాయశాస్త్ర పరీక్షల రీషెడ్యూల్ టైంటేబుల్‌ను సోమవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ మహ్మద్ అసీం ఇక్బాల్‌లు విడుదల చేశారు. సెప్టెంబరు 12న జరిగాల్సిన ఎల్ఎల్‌బీ మూడేళ్ల రెండో సెమిస్టర్ మూడో పేపర్, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల 6వ సెమిస్టర్ 3వ పేపర్ పరీక్ష సెప్టెంబరు 15న సోమవారం జరుగుతుందని స్పష్టం చేశారు. మిగతా పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతాయని, పరీక్షల కేంద్రాలు, సమయంలో ఎలాంటి మార్పులు లేవని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

## కిడ్నాప్ నాటకం కేసులో ఇద్దరి అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రావు

మట్టెవాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న యువకుడు తండ్రి నుంచి డబ్బు పొందాలని కిడ్నాప్ నాటకమాడిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. కేసు వివరాలను మంగళవారం సాయంత్రం మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌రావు మీడియాకు వెల్లడించారు. వరంగల్ కొత్తవాడ వాసవికాలనీకి చెందిన అదిత్ సోనిఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని అప్పులపాలయ్యాడు. ఆ డబ్బులు తండ్రి అశోక్ సోనీ నుంచి తీసుకొని అప్పు తీర్చాలనుకున్నాడు. ఇందుకోసం పోచమ్మ మైదాన్‌కు చెందిన యాకూబ్ పాషాతో కలిసి కిడ్నాప్ నాటకానికి ప్లాన్ చేశారు. ఇద్దరు కలిసి సోమవారం ఒక లాడ్జిలో ఉండి యాకూబ్‌తో తండ్రి అశోక్ సోనికి ఫోన్ చేయించాడు. రూ.10 లక్షలు ఇవ్వకపోతే నీ కొడుకును చంపేస్తామని బెదిరించాడు. దీంతో ఆయన పోలీసులను సంప్రదించాడు. వారు మంగళవారం హంటర్ రోడ్ బొందివాగు ప్రాంతంలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద ఒక ఆటో, రెండు మొబైల్‌ఫోన్‌లను స్వాధీనపర్చుకున్నారు. సమావేశంలో ఎస్ఐలు శ్రీనివాస్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్‌పై కేసు నమోదు

**మట్టెవాడ పీఎస్ పరిధిలో వ్యక్తిపై బీరుతో దాడి**

వరంగల్ క్రైం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిని గాయపరిచిన ఘటనలో రౌడీషీటర్ వంచనగిరి సురేశ్ అలియాస్ కోతి సురేశ్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ సీఐ కర్ణాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రంగశాయిపేటకు చెందిన వలపదాసు గణేశ్, విక్కీలు కారు రెంటల్ బిజినెస్ చేస్తుంటారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య బిజినెస్‌లో వివాదం జరిగింది. కాగా, ఈనెల 7న ఉదయం మండిబజార్‌లోని అరేబియన్ మండిలో బిర్యానీ తినడానికి రౌడీషీటర్ వంచనగిరి సురేశ్, విక్కీ కలిసి వెళ్లగా అక్కడ గణేశ్ తారసపడ్డాడు. అక్కడ రౌడీషీటర్ సురేష్.. గణేశ్‌తో ఘర్షణకు దిగాడు. తన చేతిలో ఉన్న బీరుసీసాతో గణేశ్ తల, ముక్కుపై పొడిచి గాయపరిచాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సురేష్‌పై పలు సెక్షన్‌ల కింద సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, అదే రోజే కరీమాబాద్‌లోని రామస్వామి గుడి వీధిలో గణేశ్ నిమజ్జనంలో యువకులపై దౌర్జన్యం చేసి ముగ్గురు యువకులను తీవ్రంగా గాయపరచగా బాధితుల ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.

## ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలు కృషిచేయాలి

● ఉద్యమకారుల వేదిక చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల వేదిక చైర్మన్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ కోరారు. మంగళవారం హనుమకొండలోని అదాలత్ సెంటర్‌లో రాచకొండ ప్రవీణ్ నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరపాటి మాట్లాడుతూ.. వరంగల్‌లో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యేలు కృషి చేయాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను కేసీఆర్ ముక్కలు చేసి విధ్వంసానికి గురిచేశారన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మేనిఫెస్టోలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని ప్రకటించిన విధంగా హనుమకొండ, వరంగల్ జిల్లాలను ఒకే జిల్లాగా ఏర్పాటు చేయాలన్నారు. సీఎం రేవంత్ ప్రకటించిన విధంగా రూ.6వేల కోట్ల అభివృద్ధి నిధులు సమకూర్చి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మామునూరు ఎయిర్‌ఫోర్ట్, ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం అభివృద్ధి పనులను త్వరగా అమలు చేయాలని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ 300 ఏళ్ల చరిత్ర గల వరంగల్ సెంట్రల్ జైలు కూలగొట్టి ఆ భూమిని తాకట్టుపెట్టారన్నారు. కానీ తిమ్మాపూర్‌లో తిరిగి జైలును నిర్మించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కులో స్థానికులకు నైపుణ్యాలు పెంచి ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్స్ (ఐఐఎం)ను కేంద్రంపై ఒత్తిడి తెచ్చి వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సోమ రామమూర్తి, బీసీ సంఘం నాయకుడు, న్యాయవాది రాచకొండ ప్రవీణ్, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సోయం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

## త్వరితగతిన మేడారం అభివృద్ధి పనులు

(5వ పేజీ తరువాయి)

పనిచేస్తూ గద్దెల మార్పునకు కావాల్సిన పూజ కార్యక్రమాలు సంస్కృతీ సంప్రదాయాలతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఎస్పీ రవీందర్, ఆర్కియాలజిస్ట్ రాజశేఖర్ పలు శాఖల అధికారులు, పూజారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గద్దెల మార్పుపై అభిప్రాయం తీసుకోవాలి

మేడారం మహాజాతర అభివృద్ధిలో భాగంగా ఆర్కియాలజిస్టులు రూపకల్పన చేసిన మాస్టర్‌ప్లాన్‌ను ఆదివాసీ పెద్దలు, కుల సంఘం, ఇలవేల్పుల తలపతుల అభిప్రాయాలు తీసుకోవడం మంచిదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కు మార్, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి ప్రకటనలో తెలిపారు. గద్దెల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని తెలిపారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో కోయల మూలాలు లేవని అ న్నారు. అభివృద్ధి అనే బంగారు కత్తితో మెడ కోస్తున్నామంటే ఎలా అని ఎద్దేవా చేశారు. సమ్మక్క సా రలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు పూజారులకు మాత్రమే దేవతలు కాదని యావత్ భారత దేశ ఆదివాసి దేవతలు అని గుర్తు చేశారు. చరిత్ర తెలియకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే మూల్యం తప్పదని హెచ్చరించారు.

## క్యూలైన్లు.. టోకెన్లు..

**యూరియా కోసం రైతులకు తప్పని తిప్పలు**



యూరియా కోసం క్యూలైన్లో నిల్చున్న రైతులు

కరీమాబాద్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి, స్వేదం చిందించి ప్రజల ఆకలి తీర్చే రైతన్నలకు యూరియా తిప్పలు తప్పడంలేదు. యూ రియా కొరత కారణంగా పంటలు పండుతాయో ఎండుతాయో తెలియక ఆందోళన చెందుతున్నారు. మంగళవారం అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని ఖిలావరంగల్ మండలం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా పంపిణీ చేస్తున్నారని తెలుసుకున్న రైతులు భారీసంఖ్యలో తరలివచ్చారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ వద్ద గల సంఘం భవనం ఎదుట క్యూ కట్టారు. గంటలతరబడి నిల్చోలేక ఇబ్బందులు పడ్డారు. పాలకులు, అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. దేశానికి వెన్నెముక అంటూ రైతులను కీర్తించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం యూరియా అందించలేకపోతున్నాయని ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. కాగా, పరిస్థితి గమనించిన వ్యవసాయ అధికారులు రైతులకు ముందుగా టోకెన్లు అందించి వాటి ద్వారా ఎరువులు అందించారు. మంగళవారం నాడు ఇరవై టన్నుల యూరియాను 264 మంది రైతులకు పంపిణీ చేశామని మండల వ్యవసాయశాఖాధికారి విజ్ఞాన్ తెలిపారు.

## ఆ సీఐ రూటే సపరేటు..

● ఇల్లే సెటిల్‌మెంట్లకు అడ్డా ● నిందితులతో బేరసారాలు

● కేసుల్లో మాయ చేయడంలో దిట్ట

జనగామ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లాలో ఆయన ఓ ఠాణా సీఐ. ఆయనదంతా సెపరేట్ రూట్. కేసుల నమోదు, విచారణలో ఆయనదో విపరీత పోకడ. బాస్‌లు, నిఘా విభాగాలున్నాయన్న భయం లేదు. అమాయకులను కేసుల్లో ఇరికించడం, నిందితులతో బేరసారాలు నడపడం, కేసుల పేరుతో బెదిరించి సెటిల్‌మెంట్లు చేయడం ఆయన ప్రత్యేకత. ఈ సీఐ తీరు రోజురోజుకీ వివాదాస్పదంగా మారుతోంది. ఎస్‌హెచ్‌వోగా ఉన్న ఆ ఠాణాలో అంతా తానేనన్న విధంగా ప్రవర్తిస్తారన్న ప్రచారం ఉంది. ఏ కేసు వచ్చినా మొదట తన వద్దకే పంపాలంటూ కింది స్థాయి సిబ్బందికి హుకుం జారీ చేస్తారన్న విమర్శలున్నాయి. ఎవరైనా తన పైఅధికారుల వద్దకు వెళ్లి తన వద్దకు వస్తే అక్కడికి ఎందుకు వెళ్లారంటూ బాధితులపై ఆగ్రహం వ్యక్తం చేస్తారనే ప్రచారం ఉంది. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు కూడా తన పేరు మీదే ఉండాలని, ఉన్నతాధికారుల పేరు మీద ఎలాంటి ఫిర్యాదులు రాయడానికి వీల్లేదంటూ ఫిర్యాదు రాసే వాళ్లకి గట్టిగా వార్నింగ్ కూడా ఇచ్చినట్లు సమాచారం.

### నిందితులతో బేరసారాలు?

ఇటీవల తన పరిధిలో జరిగిన ఓ అత్యాచార ఘటనలో నిందితులను తప్పించేందుకు పెద్ద ఎత్తున బేరసారాలు జరిపినట్లు సమాచారం. నిందితులను తప్పిస్తున్నారన్న విషయం ఉన్నతాధికారి దృష్టికి వెళ్లడంతో సదరు సీఐని పిలిచి గట్టిగా వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. తర్వాత ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కేసు విషయాల్లో స్టేషన్‌కు వచ్చే వారితో 'ఇంటికి రండి మాట్లాడుదాం' అంటూ ఏకంగా తన ఇంటికి పిలిపించుకొని మరీ 'సెటిల్‌మెంట్ల దుకాణం' తెరుస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఓ చోరీ కేసులో బాధితులను బెదిరించి చోరీ తక్కువ జరిగినట్లుగా ఫిర్యాదు రాయించడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఏదైనా కేసుకు సంబంధించి నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లతోపాటు 'అదర్స్' అని మెన్షన్ చేసి, అనుమానితులను బెదిరించి సెటిల్‌మెంట్లు చేస్తారన్న చర్చ జరుగుతోంది. తన కింద పనిచేసే ఓ ఎస్సైని, ఓ కానిస్టేబుల్‌ను వసూళ్లకు వాడుకుంటున్నారని తెలుస్తోంది. ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ చేయకుండా సీఐ తాత్సారం చేస్తారన్న చర్చ జరుగుతోంది. కేసు నిమిత్తం వచ్చే వారితో తన 'ట్రాక్ రికార్డ్' చెప్పుకుంటూ ఒకరకంగా వారిని హెచ్చరిస్తారని తెలుస్తోంది.

### పోలీస్ ఉన్నతాధికారి పేరు...

తనకు రాష్ట్రస్థాయిలో ప్రస్తుతం పనిచేస్తున్న ఓ పోలీస్ ఉన్నతాధికారి అండదండలు ఉన్నాయని సీఐ చెబుతుంటారంట. గతంలో సీపీగా పనిచేసి ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో ఉన్న ఆ అధికారి తనకు గాడ్ ఫాదర్ అని చెప్పుకుంటారని పోలీస్ శాఖలో టాక్ నడుస్తోంది. ఇటీవల సదరు సీఐ బదిలీ అవుతారన్న ప్రచారం జరగగా సదరు గాడ్ ఫాదర్ అండతోనే బదిలీని ఆపారన్న ప్రచారమూ ఉంది. సీఐ వ్యవహార శైలిపై ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాల్సిన పోలీసు నిఘా విభాగాలు సైతం చూసీ చూడనట్లు వదిలేస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి.

### వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

| పంట | క్వింటా గరిష్ఠం | క్వింటా కనిష్ఠం |
|---|---|---|
| పత్తి | 7580 | 5300 |
| మక్కలు | 2201 | 1521 |
| కందులు | 5633 | 3022 |
| పెసళ్లు | 4711 | 3022 |
| పల్లికాయ (సూక) | 6080 | 3500 |
| పల్లికాయ (పచ్చిది) | 4100 | 2400 |
| పసుపు (కాడి) | 10809 | 7889 |
| పసుపు (గోల) | 10509 | 8996 |
| తేజ మిర్చి | 12500 | 9500 |
| తేజ ఏసీ | - | - |
| వండర్‌హాట్ | - | - |
| వండర్‌హాట్ ఏసీ | 16500 | 12000 |
| యూఎస్341ఏసీ | 14600 | 9000 |
| దీపిక | - | - |
| సింగిల్‌పట్టి ఏసీ | - | - |
| తాలు మిర్చి | 6000 | 4000 |

- వరంగల్ వ్యవసాయం

పాలకుర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి నాంది పలికిన యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ. ఐలమ్మ చేసిన భూ పోరాటం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. భూ పంపిణీ అంశం రాజకీయ ఎజెండాగా మారిందంటే, అందుకు ప్రేరణ ఐలమ్మ చేసిన పోరాటమే. నిజాం నియంతృత్వ పాలనపై తిరుగుబాటు చేసిన యోధురాలు ఆమె. ఐలమ్మ వృద్ధాప్యంతో 90 ఏండ్ల వయస్సులో సెప్టెంబరు 10న 1985లో కన్నుమూసింది. ఆమె మరణానంతరం పాలకుర్తిలో స్మారక భవనం, స్మారక స్థూపం నిర్మించారు. కాంస్య విగ్రహాన్ని 2015లో వామపక్షాలు ఉమ్మడిగా ఆవిష్కరించాయి. ఐలమ్మ 40 వర్ధంతి (సెప్టెంబరు 10)ని వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోంది.


- భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుకు చిహ్నం
- ప్రజా పోరాటాలకు నిత్యస్ఫూర్తిదాయకం
- నేడు సమరయోధురాలు ఐలమ్మ 40వ వర్ధంతి

### ఉద్యమానికి కేంద్రం బిందువు...

ఎన్ని ఎత్తులు వేసినా దేశ్‌ముఖ్ ఓటమి పాలవ్వక తప్పలేదు. దీంతో పాలకుర్తి గ్రామంపై దాడులు చేయించాడు. ఐలమ్మ ఇంటి దోచారు. కార్యకర్తల ఇండ్లకు నిప్పు పెట్టారు. అయితే ఐలమ్మ పోరాటంతో భూస్వాములు భయంతో పట్టణాల బాటపట్టారు. ఐలమ్మ కొడుకులు దళ కమాండర్‌లుగా ఎదిగారు. ఐలమ్మ భూ పోరాటంతో సాయుధ పోరాటం జరిగింది. వేలాది ఎకరాలు భూములు ప్రజలకు పంచబడి గ్రామ స్వరాజ్యాలు ఏర్పడ్డాయి.

# కొంగు నడుముకు చుట్టి.. పోరుజెండా పట్టి..

## దేశ్‌ముఖ్‌లను గడగడలాడించిన చాకలి ఐలమ్మ



ఐలమ్మ కాంస్య విగ్రహం

వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కిష్టపురంలో ఐలమ్మ జన్మించింది. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రానికి ఐలమ్మ కోడలుగా వచ్చింది. ఆమె వచ్చే నాటికి బానిస బతుకులు తప్ప ప్రశ్నించే రోజులు లేవు. కుల వృత్తిపై అధారపడి ఐదుగురు కొడుకులను, కూతురును పోషించుకునే స్థితి లేకపోవడంతో వ్యవసాయం వైపు మొగ్గుచూపింది. పాలకుర్తి మండలం మల్లంపల్లి మక్తేదారు కొండల్‌రావుకు చెందిన భూమి ఉండగా దానిని కౌలుకు తీసుకొంది. కొండల్‌రావు తల్లి జయప్రద దేవి కౌలుకిచ్చింది. భర్త నర్సయ్యతోపాటు మరిది సోమల్లయ్య, కొడుకులు సోమయ్య, లచ్చయ్యలతో వ్యవసాయం చేసేది. ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న క్రమంలో భూస్వాముల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. దీంతో పోలీస్ పటేల్ వీరమనేని శేషగిరిరావుతో ఐలమ్మ కుటుంబానికి విరోధం ఏర్పడింది. ఐలమ్మ భూమిలోకి వెళ్లాలంటే పోలీస్ పటేల్ భూముల్లోంచే వెళ్లాలి. దారి లేదు. ముందుగా తన పొలంలో పని చేశాకే తర్వాత మీ భూముల్లో పని చేసుకోవాలని శేషగిరిరావు ఆదేశించాడు. దాన్ని ధిక్కరించి ఐలమ్మ పంట సాగు చేసింది. అదే సమయంలో దొరలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు చేస్తుండగా, ఐలమ్మ కుటుంబం ఆ పార్టీలో చేరింది. సంఘం కార్యక్రమాల్లో ఐలమ్మ చురుగ్గా పాల్గొనేది. ఇది చూసిన శేషగిరిరావు విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డికి ఐలమ్మపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఐలమ్మను, పార్టీని విచ్ఛిన్నం చేయాలనే కుట్రలు చేశారు.



ఐలమ్మ స్మారక స్థూపం

### కమ్యూనిస్టు నాయకులపై కుట్ర కేసు...

పాలకుర్తిలో 1945లో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సభను పెట్టాలని నిర్ణయించారు. ఇది సక్సెస్ అయితే తమకు నూకలు చెల్లుతాయని, తమ ఆధిపత్యానికి గండి పడుతుందని గ్రహించిన దేశ్‌ముఖ్.. గూండాలను పురమాయించాడు. పాలకుర్తి వీధుల్లో తిరుగుతూ కమ్యూనిస్టు నాయకుడైన ఆరుట్ల రాంచంద్రారెడ్డిని చంపుతామని బహిరంగంగా హెచ్చరించారు. కమ్యూనిస్టు నాయకులు తమ సభకు, నాయకులకు రక్షణ కల్పించాలని కోరినప్పటికి పోలీసులు నిరాకరించారు. పాలకుర్తిలో ఓ చోట సభ ప్రారంభం కాగానే దేశ్‌ముఖ్ గూండాలు అల్లరి సృష్టించారు. ఆరుట్ల రాంచంద్రారెడ్డిపై దాడికి దిగేలోపే ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఆ గూండాలపై ప్రతిదాడికి దిగి వారిని తరిమికొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆరుట్లను జాగ్రత్తగా మారువేషంలో వావిలాలకు పంపారు. తమ అనుచరులను చంపే ప్రయత్నం చేశారని దేశ్‌ముఖ్ కుట్ర చేసి కేసు పెట్టించాడు. నాయకుల్ని అరెస్ట్ చేసి జైలుకు పంపారు.

### అండగా కమ్యూనిస్టులు

ఐలమ్మ భూమిని, పంటను కాజేయాలని దేశ్‌ముఖ్ తప్పుడు పత్రాలు సృష్టించి భూమి తనదేనని బెదిరింపులకు గురి చేశాడు. అప్పటికే ఐలమ్మ భర్త నర్సయ్య, కొడుకులు సోమయ్య, లచ్చయ్యలు కుట్ర కేసులో జైల్లో ఉన్నారు. ఒంటరిగా ఉన్న ఐలమ్మను దెబ్బతీస్తే అటు ఐలమ్మ కుటుంబం ఇటు కమ్యూనిస్టు ఉద్యమం దెబ్బతింటుందని భూస్వాములు ఎత్తులు వేశారు. ఐలమ్మ ధైర్యంతో ముందుకెళ్లింది. కమ్యూనిస్టు నాయకులకు విషయాన్ని వెల్లడించింది. నల్లగొండ జిల్లా నాయకత్వం సీరియస్ తీసుకొని భూమి రక్షించేందుకు ప్రణాళిక రూపొందించారు. పాలకుర్తికి వచ్చి ఐలమ్మకు, స్థానిక పార్టీకి రక్షణగా అగ్రనాయకత్వం నిలిచింది.

పాలకుర్తి ఆర్గనైజర్ చకిలం యాదగిరిరావు, జిల్లా పార్టీ కార్యదర్శి దేవుళ్లపల్లి వెంకటేశ్వర్‌రావు, బీంరెడ్డి నర్సింహరెడ్డి, ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డిలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, వలంటీర్లు పాలకుర్తికి చేరుకున్నారు. ఐలమ్మ ఇంట్లోనే ఉంటూ ఆ ఇంటిని పార్టీ కార్యాలయంగా మార్చారు. 1945 నవంబరులో ఐలమ్మ భూమిలో పండిన ధాన్యాన్ని దోచుకురమ్మని గూండాలను పాలకుర్తికి పంపాడు. భూమిలో అడుగుపెట్టిన ఆ గూండాలను ఆంధ్రమహాసభ నాయకత్వం తిప్పికొట్టింది. తర్వాత ధాన్యాన్ని ఐలమ్మ ఇంటికి చేర్చారు. పారిపోయిన గూండాలు దేశ్‌ముఖ్‌కు విషయం చెప్పటంతో పోలీసులను పంపించి నాయకుల్ని అరెస్ట్ చేయించాడు. వారు నాయకులను చిత్రహింసలకు గురిచేశారు.

---



ప్రజాకవికి కాళోజీ ఫౌండేషన్ పక్షాన సాహితీ ప్రముఖుల నివాళి



కాళోజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వినయభాస్కర్

# కాళన్న.. నిన్ను మరువదు ఈ గడ్డ..

### ప్రజాకవికి ఓరుగల్లు ఘననివాళి

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణ రావు 111వ జయంతి వేడుకలు యావత్ ఓరుగల్లు నగరం నిండా అనేక ప్రాంతా ల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు, సాహితీ వేత్తలతో పాటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కాళన్న సాహితీ సేవలను స్మరిస్తూ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పిం చారు. హనుమకొండ కాళోజీ సెంటర్‌లోని ప్రజాకవి కాంస్య విగ్రహానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లతోపాటు అధికారగణమంతా పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన సాహిత్య సేవలను స్మరిస్తూ నివాళులర్పించారు. కాళోజీ ఫౌండేషన్ పక్షాన అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి ఆధ్వర్యంలో అనేక సాహితీ ప్రముఖులు కాళోజీ కాంస్య విగ్రహం వద్దకు చేరుకొని మహనీయుడి విగ్రహానికి పూలమాలలు సమర్పించారు.

ఈ సందర్భంగా రామశాస్త్రి మాట్లాడుతూ.. వందేళ్ల తెలంగాణ సాహిత్య, సామాజిక సాంస్కృతిక చరిత్రలో కాళోజీది ఓ సుదీర్ఘ అధ్యాయమన్నారు. నిత్యం ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి కవిత్వంతో పాలకరాజ్యంపై కటువుగా స్పందిస్తూ అక్షరాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించిన కాళోజీ ఎల్లవేలలా ఓరుగల్లుపై చెరగని ముద్ర వేశారన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, నవలాకారుడు అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించడం ఒక సువర్ణ అధ్యయం అయితే ఈ క్షేత్రంలో కవులు, రచయితలు, సాహిత్యకారులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు మినీ హాల్ నిర్మించి ఇస్తామన్న విషయం మరుగునపడిందని, దీన్ని పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఘంటా రామిరెడ్డి, ఆచార్య బన్న అయిలయ్య, పందిళ్ల అశోక్ కుమార్, శశాంక, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్‌లతో పాటు అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. అంతకుముందు కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, మరో కవి పొట్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి వచ్చి కాళోజీ నివాళులర్పించి హైదరాబాద్‌లో జరిగే కాళోజీ సాహిత్య సదస్సుకు తరలివెళ్లారు.



కాళోజీ జంక్షన్ వద్ద కాళోజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

### మంగారి రాజేందర్‌కు కాళోజీ పురస్కారం

ఈ సారి ప్రముఖ కవి, న్యాయవాదిగా పేరు గడించిన మంగారి రాజేందర్‌కు కాళోజీ నారాయణరావు స్మారక పురస్కారం, ప్రముఖ హిందీ, ఉర్దూ కవి అంజనీకుమార్ గోయెల్‌కు కాళోజీ రామేశ్వర్‌రావు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసేందుకు తమ ఫౌండేషన్ నిర్ణయించిందని కాళోజీ ఫౌండేషన్ చైర్మన్ రామశాస్త్రి ప్రకటించారు. నవంబరు 14న జరిగే కాళోజీ సోదరుల యాది సభలో నగదుతో కవులను సత్కరిస్తామన్నారు.

---

# గతమెంతో ఘనం.. వర్తమానం దైన్యం

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. అలాగే 2017లో న్యాక్‌లో 3.36 సీజీపీఏ (క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్)తో కేయూ ఎ-గ్రేడ్ సాధించింది. అయితే 2023లో ఇదే న్యాక్‌లో 3.27కి ర్యాంక్ పడిపోయింది.

రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూసా) నుంచి పరిశోధన, ఇన్నోవేషన్ కోసం రూ.50 కోట్లు గ్రాంట్ కూడా కేయూ పొందింది. ఈ ప్రాజెక్టు ద్వారా యూనివర్సిటీలో మౌళిక సదుపాయాలు, బోధన, అభ్యసన నాణ్యత, మెరుగుదల, అధ్యాపక అభివృద్ధి వంటి అంశాల్లో నిధులు ఖర్చు చేయాల్సి ఉంది. అయితే ఈ పాజెక్టులు నత్తనడక లో ఉండగా, పరికరాల కొనుగోలు మినహా పరిశోధనలో పెద్దగా పురోగతి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### పాలనలో నిర్లక్ష్యం.. రాజకీయ ఒత్తిళ్లు..

ఎన్నో ఘనమైన మైలురాళ్లను దాటిన కాకతీయ యూనివర్సిటీ ఇటీవల కాలంలో భూముల కబ్జాలు, అవినీతి, అక్రమాల ఆరోపణలతో ప్రతిష్ఠ మసకబారింది. కేయూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వర్సిటీ లోపల ఏసీబీ దాడులు, విజిలెన్స్ విచారణలు జరిగాయి. గతంలో పదవిలో ఉన్న వైస్ చాన్సలర్ అకడమిక్ అభివృద్ధి వైపు దృష్టి సారించకపోగా, అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాలు వర్సిటీ ప్రతిష్ఠను పదేళ్లు వెనక్కి నెట్టాయనే చర్చ జరుగుతుంది. అకడమిక్ నాణ్యత, పరిశోధనలపై శ్రద్ధ లేకపోవడం వల్ల విద్యార్థులు కూడా అవకాశాలు కోల్పోతున్నార ని విద్యా సంఘాలు అవేదన వ్యక్తం చేస్తున్నాయి. పది నెలల క్రితం కొలువుతీరిన పాలకవర్గం పాలనలో ప్రత్యేకమైన మార్పులు తీసుకరావటంపై దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారికి అధికార పదువులు కట్టబెట్టడం, కీలకమైన కార్యక్రమాలకు కూడా ఆ వర్గానికి చెందిన వారినే ఆహ్వానించడం వర్సిటీ లోపల తీవ్ర చర్చకు దారి తీస్తోంది. ఇటీవల జరిగిన స్నాతకోత్సవం, సైన్స్ కాంగ్రెస్ వంటి కార్యక్రమాలలో ఓ ఉన్నతాధికారి తన సామాజిక వర్గానికి చెందిన వారికే పెద్దపీట వేశారనే ప్రచారం ఉంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అధ్యాపకులు అర్హత కలిగినా ప్రాధాన్యం ఇవ్వటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులు, అధ్యాపకులు ఏళ్ల తరబడి ఒకేపోస్టులో తిష్టవేసిన వారిని బదిలీ చేసే సాహసం చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. డెవలప్‌మెంట్‌తో పాటు వివిధ పరీక్షలకు నియమించే పర్యవేక్షకులను కదిలించలేక పోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో అనేక ఆరోపణలను ఎదుర్కొంటున్న వ్యక్తిని తన పక్కనే సీటు కేటాయించుకోవటం వెనుక రాజకీయ ఒత్తిళ్లు భారీగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరిద్దరికి మినహా మిగతా వారందరు కూడా రాజకీయ ఒత్తిళ్లతో పదవులు పొందుతున్నారనే టాక్ ఉంది. కేయూ ఇటీవల స్నాతకోత్సవంతో పాటు జాతీయ సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించింది. అయితే ఆశించిన స్థాయిలో ఈ రెండు కార్యక్రమాలకు పేరు, పబ్లిసిటీ రాలేదనే అభిప్రాయం ఉంది. పాలనపై కాకుండా అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకే ఉన్నతాధికారులు పాకులాడుతున్నారనే ఆరోపణలు విపిపిస్తున్నాయి.

### అకడమిక్, పరిశోధనలపై దృష్టి పెడితినే..

కొత్త పాలక మండలి కొలువై పది నెలలు గడుస్తోంది. ఇప్పటికే కబ్జాలు, అవినీతి, అక్రమాలపై ఏసీబీ, విజిలెన్స్ విచారణలతో మసకబారిన ప్రతిష్ఠను పునఃప్రతిష్ఠించే కార్యక్రమాలు చేట్టాల్సి ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. విశ్వ విద్యాలయం తిరిగి ప్రతిష్ఠ సాధించాలంటే.. పాలనలో మార్పులు తప్పనిసరిగా రావాలని నిపుణులు సూచిస్తున్నారు. కుల ప్రాధాన్యతను పక్కనబెట్టి, అకడమిక్, పరిశోధనలపై పూర్తి దృష్టి పెట్టాలని కోరుతున్నారు. రూసా గ్రాంట్లను సక్రమంగా వినియోగించి, నూతన పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని, బోధన నాణ్యతను మెరుగుపరిచి, విద్యార్థుల కేరీర్ అవకాశాలను విస్తరించాలని సూచిస్తున్నారు.

---

# దొడ్డి దారిలో గడ్డి మందు

- మహారాష్ట్రలోని గడ్చిరోలి కేంద్రంగా గ్లైఫోసెట్ రవాణా
- విక్రయాలకు చీకటి నెట్‌వర్క్
- ఇప్పటికే రాష్ట్రంలో 80 వేల లీటర్లకు పైగా విక్రయం
- బీజీ-3 పత్తి సాగుదారులే ప్రధాన వినియోగదారులు

■ భూపాలపల్లి, ఆంధ్రజ్యోతి

రాష్ట్రంలో వేలాది లీటర్ల నిషేధిత (గ్లైఫోసెట్) గడ్డి మందును దొడ్డిదారిలో పంపిణీ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే దాదాపు 80 వేల లీటర్ల గడ్డి మందు రవాణా జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్లో ఈ గడ్డి మందు సరఫరా చేస్తున్న ముఠా సభ్యుల మధ్య జరిగిన గొడవతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. భూసారంతో పాటు మానవ ఆరోగ్యానికి.. పర్యావరణానికి చేటు చేసే గ్లైఫోసెట్ రసాయనాలను పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా తెచ్చి రహస్య ప్రాంతాల్లో నిలువ చేసి విక్రయిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కనీసం 50 వేల లీటర్లకు పైగా ఈ మందులు దిగుమతి అయినట్లు తెలుస్తోంది. ఈ తతంగమంతా భూపాలపల్లి జిల్లాకు పొరుగునే ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ కేంద్రంగా కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి ప్రాంతాల్లో జోరుగా సాగుతోందని అధికారులు గుర్తించారు. అయితే ఈ మందు కలుపును నివారించి ఖర్చు తగ్గిస్తుందన్న గుడ్డి నమ్మకంతో రైతులు కొనుగోళ్లకు ఎగబడుతున్నారు.

### బీజీ-3 విత్తనాలు సాగుచేసిన రైతులే..

బీజీ-3 పత్తి విత్తనాలను సాగుచేసిన రైతులే ఈ గ్లైఫోసెట్ గడ్డి మందును విరివిగా వాడుతున్నారు. వాస్తవానికి దేశంలో బీజీ-3 విత్తనాలకు అనుమతి లేదు. అయినప్పటికీ అమెరికాకు చెందిన మోన్‌శాంటో కంపెనీ దళారుల ద్వారా రైతులకు అంటగట్టి సాగుచేయిస్తోందనే ఆరోపణలున్నాయి. అదే కంపెనీ తయారు చేసే గ్లైఫోసెట్ గడ్డి మందు చల్లితే పత్తి మొక్కలు మినహా మిగితా గడ్డి జాతి మొక్కలు చనిపోతాయి. అలా రెండు నుంచి మూడు దఫాలుగా ఈ మందు చల్లితే ఆ పొలంలో ఇక గడ్డి మొలకెత్తదు. ఒక్కసారి చల్లిన మందు ప్రభావం 21 రోజుల పాటు నేలపై ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే కలుపు నియంత్రణలో కూలీల ఖర్చు కలిసొస్తుందన్న కారణంతో రైతులు గ్లైఫోసెట్ కోసం ఎగబడుతున్నారు. దీన్ని సొమ్ము చేసుకునేందుకు స్మగ్లర్లు అర లీటర్ మొదలుకొని 20 లీటర్ల పరిమాణం గల డబ్బాలు, క్యాన్లలో విక్రయిస్తున్నారు. ఎకరానికి 1.5 లీటర్ నుంచి 2 లీటర్ల వరకు పిచికారీ చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో రైతు రెండు హెక్టార్లకు గాను 7.5 లీటర్ల నుంచి పది లీటర్ల వరకు చల్లుతున్నారు. ఇలా పంట కాలం ముగిసే సరికి మూడు సార్లు ఈ మందును చల్లాలి. అంటే ఈ లెక్కన యేటా ఒక్కో రైతు కనీసం 20 నుంచి 25 లీటర్ల మందును వినియోగిస్తారు. దీంతో ఈ వ్యాపారం అక్రమార్కులకు మంచి ఆదాయ వనరుగా మారింది.



ఇటీవల మహాముత్తారంలో అక్రమంగా విక్రయించేందుకు నిల్వ చేసిన 300 లీటర్ల గ్లైఫోసెట్‌ను పట్టుకున్న పోలీసులు (ఫైల్)

మహారాష్ట్రలో అయిదు లీటర్ల క్యాన్‌ను రూ.1300 కొనుగోల చేసి ఇక్కడ రైతులకు రూ.2200 నుంచి మూడు వేల రూపాయల వరకు విక్రయిస్తున్నారు. అలాగే మహారాష్ట్రలో 20 లీటర్ల గ్లైపోసెట్‌కు రూ.5300 ధర పలుకుతుండగా అదే మందు ఇక్కడికి తీసుకు వచ్చి రైతులకు రూ.7600 నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇక స్వల్ప పరిమాణంలో అవసరమైన రైతులకు లీటర్‌కు రూ.500ల చొప్పున విక్రయిస్తుంటే అర లీటర్‌కు రూ.300 ధర నిర్ణయించి దొడ్డి దారిన విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

#### ఆంక్షలు కఠినతరం

రాష్ట్రంలో గ్లైఫోసెట్ విక్రయాలపై ఆంక్షలు కఠినతరం చేయడంతో పాటు ఈ మందు విక్రయిస్తున్న వ్యాపారులను జైలుకు పంపడంతో కొంత నియంత్రణలోకివచ్చిందని అనుకున్నారు. కాని, వ్యాపారులే రహస్య ప్రాంతాల్లో గోదాంలను ఏర్పాటు చేసుకుని ఖరీఫ్‌కు ముందుగానే భారీగా రైతులకు చేరవేసినట్లు తెలుస్తోంది. గుజరాత్ నుంచి మహారాష్ట్ర మీదుగా ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని.. కుమరం భీం అసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, వరంగల్ జిల్లాలకు దొడ్డి దారిన దిగుమతి చేసుకుని రహస్యంగా విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

### గ్లైఫోసెట్‌తో క్యాన్సర్ ముప్పు

కలుపు నివారణ కోసం ఉపయోగిస్తున్న గ్లైపోసెట్ మందు పర్యావరణానికి తీవ్ర ముప్పు కలగజేస్తోందని వ్యవసాయ నిపుణులు తేల్చారు. అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో అయిదేళ్ల క్రితమే ఈ మందును నిషేధించారు. మన పొరుగున ఉన్న శ్రీలంక 2015లోనే నిషేధించింది. అటు థాయ్‌లాండ్, వియత్నాం, లాటిన్ అమెరికా, ఆఫ్రికాల్లోని కొన్ని దేశాల్లో పాక్షిక నిషేధాన్ని అమలు చేస్తున్నారు. మన దేశంలో మాత్రం ఇప్పటికీ దీనిపై విధానపరమైన నిషేధం లేదు. ఈ రసాయనిక గాఢత వల్ల నేలలోని మైక్రో ఆర్గాన్స్ దెబ్బతింటాయని నిపుణులు చెబుతున్నారు. అంతే కాకుండా భూసారం దెబ్బతిని ఇతర ఆహార పంటలు, కూరగాయల పంటలు వేస్తే కలుషితమై క్యాన్సర్‌కు దారి తీస్తుందని చెబుతున్నారు. అంతే కాకుండా దీని అవశేషాల ప్రభావం మట్టిలో దీర్ఘకాలం ఉంటుందని అంటున్నారు. ఈ మందు విక్రయాలపై తెలంగాణలో నిషేధం ఉన్నప్పటికీ దొడ్డి దారిన రాష్ట్రానికి చేరుతోంది. దీని మూలాలు గుజరాత్, మహారాష్ట్రల్లో ఉండగా ఇక్కడి చీకటి వ్యాపారులు ఆయా కంపెనీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

---

# చార్మినార్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లకు డోర్నకల్ స్టేషన్‌లో హాల్టింగ్



డోర్నకల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చెన్నైలోని తాంబరం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే (12759) చార్మినార్ ఎక్స్‌ప్రెస్‌కు, లింగంపల్లి నుంచి కాకినాడ టౌన్‌కు వెళ్లే (12737/12738)ల మధ్య నడిచే గౌతమి ఎక్స్‌ప్రెస్‌లకు మంగళవారం నుంచి డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో డీఆర్‌యూసీసీ సభ్యులు ఖాదర్, లచ్చిరాంలు దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం గోపాలకృష్ణన్, సీనియర్ డీసీఎం షఫాలీలను కలిసి పలుమార్లు డోర్నకల్ రైల్వే జంక్షన్‌లో రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తి మేరకు డోర్నకల్‌లో చార్మినార్, గౌతమి ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా రైల్వే డీఆర్ఎం, డీసీలకు ఖాదర్, లచ్చిరాంలు కృతజ్ఞతలు తెలిపారు.

---

# కేయూ మేధో సంపత్తి గొప్పది

**కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి**

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ మేథో సంపత్తి, పేంటెంట్ హక్కులను పొందేలా కృషి చేయాలని కేయూ వీసీ ప్రొఫెసర్‌కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్) సమావేశంలో నోడల్ ఆఫీసర్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్కాలర్స్ సిద్ధాంత గ్రంథాలను పేటెంట్‌కు అర్హత సాధించేలా రూపొందిచాలని, ఆర్థిక విలువలుండాలని సూచించారు. ఆవిష్కరణ లను ఐపీఆర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సృజనాత్మక పరిశోధనలుండాలని చెప్పారు. వర్సిటీలు మంచి పరిశోధనలు చేయాలని కోరారు. రూ.50కోట్ల రుసా ప్రాజెక్టులు వచ్చాయని, కేహబ్‌లో కొత్త పేటెంట్లు సాధిస్తామని పేర్కొన్నారు. నోడల్ ఆఫీసర్ ప్రొఫసర్ ప్రసాద్ మాట్లాడుతూ.. రుసా ప్రాజెక్టులో 10 పేటెంట్లను తీసుకువచ్చే లక్ష్యంతో పనిచేస్తామని అన్నారు. హైదరాబాద్ ఐఐసీటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సంజిత్ కేఆర్‌పాల్ మాట్లాడుతూ.. మేధో సంపత్తి ప్రపంచాన్ని నడిపిస్తోందన్నారు.

ఐఐసీటీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ గుర్రాపు రాజు మాట్లాడుతూ.. పేటెంట్ దరఖాస్తు ప్రక్రియ, నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌లో వివరించారు. అధ్యాపకులు, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అకూట్ అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి, డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ బి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి



## బీసీలకు పరిపాలన పదవులను కేటాయించాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కేయూలో బీసీల జనాభా దామాషా మేరకు పరిపాలన పదవుల్లో బీసీలకు 56 శాతం పరిపాలన పదవులను కేటాయించాలని బీసీ అధ్యాపకుల సంఘం నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని తన చాంబర్‌లో బీసీ అధ్యాపకుల సంఘం నేతలు కలిశారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లలో కూడిన వినతి పత్రాన్ని అందచేవారు. తమకు 56 శాతం పరిపాలన పదవులు, సంఘానికి ఆఫీస్ రూమ్, బీసీ మండల్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే ఎంబీసీ, బీసీ సంచాల జాతుల విద్యార్థులకు హాస్టల్ వసతి ఇప్పించాలని పేర్కొన్నారు. దీనిపై వీసీ స్పందించి సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు డాక్టర్ గడ్డం కృష్ణయ్య, జనరల్ సెక్రటరీ ఎర్రబొజ్జు రమేశ్, సలహాదారులు డాక్టర్ తిరుణహరి శేషు, ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, జనరల్ సెక్రరటీ డాక్టర్ శ్రీధర్, సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందరాచారి, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి.నాగయ్య, డాక్టర్ శశిధర్,డాక్టర్ ఉషాకిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలిపొద్దు కాళోజీ నారాయణరావు అని, ప్రజల గొడవే తన గొడవగా జీవించిన మహనీయుడు కాళోజీ అనిమాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం హనుమకొండలోని దయాకర్ రావు నివాసంలో కాళోజీ జయంతిని పురస్కరించుకొని కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో కాళోజీ జయంతిని సెప్టెంబరు 9న తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి కాళోజీ అవార్డులు నెలకొల్పి, వరంగల్‌లో వైద్య, విశ్వ విద్యాలయానికి కాళోజీ నారాయణ రావు పేరు పెట్టడమే కాకుండా హనుమకొండలో కాళోజీ కళా క్షేత్రం నిర్మాణాన్ని చేపట్టినట్లు దయాకర్‌రావు తెలిపారు.

### ఆర్టీసీలో కాళోజీ జయంతి వేడుకలు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను పురస్కరించుకొని హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని రీజినల్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కాళోజీ చిత్రపటానికి వరంగల్ ఆర్‌ఎం డి.విజయభాను పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం భాను కిరణ్, అధికారులు ఎ.రవీందర్, సైదులు, రవీందర్‌సింగ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల బాధలే కాళోజీ గొడవ

ప్రజల బాధలే కాళోజీ గొడవ అని, కాళోజీ నారాయణరావు ధిక్కార స్వరమని మాజీ చీఫ్‌విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. మంగళవారం కాళోజీ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కాళోజీనారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ప్రజాకవి కాళోజీ నారాయణరావు రచనలు నేటి యువతకు మార్గదర్శకాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో కాళోజీ జయంతిని పురస్కరించుకొని కాళోజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్, డివిజన్ అధ్యక్షుడు వల్లెపు రమేష్, బంక సంపత్, జి. రవీందర్, పి.రమేష్, రాజు, శ్రీనివాస్, సంజయ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీలోని సీఎం నివాసంలో కాళోజీ జయంతి వేడుకల్లో సీఎంతో పాటు ఎంపీ కావ్య



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

### కాళోజీ జీవితం పేద ప్రజలకు అంకితం

వరంగల్ కార్పొరేషన్ : ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 111వ జయంతి వేడుకలు గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మేయర్ గుండు సుధారాణితో పాటు మునిసిపల్ వివిధ విభాగాల వింగ్ అధికారులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, అకౌంట్స్ అధికారి శివలింగం, జేఏవో సరిత, ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్‌తో పాటు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### అణిచివేతను ఎదురించిన మహాకవి

రాంనగర్: అణిచివేతను ఎదురించిన మహాకవి కాళోజీ అని టీజీఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డెరెక్టర్ వి.తిరుపతిరెడ్డి అన్నారు. కాళోజీ నారాయణరావు 111వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని కార్పొరెట్ కార్యాయలంలో కాళోజీ చిత్రపటానికి ఆపరేషన్ డైరెక్టర్‌తో పాటు డైరెక్టర్ ప్రభాకర్, మధుసూదన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బోనాల కిషన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఈలు సదర్‌లాల్, తిరుమల్‌రావు, వెంకటరమణ, రాజుచౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

### సీపీ నివాళులు

వరంగల్ క్రైం: ప్రజాకవి కాళోజీ 111వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, శ్రీనువాస్, ఏసీపీలు సురేంద్ర, నాగయ్య, డెవిడ్‌రాజు, ఆనంతయ్య, ఏఓ, ఆర్ఐలు పాల్గొన్నారు.

### పలువురి నివాళులు

హనుమకొండ కల్చరల్:హనుమకొండనక్కల గుట్టలోని కాళోజీ విగ్రహానికి కుడా మాజీ చైర్మన్, బీసీ ఉద్యమసంఘం నేత సుందర్‌రాజ్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఓబీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం భాస్కర్, ప్రొఫెసర్ పులి సారంగపాణి, రజనీకాంత్, రాజు, రామస్వామి గౌడ్ తదితర బీసీ ఉద్యమ నేతలు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకుల విశ్రాంత సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ పులి సారంగపాణి ఆధ్వర్యంలో కాళోజీకి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణరావు, జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి తదితర అధ్యాపక సంఘం నేతలు పాల్గొన్నారు. నగరంలోని మర్కజీ, జూలైవాడలోని ప్రభుత్వ పాఠశాలతోపాటు అనేక పాఠశాలల్లో కళాశాలల్లో కాళోజీ జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవాలను నిర్వహించుకున్నారు. జేబీ కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలను నిర్వహించారు. జేబీ కల్చరల్స్ ఆర్ట్స్ పక్షాన జడల శివ, హరితతోపాటు జనగామ రాము, ఆలేటి శ్యామ్ సుందర్, గాయత్రి, చందన, శివ, కన్నయ్య తదితర కళాకారులు కాళోజీ చిత్రపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని జానపద గిరిజన విజ్ఞానపీఠంలో కాళోజీ జయంతి వేడుకలు నిర్వహించారు. పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాళోజీపై డాక్యుమెంటరీ ఆయన స్వరంతో వినిపించిన నా గొడవ కవితలను తమ పీఠం ద్వారా రికార్డు చేయించడం శుభసూచకమన్నారు. అసిస్టెంట్ శ్రీమంతుల దామోదర్, అబ్బు గోపాల్‌రెడ్డి, నోముల రాజుతోపాటు డాక్టర్ గంపా సతీష్, డాక్టర్ బాసాని సురేశ్, రవికుమార్, సునీత, విజయలక్ష్మీ, సునంద తదితరులు పాల్గొన్నారు.

● హనుమకొండ (ఆంధ్రజ్యోతి): ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111 జయంతి సందర్భంగా మంగళవారం ఢిల్లీలోని సీఎం నివాసంలో జరిగిన జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డితో పాటు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● కేయూ క్యాంపస్: కాళోజీ నారాయణరావు ఆశయాలను సాధించాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ పరిపాలన భవనంలో కాళోజీ111 జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈసందర్భంగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. నిత్య చైతన్య దీప్తిగా కాళోజీ నారాయణరావు ఆలోచనలు, రచనలు ఎల్లప్పుడూ నిలుస్తాయని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు అన్నారు. మంగళవారం నక్కలగుట్టలోని కాళోజీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మేయర్, అధికారులు

## కాళోజీ పురస్కారం అందుకున్న రమాదేవి

మడికొండ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కారానికి ఎంపికైన రచయిత్రి నెల్లుట్ల రమాదేవికి హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో మంగళవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు అవార్డు ప్రదానం చేశారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, కవులు వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.




పురస్కారం అందుకుంటున్న రమాదేవి




అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

## నల్లా పన్నుల వసూళ్లపై దృష్టి సారించండి

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నల్లా పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. పన్నుల వసూళ్లపై అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. పేరుకు పోయిన నల్లా బకాయిల లక్ష్యం రూ.45కోట్లు ఉందని, ఏబీసీ కేటగిరీలుగా విభజించి పన్ను వసూళ్ల చేయాలన్నారు. భారీ బకాయిలు ఉన్న వారిని వార్డు అధికారుల ద్వారా గుర్తించి నోటీసులు జారీ చేయాలన్నారు. గత యేడాదికంటే ఈ యేడు 12శాతం అధికంగా పన్ను వసూలు చేయాలని హైదరాబాద్ సీడీఎంఏ నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్న 150 మంది జాబితా ముందస్తుగా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఆర్‌వోలు షహజాదీబేగం, శ్రీనివాస్‌లతో పాటు ఆర్ఐలు పాల్గొన్నారు.

## సీఎం రాజీనామా చేయాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అన్యాయం చేస్తున్న సీఎం రాజీనామా చేయాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం భీమారం ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయకుండా వారి జీవితాలతో సీఎం రేవంత్‌రెడ్డి చెలగాటమాడడం సరికాదన్నారు. ఇప్పటికైనా స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఏబీఎస్ఎఫ్ నాయకులు ఇప్ప భరత్, ఉదయ్, ప్రసాద్, శ్రీకాంత్, మధు, అశోక్, ఈశ్వర్, గోవింద్, రాజు, నందు, శ్రావణి, నవ్య, అఖిల, కళ్యాణి పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులనే గెలిపించాలి

హసన్‌పర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల స్థాయి సమావేశం మండల అధ్యక్షుడు మారం తిరుపతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానిక సంస్థల ఎన్నిక ప్రక్రియ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేస్తేనే స్థానిక సంస్థల్లో బీజేపీ భారీ మెజారిటీ వస్తుందన్నారు. అనంతరం మండల ప్రభారి బన్న ప్రభాకర్‌ను సన్మానించి ఆయన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, రాష్ట్ర కిసాన్ మోర్చ నాయకులు పెద్ది మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పిట్టల కుమారస్వామి, నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ సంస్థలతో కేయూ ఎంఓయూ

కేయూ క్యాంపస్ సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12 నుంచి 20 వరకు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అధికారిక పర్యటన చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ ఉన్నతాధికారులు వీసీ పర్యటన వివరాలను వెల్లడించారు. కేయూ ఫార్మసీ విభాగం గోల్డెన్ జూబ్లీ సంబురాల నేపథ్యంలో సెప్టెంబరు 12 నుంచి వరకు న్యూజెర్సీ, అట్లాంటాలో నిర్వహించే యూఎస్‌ఏ ఫార్మసీ చాప్టర్ సమ్మేళనంలో వీసీ ప్రతాప్‌రెడ్డి పాల్గొంటారు. కేయూలో మౌలిక సదుపాయాల కల్పన, అంతర్జాతీయ సహకారం బలోపేతం అయ్యేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు. టెక్సాస్‌లోని ఎఅండ్‌ఎం వర్సిటీతో ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాకాలజీ అండ్ న్యూరో థెరప్యూటిక్స్‌తో కేయూ ఎంఎ యూకు కృషి చేస్తోందని తెలిపారు. అమెరికా పర్యటన, ఎంఓయూలతో వర్సిటీలో విద్య, పరిశోధన రంగాల్లో అంతర్జాతీయ సహకరం లభిస్తోం దని పేర్కొన్నారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి

## ఏకశిల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి

హనుమకొండ టౌన్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ఏకశిల జూనియర్ కళాశాలలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే ఆలోచనతో పాటు ఆచరణ కూడా అవసరమన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని విద్యార్థులు నెరవేర్చాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో అన్ని రంగాల్లో ముందుకు వెళ్లే విధంగా ఏకశిల విద్యాసంస్థలు విద్యను అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ముచ్చ జితేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి, రాజిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## కేఎంసీకి పార్థివదేహం అప్పగింత

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అడ్వకేట్స్ కాలనీ సంతోష్‌నగర్‌కు చెందిన సముద్రాల ప్రమీల (84) మంగళవారం మృతి చెందారు. ఆమె కోరిక మేరకు వారి కుమార్తెలు అనిత, కవిత, కుమారుడు విజయ గోపాల్ పార్థివదేహాన్ని వైద్య విద్య నిమిత్తం మెడికల్ కాలేజీకి దానం చేసేందుకు అంగీకరించారు. తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అంబులెన్స్‌లో పార్థీవదేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి అప్పగించారు. అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ శశికాంత, అనాటమీ విద్యార్థులు, సిబ్బంది ప్రేమ్‌కుమార్, యాదగిరి, ప్రణయ్‌లు అనాటమీ విభాగానికి తరలించారు. ఈ కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అడ్వకేట్ తిరుమల, సునీత, రమాదేవి, లింగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షరాలు మునిగాల పద్మ, పరికిపండ్ల వేణు, ఎస్.సత్యనారాయణ, మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## దంత క్లినిక్‌లను తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నియమాలు ఉల్లంఘించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య తెలిపారు. జిల్లా దంత వైద్యుల సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం జీఎల్ఎస్ డెంటల్, ఇంప్లాంట్ సెంటర్లను తనిఖీ చేశారు. దంత క్లినిక్‌లలో అందిస్తున్న చికిత్స వివరాలను డీఎంహెచ్ఓ పరిశీలించి తగు సూచనలు చేశారు.

## ఐలమ్మ వర్ధంతిని విజయవంతం చేయాలి

వడ్డేపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చాకలి ఐలమ్మ వర్ధంతిని విజయవంతం చేయాలని చాకలి ఐలమ్మ ఫౌండేషన్ రాష్ట్ర చైర్మన్ రావుల సుదర్శన్ రజక సంఘాలకు పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండ 57వ డివిజన్ గోకుల్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని బుధవారం ఉదయం 10గంటలకు హనుమకొండ భద్రకాళి బండ్ ప్రాంతంలోని కాపువాడ వద్ద గల రజక సంఘం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చాకలి ఐలమ్మ కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సమావేశంలో చాకలి ఐలమ్మ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధులు కదారి కొమురయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేలో ప్రైవేటీకరణను అడ్డుకోవాలి

కాజీపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో ప్రైవేటీకరణను అడ్డుకోవాలి, కార్మికుల సంక్షేమమే మజ్దూర్ యూనియన్ ప్రధాన ధ్యేయమని మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ అన్నారు. కార్మికుల హక్కుల సాధనకోసం యూనియన్ నిరంతరం కృషిచేస్తుందని అన్నారు. కాజీపేటలో మంగళవారం ఆల్ బ్రాంచెస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షులు ఖాజా బాబా, సెక్రటరీ పి.రవీందర్‌లు హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ప్రత్యేక చొరవ తీసుకుని, సమస్యను పరిష్కరిస్తుందన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి యూనియన్ నాయకులు ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని, కార్మికుల సమస్యలు నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 19న సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

### అదనపు కమిషనర్‌కు వినతి

రైల్వే డీజిల్‌కాలనీలో ఆర్‌వోఆర్ ప్లాంట్ లేకపోవడంతో మిషన్ భగీరథ వాటర్ సరఫరా కావడంలేదని, రైల్వేకాలనీలో భగీరథ నీటిని సరఫరా చేయాలని కోరుతూ మంగళవారం మునిసిపల్ అదనపు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. తాగునీరు రాకపోవడంతో రైల్వే కార్మికులు పడుతున్న ఇబ్బందులను వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో రైల్వే కార్మిక నాయకులు జాని, వేదప్రకాశ్‌లు ఉన్నారు.

## బార్‌షాపు అనుమతి రద్దు చేసే వరకు పోరాటం

### వడ్డెపల్లిలో ధర్నా - నిలిచిన వాహనాలు

వడ్డెపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ చర్చి జంక్షన్‌లో బార్ షాపు అనుమతి రద్దు చేసే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని. వడ్డెపల్లి దళిత వెల్ఫేర్ కమిటీ (డబ్ల్యూడీడబ్ల్యూసీ) అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్, జైభీమ్ జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్ అన్నారు. వడ్డెపల్లి చర్చి సర్కిల్‌లో బార్ అండ్ రెస్టారెంట్ అనుమతిని వెంటనే రద్దు చేయాలని డబ్ల్యూడీడబ్ల్యూసీ, జైభీమ్‌తో పాటు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చర్చి జంక్షన్‌లో ధర్నా, రాస్తారోకో, నిరసన ప్రదర్శన చేశారు. దీంతో సుమారు కిలో మీటరు పొడవునా ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయాయి. సుమారు గంట వరకు నిర్వహించిన ధర్నాతో పలువురు వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. కాజీపేట ట్రాఫిక్ పోలీసులు, సుబేదారి పోలీసులు ధర్నా ప్రాంతానికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడినప్పటికీ వారు ససేమిరా అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వచ్చి బార్ షాపు అనుమతిని రద్దు చేయిస్తామని హామీ ఇస్తే తప్ప తాము ఆందోళనను విరమించేది లేదని భీష్మించుకొని రోడ్డుపైనే బైఠాయించారు. సుబేదారి సీఐ మేకల రంజిత్‌కుమార్ ఆందోళనకారులతో ఫోన్‌లో మాట్లాడారు. బార్ షాపు అండ్ రెస్టారెంట్ అనుమతి రద్దు విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమింపచేశారు. అనంతరం బార్ షాపు ఏర్పాటు చేసే భవనం ముందు సైతం కొద్ది సేపు నిరసన ప్రదర్శన చేశారు. ఈ ధర్నాలో తాళ్లపెల్లి పీటర్, నల్ల రమేష్, తాళ్లపెల్లి ప్రసన్న, ఇ. రాజు, సుదర్శన్, బోసు, పౌలు, టి. ప్రభాకర్, తాళ్లపెల్లి జయపాల్, జోషఫ్, బెనహర్, జైపాల్ (జార్జీ) పాల్గొన్నారు.




వడ్డెపల్లి చర్చి జంక్షన్‌లో ధర్నా చేస్తున్న దళిత ప్రజా సంఘాల నాయకులు

## సంత్ సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

వడ్డెపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సద్గురు సంత్ సేవాలాల్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్ పెంచాలనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సేవాలాల్ సేన జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బానోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని లేబర్ అడ్డా వద్ద సేవాలాల్ సేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా అధ్యక్షుడు భూక్య సిద్దూ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి సేవాలాల్ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. మైదాన ప్రాంతంలో 5ఐటీడీఏలను వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ధరావత్ సాంబయ్య నాయక్ రూపొందించిన 5 భాషల లిపీ బ్రోచర్‌ను కిషన్ నాయక్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంగోతు సుధాకర్, ఉద్యోగ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ వీరు నాయక్‌తో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు శంకర్, బోడ బాలు, భూక్య తిరుపతి, భ్యూక పరమేశ్, బానోత్ కిరణ్, నూనావత్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


## మద్యం మత్తులో ఆటోల చోరీ

### లబోదిబోమంటున్న ఆటో డ్రైవర్లు

హసన్‌పర్తి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలో కొంతకాలంగా మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆటోల దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దీంతో ఆటో డ్రైవర్లు లబోదిబోమంటున్నారు. హసన్‌పర్తికి చెందిన ఆ వ్యక్తి రాత్రివేళలో అతిగా మద్యం సేవించి డివిజన్ పరిధిలో ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఆటోలను తస్కరిస్తున్నట్లు బాధిత ఆటోడ్రైవర్లను ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యక్తి హసన్‌పర్తికి చెందిన ఆటో డ్రైవర్లు కొండమీది సంతోష్, రవితో పాటు పలువురి ఆటోలను తీసుకెళ్లి గుర్తు తెలియని చోట వదిలేస్తే బాధితులు వెతుక్కుని ఆటోలను తీసుకొచ్చినట్లు బెబుతున్నారు.

తాజాగా హసన్‌పర్తికి చెందిన పిట్టల కృష్ణ ఆటోను సోమవారం తెల్లవారుజామున 3.43 గంటలకు తస్కరించినట్లు సీసీ టీవీ ఫుటేజీ ద్వారా గుర్తించారు. ఈ విషయంపై బాధితుడు హసన్‌పర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ టీవీ ఫుటేజీలో వ్యక్తిని గుర్తించిన స్థానిక పోలీసులు మద్యం మత్తులో ఆటోను తస్కరించే వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్యాషన్



సాధారణ మహిళల నుంచి ప్రముఖుల వరకు 'బాంధని' డిజైన్ చీరలను ఇష్టపడని వారుండరు. పండుగలు, పార్టీలు, శుభకార్యాలు ఇలా అన్ని సందర్భాల్లో మహిళలు బాంధని చీరలను ధరించి మురిసిపోతుంటారు. ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం పొందిన డిజైన్లకు సరికొత్త హంగులద్ది నేటి ఫ్యాషన్‌కు అనుగుణంగా తీర్చిదిద్దిన రంగురంగుల చీరలను యువతులు విశేషంగా ఆదరిస్తున్నారు. ఇలా అన్ని వయసుల వారిని అలరిస్తున్న బాంధని డిజైన్లపై ఓ లుక్కేద్దామా...

# బహు చక్కని బాంధని

- 'బాంధని' అనేది ఓ సంప్రదాయ వస్త్ర కళ. ముందుగా ఓ సాదా చీర మీద దారాల సహాయంతో ముడులు చుడతారు. ఇలా ముడులతోనే రకరకాల డిజైన్లు రూపొందిస్తారు. తరువాత ఈ చీరని చక్కని రంగులో ముంచి ఆరబెడతారు. చీర పూర్తిగా ఆరిన తరువాత ముడులు విప్పేస్తారు. అంతే బాంధని డిజైన్ చీర రెడీ అయిపోతుంది. ఇలా టై అండ్ డై విధానంలో చుక్కలు, చదరాలు, పూలు, లతలు, అలల సమూహాలతో ఎన్నో విభిన్నమైన డిజైన్లను రూపొందిస్తున్నారు.

- కాటన్, సిల్క్, చందేరి, షిఫాన్, టస్సర్, ఆర్గంజా ఇలా ఎన్నో రకాల చీరల మీద బాంధని డిజైన్లను తీర్చి దిద్దుతున్నారు. వీటికి జర్దోసి, ఎంబ్రాయిడరీ, కుందన్, అద్దాలు, పూసల వర్క్‌లు జోడించి మరింత గ్రాండ్‌గా అందుబాటులోకి తెస్తున్నారు. వీటిని బొటిక్‌లు, షాపుల్లోనే కాదు ఆన్‌లైన్లో కూడా మహిళలు ఇష్టంగా కొనుగోలు చేస్తున్నారు. పలు నగరాల్లో బాంధని డిజైన్ చీరల కోసం ప్రత్యేకమైన షాపులు ఉండడం విశేషం.

- బాంధని డిజైన్లు... యువతులకు, మధ్య వయసు మహిళలకు చక్కగా నప్పుతాయి. కాలేజీలు, కార్యాలయాలకు వెళ్లేవారు రోజువారీ ధరించడానికి సాదా డిజైన్లను ఎంపిక చేసుకుంటే బాగుంటుంది. వివాహాది శుభకార్యాలకు గ్రాండ్ లుక్‌నిచ్చే బాంధని చీరలు కట్టుకుంటే అందంగా హుందాగా కనిపిస్తారు. ఈ చీరల మీద చక్కగా నగలు పెట్టుకోవచ్చు. విభిన్నమైన హెయిర్ స్టయిల్స్ ప్రయత్నించవచ్చు.



# అంచెలంచెలుగా ఎదిగి...

**భారత రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధానీ) చరిత్రలో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ఒక మహిళ ఎంపిక కావడం తొలిసారి కాగా... ఆమె తెలుగు మహిళ కావడం మరింత విశేషం.**

**ఎనిమిది ప్రభుత్వ రంగ సంస్థల నిపుణులతో పోటీ పడి ఆ స్థాయికి చేరిన మధుబాల కల్లూరి 32 ఏళ్లుగా మిధానీలో అంచలంచెలుగా ఎదిగారు. తన ఉద్యోగ ప్రయాణం గురించి, విద్య, వైద్యప రంగా తను నిర్వహిస్తున్న సేవల గురించి 'నవ్య'తో ఆమె ప్రత్యేకంగా పంచుకున్నారు.**



"మాది విజయవాడ. మా నాన్న అన్నే వెంకట్రావు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో గెజిటెడ్ ఆఫీసర్. పంచాయత్‌రాజ్ శాఖలో పనిచేశారు. అమ్మ సూర్యకుమారి గృహిణి. అప్పుడు ఉన్న పరిమిత వనరులతోనే వారు మాకు చదువు మీద శ్రద్ధ కలిగేలా చేశారు. మేము ముగ్గురం సోదరీమణులం. మా అక్క ఇస్రోలో సైంటిస్ట్ 'జి'గా పనిచేస్తుంటారు. ఇప్పటికీ ఆమె మాకు స్ఫూర్తి. మరో అక్క ఎంపీడీఓగా కంకిపాడులో చేస్తున్నారు.

### ఆడపిల్లకు చదువెందుకని అనుకోలేదు...

చాలామంది అంటుండేవారు... ఆడపిల్లలకు చదువులెందుకని! కానీ, మా నాన్న అవేవీ పట్టించుకోలేదు. ఆయన చదువుకు ప్రాధాన్యం ఇవ్వడంతో మేము తొలి నుంచి చదువులో ముందుండేవాళ్లం. ఆరవ తరగతిలో ఉన్నప్పుడు విజయవాడ నుంచి మచిలీపట్టణానికి నన్ను అమ్మానాన్నా ఒంటరిగా పంపేవారు. నాన్న ఆంగ్ల పత్రిక ఒకటి తీసుకువచ్చి చదవమనేవారు. పాఠశాల విద్యాభ్యాసం అంతా విజయవాడ చుట్టుపక్కలనే జరిగింది. కామర్స్‌లో డిగ్రీ మాత్రం నాగార్జున విశ్వవిద్యాలయంలో, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ ఆంధ్రా యూనివర్శిటీలో చేశా. అనంతరం ఐసీడబ్ల్యుఏఐ, సీఎంఏ కూడా చేశాను. మా అక్కలా నేనూ సైన్స్ చదవాలనుకున్నాను. అయితే... నాన్న ఉద్యోగరీత్యా వేరే ప్రాంతాల్లో ఉండడంతో... నేను హాస్టల్‌లో చేరాల్సి వచ్చింది. అక్కడ కాలేజీలో కామర్స్ బాగా బోధిస్తారని ఆ కోర్సులో చేరాను. డిగ్రీ అయ్యాక సీఏ చేయాలనుకున్నాను. అప్పుడు "ఐసీడబ్ల్యుఏఐ అయితే త్వరగా అయిపోతుంది. ఉద్యోగంలో చేరవచ్చు. మీ ప్రాంతంలో ఆడపిల్లలకు త్వరగా వివాహం చేస్తారు కదా... సీఏ అయితే మధ్యలో చదువు ఆగిపోయే ప్రమాదం ఉంది" అని విజయవాడలో మోడ్రన్ అకాడమీ ప్రిన్సిపాల్ పాపారావు సూచించారు. అలా ఐసీడబ్ల్యుఏఐలో చేరాను. ఆయన సలహాకు ఎప్పుడూ రుణపడి ఉంటాను.

### అదే విజేతగా నిలిపింది...

ఐసీడబ్ల్యుఏఐ పూర్తయ్యాక... బెంగళూరులో రెండేళ్ల పాటు ఒక కంపెనీలో మేనేజిమెంట్ ట్రైనీగా పని చేశాను. ఆ తరువాత 1993లో మిధానీలో చేరాను. వచ్చే డిసెంబర్‌కు మిధానీతో నా అనుబంధం 32 ఏళ్లు పూర్తిచేసుకోబోతోంది. పలు ప్రభుత్వ రంగ సంస్థల్లో అవకాశం వచ్చినా... హైదరాబాద్‌లో స్థిరపడాలనే ఉద్దేశంతో ఇక్కడే ఉండిపోయాను. ఇక్కడ అకౌంట్స్ ఆఫీసర్‌గా నా ప్రయాణం మొదలయింది. మాది చిన్న సంస్థ కావడం వల్ల నేను పెద్దగా ఇబ్బందులు ఎదుర్కోలేదు. అన్ని విభాగాల్లో ఏం జరుగుతోందో తెలుసుకోవడానికి, పలు అంశాల్లో కీలకమైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం కలిగింది. ఫైనాన్స్ విభాగంలో వివిధ హోదాల్లో పనిచేశాను. కాస్టింగ్, అకౌంట్స్, ఆడిట్, పేమెంట్స్, ట్యాక్సేషన్, ప్రాజెక్ట్ లాంటి విభాగాల్లో పనిచేయడం కెరీర్‌లో ఎదిగేందుకు ఎంతగానో తోడ్పడింది. ఈ ఏడాది జూలై 21న ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలను చేపట్టాను. ఈ పోస్ట్ కోసం ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఎనిమిది మంది ఫైనాన్స్ నిపుణులతో పోటీ పడ్డాను. అయితే... మిధానీలో ఫైనాన్స్‌పరంగా అన్ని విభాగాల్లో నాకు పట్టు ఉండడం, ప్రభుత్వ రంగ ఆర్థిక పరిపాలనపై నాకున్న రికార్డు ఈ రేసులో నన్ను విజేతగా నిలిపిందని భావిస్తున్నాను. సంస్థకు, ఉద్యోగులకు అవసరమైన విధానాల రూపకల్పనలో నేను కీలక పాత్ర పోషించాను. మిధానీలో ప్రతి అంశం నాకు తెలుసు. ఆ అనుభవం, ప్రతి అంశాన్నీ విశ్లేషణాత్మకంగా చూసే అలవాటు... ఇవి ఇంటర్వ్యూలో బాగా ఉపయోగపడ్డాయి.

> **కష్టే ఫలి...**
>
> సీఏ, సీఎంఏ లాంటి కోర్సులు చేస్తున్న చాలా మంది మధ్యలో ఆపేస్తున్నారు. ఆ కోర్సు పూర్తి చేయండి. 2, 3 ఏళ్లు కష్టపడితే మంచి ఉద్యోగం దొరుకుతుంది" అని నేను చెబుతాను. మహిళా ఉద్యోగులు ఇంటిని, ఆఫీసును బ్యాలెన్స్ చేసుకోవడం కోసం సమయాన్ని షెడ్యూల్ చేసుకోవాలి. ఇది తెలియని వారికి మేము కౌన్సెలింగ్ ఇస్తుంటాం. పరిష్కారాలు సూచిస్తూ ఉంటాం. అయితే కుటుంబ సభ్యుల సహకారం లేకుండా ఏదీ సాధ్యం కాదు. ఇక... అత్తమామలతో ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులు పిల్లలకు నేర్పాలి. అది లేకనే సమస్యలు వస్తున్నాయనేది నా భావన. కాగా... ఈ తరానికి పెద్ద సమస్య... చదివే అలవాటు లేకపోవడం. దీనివల్ల సబ్జెక్ట్ అప్‌డేట్ కావడం లేదు. తాజా సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకుంటే మనల్ని అధిగమించేవారు ఉండరు. కాబట్టి నిత్యం అధ్యయనం చేస్తూనే ఉండాలి.

### మహిళా ఉద్యోగులు పెరగడానికి దోహదం చేశా...

నేను పదేళ్ల నుంచి ఫైనాన్స్ విభాగం అధిపతిగా పని చేస్తున్నాను. నేను చేరినప్పుడు ఇక్కడ మహిళా ఉద్యోగుల సంఖ్య వేళ్ల మీద లెక్కించగలిగేలా ఉండేది. ఇప్పుడు మిధానీలో 10 శాతం మంది ఉద్యోగులు మహిళలు. వారిలో 30 మంది అధికారులు. వర్క్‌మెన్ క్యాడర్‌లో మహిళలు ఉన్నారు. ఫర్నేస్ దగ్గర కూడా పని చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి వివక్షా లేదు. 2011 నుంచి స్వతంత్ర డైరెక్టర్లలోనూ మహిళలు ఉన్నారు. ప్రస్తుతం కూడా బోర్డులో సగం మంది. అంటే ముగ్గురు మహిళా డైరెక్టర్లే. వారిలో నేనొకరిని కాగా... ఇద్దరు స్వతంత్ర డైరెక్టర్లు. ఇక మా ఉద్యోగుల్లో, కనీసం మా విభాగంలో మహిళల నియామకంలో, వారి శాతం పెరగడంలో నా పాత్ర ఉందని చెప్పగలను. అయితే మహిళ అని కాకుండా... వారి పనితీరు, అర్హతల ఆధారంగానే నియమిస్తాం. శ్రద్ధ, అంకితభావం ఎవరికైనా ముఖ్యం. మన పనితీరే మన గురించి చెప్పే ప్రమాణం అవుతుంది. మహిళలకు కూడా ఇదే వర్తిస్తుంది.

### ఆనందకరమైన బాధ్యత...

ఫైనాన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే బీపీడీఏవి స్కూల్ ఛైర్మన్‌గానూ వ్యవహరిస్తున్నాను. మిధానీ, బీడీఎల్ సంయుక్తంగా ఈ స్కూల్ నిర్వహిస్తున్నాయి. ఇది ప్రాజెక్ట్ స్కూల్. మిధానీలో అన్ని విభాగాలకు ఇది అదనపు బాధ్యత. అందరూ స్వచ్ఛందంగానే తోడ్పాటు అందిస్తారు. ఈ స్కూల్‌లో దాదాపు 2,100 మంది పిల్లలున్నారు. పాఠశాలకు సంబంధించి మౌలిక సదుపాయాలు, రోజువారీ సమస్యల గురించి సమావేశాలు జరుపుతాం. సమస్యలుంటే పరిష్కరిస్తుంటాం. మిధానీ ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్‌కు ఛైర్మన్‌గా మూడున్నర సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నాను. సమాజానికి కొంత మేర సహాయం చేసేందుకు ఇది తోడ్పడుతుంది. ఇక్కడ 10 రూపాయలతో రిజిస్టర్ చేసుకుంటే సరిపోతుంది. చికిత్స కార్పొరేట్ హాస్పిటల్ స్థాయిలో ఉంటుంది. సేవలు కూడా అతి తక్కువ ఖర్చుతో అందిస్తుంటాం. ఇది నాకు అదనపు బాధ్యతే కానీ... ఆనందకరమైన బాధ్యత. ఇవి కాకుండా పలు సీఎస్ఆర్ కార్యక్రమాలను పర్యవేక్షిస్తాను.

### వారి తోడ్పాటు అపూర్వం...

నేను ఇక్కడివరకూ వచ్చానంటే మా అమ్మనాన్నలతో పాటుగా అత్తమామలు కల్లూరి సుబ్బారావు, సుశీల సహాయ సహకారాలే కారణం. నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో మా అబ్బాయి ఆలనాపాలనా మా అత్తగారు చూసుకునేవారు. ఆమె మరణించాక మా మామగారి బాధ్యతను చూసుకున్నాను. మావారు, రవికిశోర్ కూడా నా ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతున్నారు. ఆయనకు ఎంతో విశ్లేషణా శక్తి ఉంది. అందుకే ఆయన సూచనలను తప్పకుండా పాటిస్తాను. నాకు ఖాళీ సమయం దొరకడం అరుదే. కాస్త సమయం చిక్కితే చారిటీకి సమయం కేటాయిస్తుంటాను. ఆదివారాలు కచ్చితంగా గార్డెనింగ్‌లో కొంత సమయం గడపడానికి ప్రయత్నిస్తాను. మొక్కల్ని చూస్తే అన్నీ మరచిపోతాను. ఒత్తిడి తగ్గించుకొని, ఆనందం పొందుతాను."

• పులగం గిరి

న్యూస్‌మేకర్

**ఉన్నత చదువు... ఐటీ కంపెనీలో అందుకు తగిన కొలువు... చేతి నిండా సంపాదన కాదనుకొని... చిత్ర పరిశ్రమ వైపు అడుగులు వేశారు. ఇంట్లోవాళ్లు వద్దన్నా... ఊరు కట్టుబాట్లు పేరు చెప్పినా... అవరోధాలను దాటి... ప్రతిష్ఠాత్మక 'వెనిస్ చిత్రోత్సవం'లో ఉత్తమ దర్శకురాలిగా అవార్డు అందుకున్నారు. పశ్చిమబెంగాల్‌లోని ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చి... అభిరుచికి పట్టం కట్టి... అంతర్జాతీయ వేదికపై మెరిసిన అనుపర్ణా రాయ్ అంతరంగం ఇది...**

# అంతర్జాతీయ వేదికపై మన అనుపర్ణ



"జీవితం ఎప్పుడూ మనకు సవాళ్లు విసురుతూనే ఉంటుంది. వాటిని అధిగమించి ముందుకు సాగితేనే అనుకున్నది దక్కుతుంది. ఇది అనుభవ పాఠం. పశ్చిమబెంగాల్ పురులియా జిల్లాలోని నారాయణపూర్ గ్రామం మాది. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం సాగింది. తరువాత అసన్‌సోల్‌లో ఇంగ్లీష్ లిటరేచర్ చేశాను. కాలేజీ రోజుల్లోనే నాకు సినిమాలపై ఆసక్తి కలిగింది. ఎప్పటికైనా సరే... దర్శకురాలినో, రచయితనో అవ్వాలని అనుకునేదాన్ని. కానీ ఎక్కడ మొదలుపెట్టాలి, పరిశ్రమలోకి ఎలా వెళ్లాలి అనేవాటిపై కనీస అవగాహన లేదు. అందరిలానే చదువు పూర్తవగానే ఉద్యోగంలో చేరాను. తొలుత ఢిల్లీలోని ఒక కాల్‌సెంటర్‌లో పని చేశాను. కొన్నాళ్ల తరువాత నా నివాసం ముంబయికి మార్చాను. సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం మొదలుపెట్టాను. మంచి జీతం. దేనికీ ఇబ్బందిలేదు. ముంబయి వెళ్లాలనుకోవడానికి మరో బలమైన కారణం కూడా ఉంది. అదే... సినిమా ప్రయత్నాలు. దాని కోసం అనుపమ్‌ఖేర్ ఫిలిమ్ ఇనిస్టిట్యూట్‌లో నటనలో శిక్షణ తీసుకున్నా. కొన్ని యాక్టింగ్ వర్క్‌షాపుల్లో కూడా పాల్గొన్నాను.

### అవరోధాలు అధిగమించి...

సినిమాల మీద ఇష్టంతో ఉద్యోగం వదిలేద్దామని అనుకున్నాను. విషయం అమ్మానాన్నకు చెప్పాను. కానీ వాళ్లు వద్దంటే వద్దన్నారు. అంతేకాదు... నేను సినిమాల్లోకి వెళితే ఊరు ఊరంతా కోపగిస్తుందని అన్నారు. సంప్రదాయాలు, సామాజిక కట్టుబాట్ల పేరుతో నన్ను నియంత్రించాలని చూశారు. అయినా నేను నా అభిప్రాయం మార్చుకోలేదు. అవరోధాలు దాటి ఎంచుకున్న లక్ష్యం వైపు నడవాలని నిర్ణయించుకున్నాను. కాదనలేక చివరకు ఇంట్లోవాళ్లు కూడా సరేనన్నారు.

### ఎన్నో సవాళ్లు...

2022లో ఉత్సాహంగా ముంబయి వెళ్లాను కానీ... ఎంతో కష్టపడాల్సివచ్చింది. కొత్త నగరం, కొత్త మనుషుల మధ్యలో కొత్త జీవితం. సరైన వనరులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. క్రమంగా అన్నిటినీ అర్థం చేసుకోవడం మొదలుపెట్టాను. అజాద్‌నగర్‌లోని ఒక అపార్టుమెంటులో అద్దెకు ఉండేదాన్ని. అక్కడే 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్' చిత్రానికి సంబంధించి స్క్రిప్ట్ సిద్ధం చేసుకున్నాను. అదృష్టం ఏంటంటే... నాకు మంచి టీమ్ లభించింది. అందరం కలిసి వండుకోవడం, తినడం, షూటింగ్ చేయడం... ప్రతి క్షణం ఎంతో ఆస్వాదించాం. మధుర జ్ఞాపకాలు ఎన్నిటినో పదిలపరుచుకున్నాం. మా కష్టం ఫలించింది. ఇటీవల ముగిసిన 'వెనిస్ చిత్రోత్సవం' ఒరిజోంటీ విభాగంలో ఉత్తమ దర్శకురాలిగా నాకు అవార్డు దక్కింది. తొలి సినిమాకే అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది.

### భావోద్వేగ క్షణాలు...

ఇటలీలోని వెనిస్ నగరంలో అడుగుపెట్టగానే ఏదో తెలియని అనుభూతి కలిగింది. నేను రచించి, దర్శకత్వం వహించిన 'సాంగ్స్ ఆఫ్ ఫర్‌గాటెన్ ట్రీస్'ను థియేటర్‌లో ప్రదర్శించారు. మొదటిసారి వేదిక మీదకు వెళ్లాను. భావోద్వేగంతో నా కళ్లు చెమర్చాయి. ఆహూతులందరూ లేచి నిల్చుని, దాదాపు ఏడు నిమిషాలు చప్పట్లతో అభినందించారు. వేదికపైనున్న మా టీమ్ సభ్యులందరిపై మొబైల్ ఫ్లాష్‌లైట్స్ వేసి, వెలుగులు అద్దారు. నా జీవితంలోనే అత్యద్భుత సమయం అది. తీయని జ్ఞాపకంగా ఎప్పటికీ మిగిలిపోతుంది. మన సినిమా ఎప్పుడూ ఇలాగే ప్రకాశించాలని కోరుకొంటున్నాను.

### ఇది ఒక గెలుపు మాత్రమే కాదు...

ఇప్పుడు నన్ను చూసి మా ఊరు గొప్పగా చెప్పుకొంటుందని ఆశిస్తున్నా. ఇది ఒక గెలుపు మాత్రమే కాదు... అనేక అడ్డంకులను అధిగమించి సాధించిన గొప్ప విజయం. పాయల్ కపాడియా, కిరణ్‌రావు, జోయా అక్తర్, రీమా దాస్, మీరా నాయర్ వంటి మహిళా దర్శకులు నాకు ఆదర్శం. వాళ్లే లేకపోతే ఇవాళ నేను ఇక్కడ ఉండేదాన్నికాదు. ఈ చిత్రానికి మద్దతుగా నిలిచిన దర్శకుడు అనురాగ్ కశ్యప్, ఇందులో నటించిన నాజ్ షేక్, సుమీ బఘేల్, ఇతర టీమ్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుకొంటున్నాను. అందుకే ఈ అవార్డును ఇద్దరు అద్భుతమైన నటులతో పాటు, ఇన్నాళ్లుగా నాతో కలిసి ప్రయాణించిన ప్రతిఒక్కరికీ అంకితం ఇస్తున్నా. ఇన్నేళ్ల కష్టాన్ని ఈ అవార్డు మరిపించింది. ఈ అద్భుతమైన సందర్భాన్ని ఎంతో ఆస్వాదిస్తున్నా.

## మిక్సీ గిన్నెలు శుభ్రం ఇలా...

మిక్సీ గిన్నెలకు ఉండే బ్లేడ్స్ కింద రకరకాల ఆహారపదార్థాలు ఇరుక్కుంటూ ఉంటాయి. వీటిని సరిగా శుభ్రం చేయకుండా గిన్నెలను వాడుతూ ఉంటే పలు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వాటిని సులభంగా ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం...

- మిక్సీ గిన్నెను ఉపయోగించిన తరువాత అందులో కొన్ని వేడి నీళ్లు, కొద్దిగా డిష్ వాష్ లిక్విడ్ వేసి బాగా కలపాలి. పది నిమిషాల తరువాత చేత్తో రుద్ది కడగాలి. ఆపైన గిన్నెలోని బ్లేడ్స్‌ను జాగ్రత్తగా తీసి వాటితో పాటు గిన్నె మధ్య భాగాన్ని పాత టూత్‌బ్రష్ లేదా స్పాంజ్‌తో రుద్ది కడగాలి. తడి పూర్తిగా ఆరిన తరువాతే గిన్నెకు బ్లేడ్స్‌ను అమర్చాలి.
- మిక్సీ గిన్నె మూతకు ఉండే రబ్బర్ గ్యాస్కెట్‌ను బయటకు తీయాలి. బ్రష్ లేదా స్పాంజ్‌ను డిష్ వాషింగ్ లిక్విడ్‌లో ముంచి దానితో గ్యాస్కెట్‌ను, మూత అంచులను రుద్ది కడగాలి. గ్యాస్కెట్ పూర్తిగా ఆరిన తరువాతే మూతకు పెట్టాలి.



## పిల్లలకు మాటలు త్వరగా రావాలంటే...

సాధారణంగా ఏడాది వయసు రాగానే పిల్లలు ఏదో ఒకటి మాట్లాడడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. కానీ కొంతమంది పిల్లలు మాత్రం రెండేళ్లు నిండినా మాట్లాడలేకపోవడం మనం చూస్తూ ఉంటాం. అలాకాకుండా పిల్లలు త్వరగా మాట్లాడాలంటే తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

- చిన్న పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. చిన్న చిన్న మాటలతో ముఖంలో హావ భావాలు పలికిస్తుంటే పిల్లలు అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు. పిల్లలకు ఏ అంశాన్నైనా సులభంగా గ్రహించే శక్తి ఉంటుంది. కాబట్టి ప్రతి సందర్భాన్ని తమదైన శైలిలో వివరిస్తుంటే పిల్లలు మాట్లాడడం నేర్చుకుంటారు.
- నెలల పిల్లలకు ఆటబొమ్మలు ఇచ్చి ఆడిస్తూ ఉండాలి. ఆ బొమ్మల గురించి పలు అంశాలు చెబుతూ ఉంటే పిల్లలు కన్నార్పకుండా చూస్తూ వింటూ ఉంటారు. బొమ్మల మీద కంటే ఏం మాట్లాడుతున్నారు? అనే దాని మీద పిల్లలు ఎక్కువగా దృష్టి పెడతారు. అలా పిల్లల్లో వినికిడి శక్తి, గ్రహించే సామర్థ్యం పెరుగుతాయి. క్రమంగా వచ్చీరాని మాటలు మాట్లాడడం ప్రారంభిస్తారు.



- చాలామంది పిల్లలు పాటలు లేదా కథలు వింటూ నిద్రపోతుంటారు. అలా రోజూ ఎన్నో మాటలు వింటూ ఉండడం వల్ల వారిలో ఆలోచన శక్తి పెరుగుతుంది. విన్న మాటలను తిరిగి పలికే ప్రయత్నం చేస్తారు. పిల్లలతో ఎంత ఎక్కువగా మాట్లాడితే అంత త్వరగా వాళ్లకి మాట్లాడడం వస్తుంది.
- ఇంట్లో కుటుంబ సభ్యులంతా ఒకరినొకరు పిలుచుకుంటూ అనేక రకాల భావాలు ప్రదర్శిస్తూ మాట్లాడుకుంటూ ఉంటే పిల్లలు గమనిస్తుంటారు. పెద్దల భావాలు అర్థమయినప్పుడల్లా మాట్లాడేందుకు ప్రయత్నిస్తుంటారు.
- పిల్లలు పెద్దవుతున్న కొద్దీ వచ్చీరాని పదాలు పలుకుతుంటారు. అలాంటప్పుడు స్పష్టంగా ఉచ్చరించే విధానాన్ని చెబుతూ ఉండాలి. అప్పుడే పిల్లలకు సరిగా మాట్లాడడం అలవడుతుంది.
- పిల్లలకు ఇష్టమైన ఆట బొమ్మలు, ఆహార పదార్థాలను వాళ్లకి అందకుండా పెడుతూ ఉండాలి. అప్పుడు పిల్లలు అవి కావాలని అడగడానికి ప్రయత్నిస్తూ సైగలు చేస్తూ ఉంటారు. ఈ సందర్భాలను ఉపయోగించుకుంటూ పిల్లలకు కావాల్సిన దాన్ని అడగడం నేర్పిస్తే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

## డ్రాగన్ ఫ్రూట్ ఉపయోగాలెన్నో!

గులాబీ రంగులో ఆకర్షణీయంగా, చూడగానే తినేయాలనిపించేలా ఉంటుంది డ్రాగన్ ఫ్రూట్. ఈ పండులో అనేక పోషకాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఆ వివరాల గురించి తెలుసుకుందాం...



- డ్రాగన్ ఫ్రూట్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వలన జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపుబ్బరం వంటివి తగ్గుతాయి.
- ఈ పండులో ఐరన్ కూడా ఎక్కువ మొత్తంలో ఉంటుంది. అది ఎర్రరక్తకణాల ఉత్పత్తిని పెంచి రక్తహీనతను దూరం చేస్తుంది.
- ఇందులోని విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అలాగే కొల్లాజన్ ఉత్పత్తిని పెంచి అందాన్ని కాపాడుతుంది.
- దీనిలోని మెగ్నీషియం, క్యాల్షియంలు ఎముకల దృఢత్వానికి దోహదం చేస్తాయి.
- డ్రాగన్ ఫ్రూట్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్‌తో పోరాడతాయి.
- ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. .
- ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ యాసిడ్, ఆస్కార్బిస్ యాసిడ్‌లు రక్తంలో చక్కెరస్థాయులను నియంత్రించడంలో సహాయపడతాయి.


ప్రహరీని కూల్చిన కొండారెడ్డిపల్లి గ్రామంలోని సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు

## సీఎం రేవంత్ ఇంటి ప్రహరీ కూల్చివేత

**» కొండారెడ్డిపల్లిలో చురుగ్గా రహదారి పనులు**

వంగూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత గ్రామం నాగర్‌కర్నూలు జిల్లా కొండారెడ్డిపల్లిలో నాలుగు వరుసల రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి ప్రహరీని కూడా తొలగించారు. హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిపై గల కొండారెడ్డిపల్లి గేటు నుంచి కొండారెడ్డిపల్లి గ్రామం వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు చేపట్టారు. 3.9 కిలోమీటర్లు ఉన్న ఈ రహదారి నిర్మాణ పనులను రూ. 21 కోట్లతో 2024 సెప్టెంబరులో ప్రారంభించారు. ఒప్పందం ప్రకారం ఈ నెల చివరి నాటికి పనులు పూర్తికావాలి. గ్రామం బయట బీటీ రోడ్డు వేశారు. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. వచ్చే నెల 2న దసరా పండుగకు సీఎం రేవంత్ కొండారెడ్డిపల్లికి వస్తుండడంతో ఈ నెలాఖరుకల్లా పనులు పూర్తిచేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈమేరకు ఈ నెల 6న గ్రామానికి వచ్చిన కలెక్టర్ బదావత్ సంతోష్ అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష జరిపారు. దసరా నాటికి పనులు పూర్తికావాలని సూచించారు.

## జీఎస్టీ సవరణతో రాష్ట్రాలకు ప్రయోజనమే

**» తెలంగాణకు రూ.8000 కోట్ల లాభం**

**» ఎస్‌బీఐ 'ఎకోరాప్' నివేదిక వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సవరణతో రాష్ట్రాలకు నికరంగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన 'ఎకోరాప్' నివేదిక చెబుతోంది. జీఎస్టీ రేట్ల తగ్గింపుతో లాభమా?, నష్టమా? అనే విషయంపై అన్ని రాష్ట్రాలు ఆందోళన చెందుతున్న వేళ.. ఎస్‌బీఐ కీలక విషయాలు వెల్లడించింది. మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో.. ప్రస్తుతం అమలులో ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో, 12, 28శాతం విభాగాలు తొలగించి, 5,18 శ్లాబులను మాత్రమే ఉంచుతూ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే, జీఎస్టీ రేట్ల సవరణ ద్వారా తెలంగాణకు రూ.7 వేల కోట్ల మేర నష్టం వాటిల్లనుందని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. కానీ.. ఈ నష్టం రూ.10 వేల కోట్ల వరకు ఉండొచ్చని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అంచనా వేస్తోంది. ఎస్‌బీఐ మాత్రం రాష్ట్రాలకు ఎలాంటి నష్టం వాటిల్లదని, పైగా... నగదు రూపంలో మరింత ప్రయోజనం పొందుతాయని విశ్లేషిస్తోంది. సాధారణంగా మొత్తం జీఎస్టీ వసూళ్లలో కేంద్రానికి 50 శాతం, రాష్ట్రాలకు 50 శాతం నిధులు సమకూరుతాయి. ఇలా రాష్ట్రాలకు సమకూరే 50 శాతం జీఎస్టీలో రాష్ట్రాల నిధులు గతంలో కంటే పెరుగుతాయని ఎస్‌బీఐ అంచనా వేసింది. జీఎస్టీ హేతుబద్ధీకరణతో ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రాలకు రూ 14.10లక్షల కోట్లు అందనున్నాయని తెలిపింది. ఇందులో తెలంగాణకు రూ.8 వేల కోట్ల ప్రయోజనం చేకూరనుందని నివేదిక పేర్కొంది.

# క్విడ్ ప్రో కో!

(మొదటి పేజీ తరువాయి)

నిందితులపై ఛార్జిషీటు దాఖలు చేయడంతో పాటు అవసరమైతే అరెస్టుల వరకూ కూడా వెళ్లే అవకాశాలున్నాయి. మరోవైపు ఈ కేసు విచారణపై స్టే ఇవ్వాలంటూ నిందితులు సుప్రీంకోర్టుకు వెళ్లినా....ఉన్నత న్యాయస్థానం దీనిలో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. ఈ తరుణంలో విచారణ ప్రారంభమైన 9 నెలల అనంతరం ఈ కేసులో తదుపరి కీలక అడుగు పడింది. దర్యాప్తు పూర్తి అయినందున ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిపై ప్రాసిక్యూషన్ చర్యలకు అనుమతి కోరింది. ప్రాసిక్యూషన్ చర్యలకు గవర్నర్ అనుమతి లభిస్తే తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా అరెస్టు లేదా నేరుగా కోర్టులో చార్జిషీటు దాఖలు చేయడానికి ఏసీబీ సన్నద్ధమైనట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు పలుమార్లు గంటల తరబడి విచారించారు. చివరిసారి జరిపిన విచారణ అనంతరం కేటీఆర్ సెల్‌ఫోన్లు, ట్యాబ్ స్వాధీనం చేయాలని ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఫోన్ ఇవ్వడానికి అభ్యంతరం చెపుతూ కేటీఆర్ ఏసీబీకి లేఖ రాశారు. తర్వాత న్యాయ పరమైన సలహా తీసుకున్న ఏసీబీ అధికారులు ప్రాసిక్యూషన్ చర్యలకు సన్నద్ధమయ్యారు.

### రేసు జరగకుండానే డబ్బులు చెల్లింపు

గత ఏడాది డిసెంబరు 19న ఏసీబీ కేటీఆర్ తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ముందు గవర్నర్ అనుమతి కోరింది. డిసెంబరు 16న గవర్నర్ అందుకు అనుమతించారు. ఆపై ఏసీబీ అధికారులు ఫిర్యాదుదారుడైన దానకిశోర్ వాంగ్మూలాన్ని డిసెంబరు 18న రికార్డు చేశారు. వెంటనే డిసెంబరు 19న అధికార దుర్వినియోగానికి సంబంధించి కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్‌రెడ్డి, మరో రెండు సంస్థలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2023లో హైదరాబాద్‌లో జరిగిన ఫార్ములా ఈ కారు రేసు వ్యవహారంలో నాటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘించి హెచ్ఎండీఏ నిధుల నుంచి రూ.45 కోట్లను ఎఫ్ఈఓకు పంపించారని, అందులోనూ విదేశీ కరెన్సీలో డబ్బు చెల్లింపులు జరిగాయని, ఇందుకు ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదని, విదేశీ కరెన్సీ చెల్లింపులు ద్వారా దాదాపు ఏడు కోట్ల రూపాయలను ఐటీకి హెచ్ఎండీఏ చెల్లించాల్సి వచ్చిందని ఏసీబీ అధికారులు తెలిపారు. హెచ్ఎండీఏ, ఫార్ములా ఈ కారు రేసు కంపెనీ, ఎస్ నెక్స్ట్‌జన్ మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం రేసు నిర్వహించాల్సి ఉండగా, ఫార్ములా ఈ కారు రేసు రెండో దశ జరగకుండానే డబ్బు చెల్లింపులు జరిగాయని ఏసీబీ అధికారులు విచారణలో గుర్తించారు. కేటీఆర్ తదితరులపై ఏసీబీ కేసు నమోదు చేసిన మరునాడే ఈడీ అధికారులు రంగంలో దిగి ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఫెమా నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్‌రెడ్డి రెడ్డి తదితరులను ఈడీ, ఏసీబీ అధికారులు పలు మార్లు విచారించారు.

### సుప్రీంలో కేటీఆర్ పిటిషన్ తిరస్కరణ

ఏసీబీ ఎఫ్ఐఆర్‌ను కొట్టేయాలంటూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ ఆయనకు ఊరట లభించలేదు. కేవలం అరెస్టు చేయకుండా మధ్యంతర ఆదేశాలు మాత్రం లభించాయి. ఈ క్రమంలో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఏసీబీ ఎఫ్ఐఆర్ కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఆ పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసులో విచారణ అవసరమని, పిటిషన్‌ను ఉపసంహిస్తున్నట్లుగా పరిగణిస్తూ కొట్టేస్తున్నామని ఈ ఏడాది సెప్టెంబరు 2న ప్రకటించింది. సుప్రీంకోర్టు కేటీఆర్ పిటిషన్‌ను తిరస్కరించిన వెంటనే ఏసీబీ అధికారులు చకచకా పావులు కదిపారు. ఇప్పటి వరకు సేకరించిన సాంకేతిక ఆధారాలను క్రోడీకరించి ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ప్రభుత్వానికి లేఖ పంపించారు.

## ఊరూరా కాళోజీ సాహిత్యాన్ని పంచుతాం: మంత్రి

**» తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంత్యుత్సవాలు**

**» రచయిత్రి నెల్లుట్ల రమాదేవికి అవార్డు ప్రదానం**


నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్ /హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా వైతాళికుడు కాళోజీ ఔన్నత్యం నేటితరం తెలుసుకోవాలని, ఆ మహనీయుడి సాహిత్యం ప్రతి గ్రామానికి చేరేలా కృషి చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. సామాజిక మార్పు లక్ష్యంగా సాహిత్య సృజన చేసే కవులు, రచయితలను ప్రోత్సహించే బాధ్యతను సాంస్కృతిక శాఖ స్వీకరించేందుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రజా కవి కాళోజీ 111వ జయంత్యుత్సవాలు మంగళవారం రవీంద్ర భారతిలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రతిష్ఠాత్మక కాళోజీ పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవికి మంత్రి కృష్ణారావు ప్రదానం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సమాజ గొడవను తన గొడవగా మలచుకొని 'నా గొడవ' అంటూ అద్భుతమైన కవిత్వాన్ని మనకు అందించారని కొనియాడారు. 'అన్యాయాన్ని ఎదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు' అంటూ శక్తిమంతమైన కవిత్వాన్ని భావితరాలకు కాళోజీ అందించారని తెలిపారు. అలాంటి మహానుభావుడి జయంతి సభలో యువత కనిపించకపోవడం బాధాకరమన్నారు. కాళోజీ పురస్కారాన్ని మొదటి సారిగా మహిళకు ప్రదానం చేయడం సంతోషకరమైన విషయమని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రియాజ్, కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి, పొట్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాళోజీతో తనకున్న అనుబంధాన్ని అవార్డు స్వీకర్త నెల్లుట్ల రమాదేవి గుర్తు చేసుకున్నారు. నిజాయితీ, నిర్భీతి, అన్యాయం చేసిన వాడు ఎంతటి వ్యక్తి అయినా నిలదీసే శక్తి కాళోజీ సొంతమని, తెలంగాణ భాషాభివృద్ధికి మరింత కృషి జరగాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

### బీసీ కమిషన్ కార్యాలయంలో 'కాళోజీ' కి ఘనంగా నివాళులు

నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన కాళోజీ నారాయణ రావు గొప్ప కవి, ప్రజల పక్షపాతి అని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. బీసీ కమిషన్ కార్యాలయంలో జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. కాళోజీ ప్రజా కవి మాత్రమే కాదని, శాసన మండలి సభ్యులుగా సేవలందించారని గుర్తు చేశారు. ఆయన రాసిన 'నా గొడవ' ఎంతో ప్రాచుర్యం పొందిందన్నారు.

## పిల్లల అక్రమ రవాణాకు వారే ఊతం!

**» చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలకు వైద్యులు, ఆర్ఎంపీలు, ఆశా వర్కర్లతో లింకులు**

**» ఇతర రాష్ట్రాల నుంచి చిన్నారులను తీసుకొచ్చి ఇక్కడ పిల్లలు లేని దంపతులకు విక్రయాలు**

**» వరుస ఘటనలతో ఆందోళన**

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల అక్రమ రవాణా, విక్రయాల (చైల్డ్ ట్రాఫికింగ్) ముఠాల్లో రాష్ట్రంలోని కొందరు వైద్యులు, ఆర్ఎంపీలు, ఆశ వర్కర్లు కీలకంగా మారుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలిసి ఉండటం, విస్తృత పరిచయాలు, పిల్లలు లేని దంపతులు వారి వద్దకు వస్తుండటం వంటివి దీనికి ఊతమిస్తున్నాయి. ఇటీవల వెలుగులోకి వచ్చిన సృష్టి సంతాన సాఫల్య కేంద్రం మోసం కేసు సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. వైద్యురాలు నమ్రత సరోగసి పేరిట 80 మంది శిశువుల అక్రమ రవాణాకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. దీనితోడు ఇటీవల మరికొన్ని చోట్ల చిన్నారుల అక్రమ రవాణా, విక్రయం ఘటనలు బయటికి వచ్చాయి. ఇందులో చాలా వరకు క్లినిక్‌ల వైద్యులు, ఆర్ఎంపీలు, ఆశా వర్కర్లకు భాగస్వామ్యం ఉండటం ఆందోళన రేపుతోంది. కొద్దిరోజుల క్రితం రంగారెడ్డి జిల్లా మేడిపల్లిలో ఓ ఆర్ఎంపీ వైద్యుడు.. ఇతర ప్రాంతాల నుంచి చిన్నారులను కొనుగోలు చేసి, ఇక్కడ పిల్లలు లేని దంపతులకు విక్రయించినట్లు గుర్తించి, అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో క్లినిక్ నడుపుతున్న ఓ సిద్దిపేట నర్సు ఇటీవల చిన్నారుల అక్రమ రవాణా, విక్రయానికి పాల్పడుతూ పట్టుబడింది. హైదరాబాద్‌లోని చైతన్యపురికి చెందిన ఒక ఆశా వర్కర్.. చైల్డ్ మాఫియాతో కలసి పనిచేస్తోందని, పిల్లలు లేని దంపతులను గుర్తించి, విక్రయాలకు పాల్పడుతోందని తేల్చారు. అడ్డదారిలో డబ్బు సంపాదన కోసం ఇలాంటి అక్రమ దందాలకు తెరతీస్తున్నట్లు గుర్తించారు.


## క్లీన్, గ్రీన్ ఎనర్జీ కోసం రెండు నోడల్ ఏజెన్సీలు

**» జెన్‌కో, రెడ్‌కోలను నియమిస్తూ సర్కారు ఉత్తర్వు**

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 అమలు కోసం రాష్ట్రంలో రెండు నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ జీవో 40 జారీ చేశారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, మినీ అండ్ మైక్రో హైడల్, జియో థర్మల్, పాత రెన్యూవబుల్ ప్రాజెక్టులతో కలిపి స్టోరేజ్ కేంద్రాలు పెట్టాలంటే తెలంగాణ జెన్‌కో నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఇక సోలార్, పవన, బయోమాస్, బయోగ్యాస్, చెరకు పిప్పి, బయో ఫ్యూయల్స్ ఆర్‌ఈ హైబ్రిడ్(సోలార్, పవన, ఫ్లోటింగ్ సోలార్), ఎలక్ట్రిక్ ఛార్జింగ్ కేంద్రాలు/బ్యాటరీ మార్పిడి సౌకర్యాలు, గ్రీన్ హైడ్రోజన్ వంటి ప్రాజెక్టులకు తెలంగాణ రెడ్‌కో నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. ఆయా ప్రాజెక్టుల కోసం నోడల్ ఏజెన్సీలను సంప్రదించాల్సి ఉంటుంది.

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

## కీలక సన్నివేశాల చిత్రీకరణ



సాయి దుర్గాతేజ్ కథానాయకుడిగా రోహిత్ కేపీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్స్ బేనర్‌పై కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం కీలక షెడ్యూల్‌లోకి ప్రవేశించింది. పీటర్ హెయిన్ కొరియోగ్రఫీ చేసిన అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్న ఓ బాలీవుడ్ స్టార్‌తో సాయి దుర్గాతేజ్ తలపడతారు. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన సీజీఐ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. సినిమాను తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయనున్నారు.



## ఒకే తెరపై మీ ఇద్దరూ.. అద్భుతం!

**అల్లు అర్జున్**

మంచు లక్ష్మి ప్రధాన పాత్రధారిగా వంశీకృష్ణ మల్లా తెరకెక్కిస్తున్న చిత్రం 'దక్ష'. 'ద డెడ్లీ కాన్సిరసీ' అనేది ఉపశీర్షిక. మోహన్‌బాబు, సముద్రఖని, సిద్ధిక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ మంచు ఎంటర్టైన్‌మెంట్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ నెల 19న చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా అల్లు అర్జున్ చిత్రం ట్రైలర్‌ను సోషల్‌మీడియా వేదికగా విడుదల చేశారు. 'నా మిత్రురాలు, ఆప్తురాలైన లక్ష్మీ మంచుకు శుభాకాంక్షలు. మీరు, మోహన్‌బాబు గారు ఒకే తెరపై కనిపించడం అద్భుతంగా అనిపిస్తోంది. చిత్రం ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా' అని పేర్కొన్నారు.

## 'మిరాయ్'ను కుటుంబంతో చూడాలి

'ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో 'మిరాయ్' సినిమాపై ఆసక్తి పెరిగింది. తప్పకుండా ఈ సినిమాను చూడాలనే కుతూహలాన్ని వారికి కలిగించింది. తద్వారా 'మిరాయ్' చిత్రానికి అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి విడుదలకు ముందే చక్కని స్పందన వచ్చింది. ప్రేక్షకులు వారి కుటుంబంతో కలసి 'మిరాయ్'ను చూడాలనేది మా కోరిక. అందుకే టికెట్ ధరలను పెంచడం లేదు' అని నిర్మాత, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ అన్నారు. తేజ సజ్జా కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ 'మిరాయ్' విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



- నిర్మాణ వ్యయం గురించి ఆలోచించకుండా, నేను చాలా లోతుగా ఇన్‌వాల్వ్ అయి చేసిన సినిమా ఇది. మార్కెట్ లెక్కలు వేసుకోకుండా మా బేనర్ నుంచి ఒక ఎక్స్‌ట్రార్డినరీ సినిమా ఇవ్వాలని ఈ చిత్రాన్ని నిర్మించాం. మిరాయ్ ఒక అద్భుతమైన ఫాంటసీ అడ్వెంచర్.
- చరిత్రకు కాల్పనికతను జోడించిన కథ ఇది. అశోకుడు తొమ్మిది పుస్తకాల్లో తన జ్ఞానాన్ని నిక్షిప్తం చేయడం, వాటి సంరక్షణను యోధులకు అప్పగించడం, అందులో ఒక పుస్తకం రక్షణ కోసం హీరో, విలన్ మధ్య ఎలాంటి పోరాటం జరిగిందనే అంశం చుట్టూ కథ నడుస్తుంది. అలాగే తల్లి సంకల్పంతో ముడిపడిన కథ ఇది. ఈ సినిమాలో లొకేషన్లు, గ్రాఫిక్స్ ఆడియన్స్‌కి కొత్త అనుభూతిని ఇస్తాయి.
- ఈ సినిమా కోసం తేజ చాలా కష్టపడ్డాడు. యాక్షన్ కోసం థాయ్‌లాండ్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అలాగే మనోజ్ ప్రతి నాయకుడిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారు.
- ప్రభాస్ 'రాజాసాబ్' చిత్రాన్ని జనవరి 9న విడుదల చేస్తున్నాం. కాంతార 2 చిత్రంతో కలిపి ట్రైలర్‌ను, ప్రభాస్ పుట్టిన రోజున ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం.

## అవన్నీ వదంతులే

**- కాజల్ అగర్వాల్**



'నేను ప్రమాదానికి గురైనట్లు సామాజిక మాధ్యమాల్లో నిరాధారమైన వార్తలు చూశాను. ఇక లేనని కూడా ప్రచారం చేశారు. అవన్నీ వదంతులే. వాటిని చూసి ఎంతో నవ్వుకున్నాను' అని పేర్కొన్నారు కథానాయిక కాజల్ అగర్వాల్. ఆమె ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో పోరాడుతోందని కొన్ని సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ వార్తలపై అభిమానులను ఉద్దేశిస్తూ కాజల్ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'దేవుని దయవల్ల నేను క్షేమంగా, సురక్షితంగా ఉన్నాను. ఇలాంటి తప్పుడు వార్తలు నమ్మొద్దని, ప్రచారం చెయ్యొద్దని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను' అని పేర్కొన్నారు. కాజల్ అగర్వాల్ ప్రస్తుతం 'రామాయణ' సినిమాలో నటిస్తున్నారు.

## ప్రేమానుభూతితో సాగే పాట



యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం నటిస్తోన్న కొత్త సినిమా 'కె-ర్యాంప్'. యుక్తి తరేజా కథానాయిక. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా అక్టోబరు 18న విడుదలవుతోంది. మంగళవారం ఈ చిత్రం నుంచి 'కలలే కలలే కనులకు నువ్వు కనబడి కలలే...' అంటూ ప్రేమానుభూతితో సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. భాస్కరభట్ల రాసిన ఈ గీతానికి చైతన్య భరద్వాజ్ స్వరాలు సమకూర్చగా కపిల్ కపిలన్ ఆలపించారు.



## ఇంత విషం ఇప్పించండి


**● కన్నడ హీరో దర్శన్ కంటతడి**



'వెలుగును చూసి 30 రోజులు అయింది. జైలులో ఉండలేకపోతున్నాను. నాకు ఇంత విషం ఇప్పించండి' అని కన్నడ హీరో దర్శన్ న్యాయమూర్తిని అభ్యర్థించారు. చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో ఆయన నిందితుడు. పరప్పన అగ్రహార జైలులో ఉన్న ఆయనను బెంగళూరు 57వ సీసీహెచ్ కోర్టు ఎదుట మంగళవారం వర్చువల్‌గా హాజరుపరిచారు. పరప్పన అగ్రహార జైలు నుంచి దర్శన్‌ను బళ్లారి జైలుకు పంపే పిటిషన్‌పై కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. వర్చువల్‌గా హాజరైన దర్శన్.. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని చెయ్యి ఎత్తారు. దీంతో న్యాయాధికారి ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఆ సమయంలో ఉద్వేగానికి లోనైన దర్శన్, వెలుగును చూసి 30 రోజులైందని, చేతులకు ఫంగస్ వచ్చిందని వివరించారు. ఇతర నిందితులతో నిమిత్తం లేదని, తనకు మాత్రం కొంచెం విషం ఇప్పించాలని కోరారు. అలాంటి మాటలు మాట్లాడవద్దని, సౌలభ్యాలు, సమస్యల గురించి మాత్రమే చెప్పాలని న్యాయాధికారి దర్శన్‌కు సూచించారు. అనంతరం పిటిషన్ విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దర్శన్‌ను బెంగళూరు జైలులోనే ఉంచాలని, అవసరమైన పరుపు, తలగడ సమకూర్చాలని, జైలులో అటూ ఇటూ తిరిగేందుకు అవకాశం కల్పించాలని న్యాయాధికారి ఆదేశించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

## విలక్షణమైన కథలతో వస్తున్నాం



'ప్రస్తుతం మా 'భీమవరం టాకీస్' పతాకంపై పలు చిత్రాలు నిర్మిస్తున్నాం. అందులో 'యండమూరి కథలు', 'కెపీహెచ్‌బీ కాలనీలో', 'మా నాన్న హీరో', 'మహానాగ' తదితర చిత్రాల రెగ్యులర్ షూటింగ్ మొదలైంది' అని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు. తమ నిర్మాణ సంస్థలో రూపొందుతున్న కొత్త సినిమాల వివరాలను ఆయన మీడియాతో పంచుకున్నారు. 'మా బేనర్‌పై వరుస చిత్రాలు చేస్తున్నాం. త్వరలో ప్రముఖ దర్శకుడితో భారీ బడ్జెట్‌తో ఓ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. మరికొన్ని చిత్రాలు పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా విలక్షణమైన కథలతో కామెడీ, సోషల్, డ్రామా, హారర్.. ఇలా విభిన్న జానర్లలో ఈ చిత్రాలు ఉంటాయి' అని చెప్పారు.

# బంగారం భగ్గు



## సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయికి ధర

- ఢిల్లీలో 10 గ్రాములు రూ.1,12,750కి చేరిక
- ఒక్కరోజే రూ.5,080 పెరుగుదల
- ఈ ఏడాదిలో రూ.33,800 అప్

న్యూఢిల్లీ: పసిడి చుక్కలనంటుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ దీని ధర సరికొత్త శిఖరాలకు దూసుకెళ్లింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మంగళవారం రూ.5,080 పెరిగి సరికొత్త జీవితకాల రికార్డు స్థాయి రూ.1,12,750కి ఎగబాకింది. ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు గోల్డ్ రేటు రూ.33,800 (దాదాపు 43 శాతం) పెరిగింది. గత ఏడాది డిసెంబరు 31న ఢిల్లీలో 10 గ్రాముల పసిడి రేటు రూ.78,950గా నమోదైంది. వెండిదీ గోల్డెన్ ట్రెండే.. కిలో రేటు రూ.2,800 పెరుగుదలతో రూ.1,28,800కు చేరింది. ఇంటర్నేషనల్ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ మరో 16.81 డాలర్లు ఎగబాకి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి 3,659.27 డాలర్లకు పెరిగింది. సిల్వర్ 41.50 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. గత నెలలో అమెరికా కార్మిక శాఖ విడుదల చేసిన ఆగస్టు ఉద్యోగ నియామకాల గణాంకాలు బలహీనంగా ఉండటంతో పాటు గతంలో విడుదల చేసిన మే, జూన్ గణాంకాలను సైతం దిగువకు సవరించడంతో వచ్చేవారం ఫెడ్ రేట్లు మరింత తగ్గించవచ్చన్న అంచనాలు ఊపందుకున్నాయి. ఇది బులియన్ ర్యాలీకి ప్రధాన కారణం. తాజా ఉద్యోగ గణాంకాలు అమెరికా ఆర్థిక పరిస్థితిపైనా కొత్త సందేహాలు లేవనెత్తుతున్నాయి. ట్రంప్ టారి‌ఫ్‌లతో అంతర్జాతీయంగా వాణిజ్య అవరోధాలు కూడా పెరిగాయి. దాంతో ఇన్వెస్టర్లు ఆర్థిక అనిశ్చితుల్లో భద్రత కల్పించే బంగారంలోకి తమ పెట్టుబడులను మళ్లిస్తున్నారని బులియన్ విశ్లేషకులు పేర్కొన్నారు.

### ఏడాది చివరినాటికి 4,000 డాలర్లకు?

ఔన్స్ పసిడి ఈ వారంలోనే 3,700 డాలర్లకు ఎగబాకవచ్చన్న అంచనాలున్నాయి. మాంద్యం ముప్పును ఎదుర్కొంటున్న అమెరికా ఆర్థిక వ్యవస్థకు మద్దతిచ్చేందుకు అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను వేగంగా తగ్గించాల్సి వస్తే, ఈ ఏడాది చివరినాటికి ఔన్స్ బంగారం 4,000 డాలర్లు దాటే అవకాశాల్లేకపోలేవని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఏడాదికాలంలో వెండి రూ. 1.50 లక్షలు

వచ్చే ఏడాది కాలంలో కిలో వెండి ధర రూ.1.50 లక్షలకు చేరుకోవచ్చని, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) సిల్వర్ 50 డాలర్లకు ఎగబాకనుందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక అంచనా వేసింది. పారిశ్రామిక రంగంలో వెండి వినియోగం గణనీయంగా పెరుగుతుండటం, బలహీనపడుతున్న డాలర్, మరింత తగ్గనున్న ఫెడ్ రేట్లు, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు అన్నీ వెరసి ఈ విలువ లోహం ధరలను ఎగదోయనున్నాయని రిపోర్టు పేర్కొంది. మోతీలాల్ ఓస్వాల్ భావిస్తోంది. మల్టీకమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సిల్వర్ ధర ఈ ఏడాదిలో ఇప్పటివరకు 37 శాతం పెరిగింది.

## ఎన్ఎస్ఈ చైర్మన్‌గా ఇంజేటి శ్రీనివాస్



న్యూఢిల్లీ: ఒడిశా కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి, ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్ఎస్‌సీఏ) మాజీ వ్యవస్థాపక చైర్మన్ ఇంజేటి శ్రీనివాస్.. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) చైర్మన్‌గా నియమితులయ్యారు. మంగళవారం నుంచే ఈ నియామకం అమల్లోకి వచ్చింది. గత రెండేళ్లుగా ఎన్ఎస్ఈకి సారథి లేరు. తొలి పబ్లిక్ ఇష్యూకి (ఐపీఓ) ఎక్స్ఛేంజీ సిద్ధం అవుతున్న సమయంలో తెలుగు మూలాలున్న శ్రీనివాస్ నియామకం జరిగింది. ఆయన ఇటీవల ఎన్ఎస్ఈలో పబ్లిక్ ఇంటరెస్ట్ డైరెక్టర్‌గా చేరారు. గతంలో ఆయన కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా కూడా పని చేశారు. కార్పొరేట్, ఆర్థిక నియంత్రణలు, పారిశ్రామిక ప్రోత్సాహం, కార్పొరేట్, దివాలా చట్టం, కాంపిటీషన్ చట్టం, చార్టెడ్ అకౌంటెన్సీ, కాస్ట్ అకౌంటెన్సీ వంటి భిన్న రంగాల్లో ఆయనకు నాలుగు దశాబ్దాలకు పైబడిన అనుభవం ఉంది. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ నుంచి బీఏ (హానర్స్) పూర్తి చేసిన శ్రీనివాస్ 1983లో ఒడిశా కేడర్ అధికారిగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.

## ఐఫోన్ 17 వచ్చేసిందోచ్..

- నాలుగు వేరియంట్లలో లభ్యం
- ప్రారంభ ధర రూ.82,900
- గరిష్ఠ రేటు రూ.1,49,900



కుపర్టినో(కాలిఫోర్నియా): అమెరిక్ టెక్నాలజీ దిగ్గజం యాపిల్ ఐఫోన్ 17 సిరీస్‌ను మంగళవారం ప్రపంచానికి పరిచయం చేసింది. కాలిఫోర్నియా, కపర్టినోలోని యాపిల్ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కంపెనీ సీఈఓ టిమ్ కుక్ ఈ ఫోన్లను ఆవిష్కరించారు. మొత్తం నాలుగు వేరియంట్లలో (17, 17 ఎయిర్, 17 ప్రో, 17 ప్రో మ్యాక్స్) లభ్యం కానున్నాయి. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చి, సుంకాల మోత మోగిస్తున్న తరుణంలో కంపెనీ ప్రపంచ మార్కెట్లోకి విడుదల చేస్తున్న కొత్త ఐఫోన్ సిరీస్ ఇదే. ఇందులో ఐఫోన్ 17, 17 ఎయిర్ బుకింగ్ ఈనెల 12 నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 19 నుంచి స్టోర్లలోకి అందుబాటులోకి వస్తాయి. 17 ప్రో, ప్రో మ్యాక్స్ మోడళ్లు కూడా 19 నుంచి స్టోర్లలో లభ్యమవుతాయని సంస్థ తెలిపింది. యాపిల్ కొత్త ఐఫోన్‌తోపాటు యాపిల్ వాచ్ 11 సిరీస్‌ను, ఎయిర్‌పాడ్స్ 5, ఎయిర్‌పాడ్ ప్రో 3ను సైతం లాంచ్ చేసింది. వీటిని తక్షణమే బుక్ చేసుకోవచ్చు. ఈనెల 19 నుంచి మార్కెట్లోకి అందుబాటులోకి వస్తాయి.

**ఎయిర్‌పాడ్ ప్రో 3:** ప్రపంచంలో అత్యుత్తమ నాయిస్ క్యాన్సిలేషన్ సాంకేతికతతోపాటు లైవ్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్‌తో కూడిన ఎయిర్ పాడ్ ప్రో 3 ధర 249 డాలర్లు.

**యాపిల్ వాచ్ సిరీస్ 11:** బిల్ట్ ఇన్ 5జీ కనెక్టివిటీ, హైపర్ టెన్షన్ అలర్ట్స్(రక్తపోటు హెచ్చరికలు), స్లీప్ స్కోర్ వంటి కొత్త ఫీచర్లతో కూడిన యాపిల్ వాచ్ 11 సిరీస్ ధర 399 డాలర్లు. 24 గంటల బ్యాటరీ లైఫ్‌ను అందిస్తున్నట్లు సంస్థ తెలిపింది. యాపిల్ వాచ్ ఎస్ఈ 3, అల్ట్రా 3 మోడళ్లను కూడా ప్రవేశపెట్టింది సంస్థ. ఎస్10 ప్రాసెసర్‌తో కూడిన ఎస్ఈ 3 వాచ్ నిరంత డిస్‌ప్లే, స్లీప్ స్కోర్, వర్కవుట్ బడ్డీ, టెంపరేచర్ సెన్సింగ్ వంటి ఫీచర్లను కలిగి ఉంది. దీని ధర 249 డాలర్లు. శాటిలైట్ కనెక్టివిటీతో కూడిన అల్ట్రా 3 ధర 799 డాలర్లుగా ఉంది.

| | స్క్రీన్ సైజు అంగుళాలు | ప్రారంభ ధర డాలర్లు | రూ. |
|---|---|---|---|
| ఐఫోన్ 17 | 6.3 | 799 | 82,900 |
| ఐఫోన్ 17 ఎయిర్ | 6.5 | 999 | 1,19,900 |
| ఐఫోన్ 17 ప్రో | 6.3 | 1,099 | 1,34,900 |
| ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్ | 6.9 | 1,199 | 1,49,900 |

## ఒరాకిల్ నుంచి 100 మందికి పైగా ఔట్!

న్యూఢిల్లీ: టెక్ కంపెనీల్లో ఉద్యోగాల కోత కొనసాగుతోంది. ఉద్యోగులు ఎక్కువగా ఇష్టపడే ఒరాకిల్‌లోనూ ఈ కోతల పర్వం ప్రారంభమైంది. కంపెనీ భారత్‌లోని తన యూనిట్ల నుంచి వంద మందికి పైగా ఉద్యోగులను ఇంటికి పంపించినట్లు సమాచారం. ఏఐ ప్రభావంతో పాటు ఖర్చులు తగ్గించుకోవాలన్న వ్యూహం ఇందుకు ప్రధాన కారణమని ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్స్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తొలగించిన ఉద్యోగులకు వారు కంపెనీలో పని చేసిన ప్రతి సంవత్సరానికి 15 రోజుల జీతంతో పాటు ఏడాది పాటు ఇన్సూరెన్స్ కవరేజీ కల్పించినట్లు సమాచారం. ఒరాకిల్ ఇటీవలే ప్రపంచవ్యాప్తంగా దాదాపు 3,000 మందిని ఇంటికి పంపించింది. భారత్‌లోని ఒరాకిల్ యూనిట్లలో దాదాపు 30,000 మంది పని చేస్తున్నారు.

## మళ్లీ 81,000 పైకి సెన్సెక్స్

ముంబై: అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను మరింత తగ్గించనుందన్న అంచనాలతో పాటు ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లతో స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల్లో పయనించాయి. సెన్సెక్స్ 314.02 పాయింట్ల లాభంతో 81,101.32 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 95.45 పాయింట్ల వృద్ధితో 24,868.60 వద్ద ముగిసింది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఐదో రోజు. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 19 రాణించాయి. సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్)పై గురువారం నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో ఇన్ఫోసిస్ షేరు 5.03 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 3 పైసలు తగ్గి రూ.88.12 వద్ద ముగిసింది.

## బయోలాజికల్-ఈ, ఐఐఎల్‌కు మలేరియా వ్యాక్సిన్ లైసెన్సు

న్యూఢిల్లీ: బహుళ దశల్లో వినియోగించే మలేరియా వ్యాక్సిన్ యాడ్‌ఫాల్సివ్యాక్స్ తయారీ లైసెన్సును భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) ఐదు కంపెనీలకు అందించింది. ఈ లైసెన్సు పొందిన కంపెనీల్లో హైదరాబాద్‌కు చెందిన బయోలాజికల్-ఈ (బీఈ),ఇండియన్ ఇమ్యూనోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) సహా టెక్ ఇన్వెన్షన్ లైఫ్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, పనేషియా బయోటెక్, జైడస్ లైఫ్ సైన్సెస్ ఉన్నాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2025లో ఈ విషయం ప్రకటించారు. రోగుల్లో ప్రాణాంతకమైన ప్లాస్మోడియం ఫాల్సిపారం ఇన్ఫెక్షన్‌ను అదుపు చేసి సమాజంలోని ఇతరులకు మలేరియా వ్యాపించకుండా ఉపయోగపడే ఈ వ్యాక్సిన్‌ను ఐసీఎంఆర్ పర్యవేక్షణలో భువనేశ్వర్‌కు చెందిన రీజినల్ మెడికల్ రీసెర్చ్ సెంటర్ (ఆర్ఎంఆర్‌సీ) అభివృద్ధి చేసింది. కాగా ఈ వ్యాక్సిన్ తయారీకి అర్హత గల కంపెనీల నుంచి ఆసక్తి వ్యక్తీకరణలను ఐసీఎంఆర్ గత జూలైలో ఆహ్వానించింది. ఈ వ్యాక్సిన్ అందుబాటు ధరల్లో లభించడంతో పాటు గది ఉష్ణోగ్రతలో 9 నెలల పాటు సమర్థవంతంగా నిలవగలుగుతుంది.

## టీవీఎస్ అపాచీ @ 20 ఏళ్లు

- మార్కెట్లోకి కొత్త మోడళ్ల విడుదల



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ మోటార్ కంపెనీ పోర్టుఫోలియోలో అత్యంత ప్రజాదరణ పొందిన అపాచీ మోటార్‌సైకిల్ మార్కెట్లోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్, సీఈఓ కేఎన్ రాధాకృష్ణన్ మార్కెట్లోకి లిమిటెడ్ ఎడిషన్ అపాచీ ఆర్‌టీఆర్ శ్రేణి మోటార్ సైకిళ్లను విడుదల చేశారు. 2005లో అపాచీ మార్కెట్లోకి విడుదల చేసినప్పటి నుంచి వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని రాధాకృష్ణన్ తెలిపారు. దాదాపు 80కి పైగా దేశాల్లో 65 లక్షల మంది వినియోగదారులకు అపాచీ అత్యంత నమ్మకమైన బ్రాండ్‌గా ఉందన్నారు. అపాచీ 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160, 180, 200, ఆర్‌టీఆర్ 310, ఆర్ఆర్ 310 లిమిటెడ్ ఎడిషన్స్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. అలాగే సరికొత్త ఆర్‌టీఆర్ 160 4వీ, ఆర్‌టీఆర్ 200 4వీ వేరియంట్స్‌ను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ లిమిటెడ్ ఎడిషన్స్ ధరలు రూ.1,37,990 నుంచి రూ.3,37,000 మధ్యన ఉండగా ఆర్‌టీఆర్ 4వీ వేరియంట్స్ ధరలు రూ.1,28,490 నుంచి రూ.1,59,990 మధ్యన ఉన్నాయి.

## హైదరాబాద్‌లో నెమెచెక్ జీసీసీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, నిర్మాణ, ఆపరేషన్స్ (ఏఈసీ/ఓ) రంగానికి సేవలందిస్తున్న జర్మనీ కంపెనీ నెమెచెక్ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను (జీసీసీ) ఏర్పాటు చేసింది. ఆధునిక జీవనంలో బహుళ అంతస్తుల భవనాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో భవన సమాచార నిర్వహణ (బీఐఎం) వ్యవస్థ ప్రాధాన్యత పెరిగిందని; ఆయా సంస్థలకు తాము బీఐఎం సాఫ్ట్‌వేర్ అందిస్తామని నెమెచెక్ గ్రూప్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సునీల్ పండిత తెలిపారు. నిర్మాణ రంగంలో ప్రపంచంలోనే మూడో పెద్ద మార్కెట్ అయిన భారత్‌లో తమ సేవలు విస్తరించడం లక్ష్యమని కంపెనీ సీఎఫ్ఓ లూయిస్.ఓ వెల్లడించారు.

## సులభంగా పీఎస్‌యూల డీలిస్టింగ్

న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయిన ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ)షేర్ల డీలిస్టింగ్‌ను సెబీ సులభతరం చేసింది. అయితే ప్రభుత్వానికి 90 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటా ఉన్న పీఎస్‌యూలకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేసింది. ఇందుకోసం నిర్ణయించే కనీస ధరను పబ్లిక్ షేర్‌హోల్డర్స్‌లో మూడింట రెండు వంతుల మంది ఆమోదించాలన్న నిబంధనలను సెబీ సవరించింది. అయితే వాటాదారులకు చెల్లించే ధర, కనీస ధర కంటే కనీసం 15 శాతమైనా ఎక్కువ ఉండాలని స్పష్టం చేసింది. ఈ డీలిస్టింగ్ నిబంధనలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, బీమా కంపెనీలకు వర్తించవని సెబీ స్పష్టం చేసింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| 10వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 535 | విజయవాడ | 550 |
| వరంగల్ | 537 | గోదావరి | 545 |
| చిత్తూరు | 563 | విశాఖపట్నం | 555 |
| | | దజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 118 | విజయవాడ | 137 |
| వరంగల్ | 118 | గుంటూరు | 127 |
| కరీంనగర్ | 118 | ఒంగోలు | 127 |
| మహబూబ్‌నగర్ | 118 | చిత్తూరు | 108 |
| కర్నూలు | 118 | నెల్లూరు | 113 |
| విశాఖపట్నం | 141 | అనంతపురం | 113 |
| గోదావరి | 137 | | |

### బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



| | 24 క్యారెట్లు | 22 క్యారెట్లు | కేజీ వెండి |
|---|---|---|---|
| హైదరాబాద్ | 1,10,290 ▲ | 1,01,100 ▲ | 1,39,000 ▲ |
| విజయవాడ | 1,12,800 ▲ | 1,06,500 ▲ | 1,28,000 ▲ |
| విశాఖపట్నం | 1,12,870 ▲ | 99,850 ▲ | 1,40,000 ▲ |
| రాజమండ్రి | 1,10,290 ▲ | 1,01,100 ▲ | 1,28,900 ▲ |
| ప్రొద్దుటూరు | 1,13,600 ▲ | 1,04,500 ▲ | 1,28,800 ▲ |
| ముంబై | 1,09,475 ▲ | 1,00,279 ▲ | 1,24,770 ▲ |

# స్పోర్ట్స్



ట్రోఫీతో జట్ల కెప్టెన్లు

# ఆల్‌రౌండర్లే బలంగా..

**బరిలోకి టీమిండియా**
**నేడు యూఏఈతో పోరు**
**రాత్రి 8 గంటల నుంచి సోనీ నెట్‌వర్క్‌లో**

**దుబాయ్:** టీ20 వరల్డ్‌కప్ చాంపియన్ టీమిండియా.. ఇప్పుడు ఆసియా కప్‌పై కన్నేసింది. బుధవారం యూఏఈ జట్టుతో జరిగే తమ తొలి మ్యాచ్ ద్వారా టైటిల్ వేటను ఆరంభించబోతోంది. ఇప్పటికే 8సార్లు విజేతగా నిలిచిన భారత్ ఈసారి కూడా ఫేవరెట్‌గానే పోటీపడుతోంది. అలాగే ఆదివారం పాకిస్థాన్‌తో జరుగబోయే సమరానికి యూఏఈతో మ్యాచ్‌ను రిహార్సల్‌గా భావిస్తోంది. అయితే, భారత తుది జట్టు కూర్పు ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రధాన కోచ్‌గా గంభీర్ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి జట్టులో ఆల్‌రౌండర్ల ప్రాధాన్యత ఎక్కువగా కనిపిస్తోంది. పేస్, స్పిన్ ఆల్‌రౌండర్లను బరిలోకి దించేందుకు అతను ఇష్టపడుతున్నాడు. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లోనూ ఇదే సూత్రాన్ని అనుసరించి సుందర్‌కు అవకాశమిచ్చాడు. ఎనిమిదో నెంబర్ వరకు బ్యాటింగ్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని గంభీర్ భావిస్తుంటాడు. ఇప్పుడు ఆల్‌రౌండర్ విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్‌లకు జతగా శివమ్ దూబేను కూడా ఆడించే ఆలోచనలో ఉన్నాడు. దూబే స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొని వేగంగా పరుగులు సాధించగలడు. అప్పుడు కుల్దీప్ యాదవ్ బెంచ్‌కే పరిమితం కాక తప్పదు. స్పిన్‌లో వరుణ్ చక్రవర్తి, అక్షర్‌కు తోడు అభిషేక్‌తో ఓవర్లు వేయించే అవకాశం ఉంది. ఇక కీపర్‌గా సంజూ శాంసన్‌ను పక్కనబెట్టి జితేశ్ శర్మను ఆడించడం ఖాయమే. నెట్ సెషన్స్‌లోనూ జితేశ్ ఎక్కువగా ప్రాక్టీస్ చేయడం దీనికి ఊతమిస్తోంది. గిల్ జట్టులో చేరడంతో ఓపెనర్‌గా శాంసన్ స్థానం గల్లంతైంది. అతడిని మూడో నెంబర్‌లో ఆడించాలని చూసినా అక్కడ తిలక్ వర్మ నిలకడగా రాణిస్తున్నాడు. జితేశ్‌ను ఏడు, అక్షర్‌ను ఎనిమిదో స్థానంలో బరిలోకి దించవచ్చు. మిడిలార్డర్‌లో తిలక్, కెప్టెన్ సూర్య, హార్దిక్ కీలకం కానున్నారు. బౌలింగ్‌లో బుమ్రా, అర్ష్‌దీప్ ప్రధాన పేసర్లుగా ఉంటారు.

**యూఏఈ పోటీ ఇచ్చేనా..?**

యూఏఈ జట్టుకిది భారీ మ్యాచ్‌గానే చెప్పవచ్చు. స్టార్ బౌలర్ బుమ్రాను ఎదుర్కోవడమే కాకుండా.. గిల్, సూర్య లాంటి బ్యాటర్లకు బౌలింగ్ చేయడం అసోసియేట్ సభ్యదేశానికి అరుదుగా లభించే అవకాశం. కెప్టెన్ మహ్మద్ వసీమ్, రాహుల్ చోప్రా, సిమ్రన్‌జీత్ సింగ్‌లపై జట్టు ఎక్కువగా ఆధారపడింది. ఏదేమైనా భారత్‌కు గట్టి పోటీనిచ్చేందుకు ప్రయత్నిస్తామని కోచ్ లాల్‌చంద్ రాజ్‌పుత్ అన్నాడు.

**తుది జట్లు (అంచనా)**

**భారత్:** గిల్, అభిషేక్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), జితేశ్, హార్దిక్, శివమ్ దూబే, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, వరుణ్.

**యూఏఈ:** వసీమ్ (కెప్టెన్), షరాఫు, రాహుల్, ఆసిఫ్, ఫరూఖ్, హర్షిత్, సిమ్రన్‌జీత్, జవదుల్లా, హైదర్, సిద్దిఖీ, రోహిద్.

**పిచ్**

గత మార్చిలో భారత్ ఇక్కడ చాంపియన్స్ ట్రోఫీ ఆడిన సమయంలో నలుగురు స్పిన్నర్లతో బరిలోకి దిగింది. కానీ ప్రస్తుతం దుబాయ్ ట్రాక్ పచ్చికతో కనిపిస్తోంది. దీంతో పేసర్లకు అనుకూలించే అవకాశం ఉంది.

## భారత్, పాక్ కెప్టెన్లు దూరం.. దూరం

**దుబాయ్:** ఆసియాకప్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో దూకుడును తగ్గించుకోమని సహచరులకు ఎటువంటి సూచనలు చేయలేదని భారత జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చెప్పాడు. మంగళవారం కెప్టెన్ల సంయుక్త మీడియా సమావేశంలో ట్రోఫీ ఆవిష్కరణ అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు వారు సమాధానమిచ్చారు. ఇందులో పాక్ కెప్టెన్ సల్మాన్ అలీ అగా, సూర్యకుమార్‌పైనే అందరి దృష్టీ నెలకొంది. వీరిద్దరి మధ్యలో ఆఫ్ఘానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ కూర్చున్నాడు. కాగా, పాక్‌తో మ్యాచ్‌లో దూకుడుగా ఆడే విషయమై ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సూర్య సూటిగా బదులివ్వలేదు. 'ఫీల్డ్‌లో దూకుడు ఎప్పుడూ ఉంటుంది. గెలవాలంటే అది తప్పని సరి' అని సూర్య సమాధానమిచ్చాడు. సల్మాన్ కూడా అదే తరహా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ప్రత్యేకంగా ఆటగాళ్లకు ఎలాంటి




సూచనలు చేయలేదని చెప్పాడు. కాగా, ప్రెస్‌మీట్ ముగిసిన తర్వాత ఆయా జట్ల సారథులు ఒకరితో ఒకరు కరచాలనం చేసుకొంటుంటే.. పాక్ కెప్టెన్ సల్మాన్ మాత్రం స్టేజ్ దిగి వెళ్లిపోయాడు. అయితే, కింద నిల్చున్న సల్మాన్ మెట్లు దిగుతున్న సూర్యకు షేక్ హ్యాండ్ ఇవ్వగా.. సూర్య కూడా లాంఛనం అన్నట్టుగా చేయిచ్చాడు. హగ్ మాత్రం చేసుకోలేదు.

### దుబాయ్‌లో ఉంటూ.. అబుధాబిలో మ్యాచ్‌లా?

**రషీద్ అంతృప్తి**

ఆసియాకప్‌లో తమ జట్టు షెడ్యూలింగ్‌పై ఆఫ్ఘానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాము ఆడే మూడు మ్యాచ్‌లు అబుదాబిలో జరుగనుండగా.. దుబాయ్‌లో వసతి ఏర్పాటు చేశారన్నాడు. దీంతో మ్యాచ్‌ల కోసం ప్రతీసారి రెండు గంటలు ప్రయాణం చేయాల్సి వస్తుందని వాపోయాడు. మంగళవారం మధ్యాహ్నం దుబాయ్‌లో జట్ల కెప్టెన్ల విలేకరుల సమావేశంలో పాల్గొన్న రషీద్.. సాయంత్రం హాంకాంగ్‌తో మ్యాచ్ కోసం వెంటనే అబుదాబికి వెళ్లడం గమనార్హం.

### అర్జున్‌కు డ్రా.. హారికకు గెలుపు

**సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్):** ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీలో అర్జున్ ఇరిగేసి ఆరో రౌండ్‌ను డ్రా చేసుకోగా.. గుకేశ్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. మంగళవారం జరిగిన ఆరో రౌండ్‌లో పర్హమ్ మక్సూద్ (ఇరాన్)తో అర్జున్ పాయింట్ పంచుకోగా..నికోలస్ థియోడొరో (గ్రీస్) చేతిలో గుకేశ్ ఓడాడు. ప్రజ్ఞానంద, దివ్య, హారికృష్ణ గేమ్‌లు డ్రాగా ముగిశాయి. మహిళల విభాగంలో గుల్‌రుక్‌బెగిమ్ (ఉజ్బెకిస్థాన్)పై హారిక, లీనా (అల్జీరియా)పై వంతిక గెలవగా.. వైశాలి గేమ్ డ్రా చేసుకొంది.

# బోణీ అదిరింది

## హాంకాంగ్‌పై అఫ్ఘానిస్థాన్ ఘనవిజయం

**ఆసియాకప్**

**అబుధాబి:** ఆసియాకప్ ఆరంభ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ అదరగొట్టింది. మంగళవారం హాంకాంగ్‌తో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షోతో రాణించిన రషీద్ సేన 94 రన్స్ తేడాతో గెలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 188 పరుగులు చేసింది. పవర్‌ప్లేలోనే రెండు వికెట్లు కోల్పోయినా ఓపెనర్ సెదిఖుల్లా అటల్ (73 నాటౌట్), అజ్మతుల్లా (53) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. ఈ ఇద్దరి ధాటికి ఆఖరి ఐదు ఓవర్లలో 78 పరుగులు నమోదయ్యాయి. నబీ (33) ఫర్వాలేదనిపించాడు. అటు హాంకాంగ్ ఏకంగా ఐదు క్యాచ్‌లు వదిలేసి ఆసియాకప్ చరిత్రలో చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఆ తర్వాత భారీ ఛేదనలో హాంకాంగ్ ఏ దశలోనూ లక్ష్యం వైపు సాగలేదు. చివరకు 20 ఓవర్లలో 9 వికెట్లకు 94 పరుగులు చేసి ఓడింది. బాబర్ హయత్ (39), యసీమ్ (16) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించారు. గుల్బదిన్ నయీబ్, ఫరూఖిలకు రెండేసి వికెట్లు దక్కాయి.

**సంక్షిప్త స్కోర్లు**

**అఫ్ఘానిస్థాన్:** 20 ఓవర్లలో 188/6 (అటల్ 73 నాటౌట్, అజ్మతుల్లా 53; కించిత్ షా 2/24, ఆయుష్ 2/54).

**హాంకాంగ్:** 20 ఓవర్లలో 94. (హయత్ 39, యసీమ్ 16; నయీబ్ 2/8, ఫరూఖి 2/16)


సెదిఖుల్లా (73 నాటౌట్)

## పతకానికి బౌట్ దూరంలో..

- క్వార్టర్స్‌కు నిఖత్
- వరల్డ్ బాక్సింగ్



**లివర్‌పూల్:** ఇప్పటికే రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్.. ముచ్చటగా మూడోసారి మెగా టోర్నీలో పతకం సాధించేందుకు అడుగు దూరంలో నిలిచింది. ఈ తెలుగమ్మాయి ప్రపంచ చాంపియన్‌షిప్ 51 కిలోల విభాగంలో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా పతకానికి కేవలం ఒక్క బౌట్ దూరంలో నిలిచింది. సెమీస్ చేరితే, కనీసం కాంస్య పతకం ఖాయం అవుతుంది. అయితే, ప్రత్యర్థి నుంచి కఠిన సవాల్‌ను ఎదుర్కొని ప్రీక్వార్టర్స్‌ను అధిగమించింది. మంగళవారం పోరులో అంతగా అనుభవం లేని జపాన్ బాక్సర్, 21 ఏళ్ల యున నిషినకపై నిఖత్ 5-0తో పోరాడి గెలిచింది. ఇక, రెండుసార్లు ఒలింపిక్ రజత పతక విజేత బ్యూస్ నాజ్ కకిరోగ్లు (టర్కీ) రూపంలో నిఖత్‌కు క్వార్టర్స్‌లో ముప్పు పొంచి ఉంది. పురుషుల విభాగంలో సుమీత్ (75 కిలోలు), సచిన్ సివాచ్ (60 కి), నరేందర్ బ్రేవాల్ (90+ కి) ప్రీక్వార్టర్స్‌లోనే వెనుదిరిగారు. సుమీత్ 0-5తో కివాన్ (బల్గేరియా) చేతిలో, సచిన్ 1-4తో బిబార్స్ (కజకిస్థాన్) చేతిలో, నరేందర్ 1-4తో డిగో లెంజీ (ఇటలీ) చేతిలో ఓడారు.

## శ్రీకాంత్ అవుట్

- 'హాంకాంగ్'లో సాత్విక్ జోడీ ముందంజ



**హాంకాంగ్:** ప్రపంచ మాజీ నెంబర్‌వన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్‌కు హాంకాంగ్ ఓపెన్‌లో చుక్కెదురైంది. మెయిన్ డ్రా కూడా చేరకుండా క్వాలిఫయర్స్‌లోనే కంగుతిన్నాడు. క్వాలిఫయర్స్ ఆరంభ రౌండ్లో భారత్‌కే చెందిన తరుణ్ మన్నెపల్లి 28-26, 21-13తో కిడాంబికి షాకిచ్చి సంచలనం సృష్టించాడు. అయితే, ఆ తర్వాత జరిగిన ఫైనల్ రౌండ్లో తరుణ్ 23-21, 13-21, 18-21తో జస్టిన్ హూ (మలేసియా) చేతిలో ఓడాడు. పురుషుల డబుల్స్ మెయిన్ డ్రా తొలి రౌండ్లో స్టార్ జోడీ సాత్విక్/చిరాగ్ శెట్టి 21-13, 18-21, 21-10తో తైవాన్ ద్వయం సియాంగ్/వాంగ్ లిన్‌పై గెలిచింది. సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ మెయిన్ డ్రాకు చేరాడు.

## క్వార్టర్స్‌లో జ్యోతికి నిరాశ

**గ్వాంగ్జు (కొరియా):** ఆర్చరీ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తెలుగు ఆర్చర్ జ్యోతి సురేఖకు నిరాశ ఎదురైంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం క్వార్టర్స్‌లో భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్ 149-147తో సురేఖను ఓడించింది. కాగా, సెమీస్‌లో 142-143తో సోఫియా పైజ్ (ఎల్ సాల్వడార్) చేతిలో పరాజయం పాలైన పర్ణీత్ కౌర్.. కాంస్యం పోరులోనూ విఫలమైంది. కౌర్ 144-145తో అలెగ్జాండ్రా ఉస్కియానో (కొలంబియా) చేతిలో ఓటమి పాలైంది. మహిళల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో వెటరన్ దీపిక కుమారి, గథా కడాకే, అంకిత భక్త్‌లతో కూడిన భారత జట్టు సెమీస్‌లో 2-6తో జపాన్ చేతిలో ఓడింది. కాంస్యం కోసం కొరియాతో తలపడనుంది.

## దబాంగ్ నాలుగో గెలుపు

- ప్రొ కబడ్డీలో వారియర్స్ చిత్తు

**విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి):** ప్రొ కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ గెలిచి అజేయంగా నిలిచింది. మంగళవారం జరిగిన పోరులో దబాంగ్ జట్టు 45-34తో బెంగాల్ వారియర్స్‌ను కంగుతినిపించింది. అనంతరం గుజరాత్ జెయింట్స్, జైపూర్ పింక్ పాంథర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి స్కోర్లు 30-30తో సమమయ్యాయి. దీంతో టైబ్రేకర్‌లో గోల్డెన్ రెయిడ్ ద్వారా జైపూర్ 1-0తో గెలిచింది.

## హైదరాబాద్‌దే బుచ్చిబాబు ట్రోఫీ

**చెన్నై:** ఆలిండియా బుచ్చిబాబు టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంప్ హైదరాబాద్ జట్టు టైటిల్ నిలబెట్టుకుంది. ఫైనల్లో తమిళనాడు ప్రెసిడెంట్స్ లెవన్‌పై గెలిచింది. ఆఖరి రోజైన మంగళవారం ఓవర్‌నైట్ స్కోరు 14/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు.. ఆట ముగిసేసరికి 70 ఓవర్లలో 155/5 స్కోరు చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా హైదరాబాద్ జట్టును విజేతగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 376, తమిళనాడు 353 పరుగులు చేశాయి.

## అబద్ధాలు, అసత్యాల ప్రవాహంలో రేవంత్:హరీశ్



హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ మధ్య సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు, అసత్యాల ప్రవాహంలో కొట్టుకుపోతున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 2016లో రూ.2052 కోట్లతో ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తే.. ఆ ఘనత తమదే అన్నట్లుగా ముఖ్యమంత్రి చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో సాధించిన విజయాలను తనవిగా ఆయన ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారం చేపట్టే నాటికి.. ఎల్లంపల్లి ప్రాజెక్టు హైలెవెల్ బ్రిడ్జి పూర్తికాలేదని, ఆర్అండ్ఆర్, భూసేకరణ కూడా పూర్తికాలేదని చెప్పారు. కాళేశ్వరంలో భాగంగానే ఎల్లంపల్లి నిర్మాణం చేపట్టామని.. ఆ నిజాన్ని సీఎం ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ముందుచూపుతో హైదరాబాద్ మంచి నీటి కోసం మల్లన్నసాగర్‌లో స్లూయిస్ కూడా నిర్మించిపెట్టారన్నారు. ఇప్పుడు గండిపేట, హిమాయత్‌సాగర్‌లకు కాళేశ్వరం ప్రాజెక్టు మోటార్ల ద్వారానే నీళ్లు తేవడానికి కొబ్బరికాయ కొట్టారా లేదా? అని నిలదీశారు. గ్రూప్ -1 పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్‌టికెట్ల జారీ, పరీక్ష ఫలితాల్లో అనుమానాలు, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని హరీశ్ రావు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. గప్పాలుకొట్టే కాంగ్రెస్ ప్రభుత్వానికి పరీక్షలు ఎలా నిర్వహించాలన్న సోయి కూడా లేదని విమర్శించారు.

## సామాజిక తెలంగాణే ధ్యేయం:కవిత



హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సామాజిక తెలంగాణ సాధనే తమ ధ్యేయమని, ఈ ప్రక్రియలో కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తినే ఆదర్శంగా తీసుకుంటామని కల్వకుంట్ల కవిత అన్నారు. జాగృతి కార్యాలయంలో కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక తెలంగాణ కోసం ఎంతటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొంటామన్నారు. కాళేశ్వరం కూలిందన్న సీఎం ఆ ప్రాజెక్టులో భాగమైన.. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు తెచ్చే ప్రాజెక్టుకు శంకుస్థాపన ఎలా చేశారని ప్రశ్నించారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ అవకాశవాదం

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

యాదాద్రి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ రక్షణ కోసం ఒక వైపు, రాజ్యాంగ నాశనం మరోకవైపు అన్న కోణంలో జరుగుతున్న ముఖ్యమైన ఉప రాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ అవకాశవాద వైఖరి ప్రదర్శించిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. లౌకిక వాదాన్ని రక్షించుకునేందుకు జరుగుతున్న ఉప ఎన్నికలో రాజ్యాంగాన్ని నాశనం చేసే వారికి బీఆర్ఎస్ పరోక్ష మద్దతునిచ్చిందని అన్నారు. వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమితే చరిత్ర హీనులవుతారన్న రాఘవులు.. ఈ పోరాటంలో బీజేపీ ఎక్కడుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



గోదావరిఖనిలో ఏఐటీయూసీ అధ్యక్షుడి కాళ్లు మొక్కుతున్న బాధితుడు

## ఉద్యోగాలు ఇవ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యం

- సింగరేణి డిపెండెంట్ బాధితుల ఆందోళన
- గుర్తింపు సంఘం నాయకుల కాళ్లపై పడి వేడుకోలు

గోదావరిఖని, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న డిపెండెంట్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆందోళన చేపట్టారు. పదేళ్లుగా 'మారుపేర్ల' సమస్య కారణంగా తమకు ఉద్యోగాలు ఇవ్వకుండా విజిలెన్స్ విచారణల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపించారు. ఈ సమస్యపై నిరసన వ్యక్తం చేస్తూ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని చౌరస్తా నుంచి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కార్యాలయం వరకు డిపెండెంట్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య కాళ్లపై పడి తమకు ఉద్యోగాలు ఇప్పించాలని వేడుకున్నారు. మారుపేర్ల బాధితుల సంఘం అధ్యక్షుడు లక్క శ్రావణ్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు 'వన్‌టైమ్ సెటిల్‌మెంట్' ద్వారా సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, రెండేళ్లు గడిచినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య స్పందిస్తూ, ఈ సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం నాయక్ దృష్టికి తీసుకెళ్లామని, దీనిని పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## కేటీఆర్‌పై మూడు క్రిమినల్ కేసుల కొట్టివేత

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నల్గొండ జిల్లా నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మూడు క్రిమినల్ కేసులను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. నకిరేకల్ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో తెలుగు ప్రశ్న పత్రం లీక్ అయిందంటూ కేటీఆర్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇది సరికాదని, ఆయన తప్పుడు సమాచారం వ్యాప్తి చేశారని పేర్కొంటూ పలువురు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నకిరేకల్ పోలీసులు మూడు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే అంశంపై వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చెల్లదని, వాటిని కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం పిటిషన్లను కొట్టివేసింది.

## కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి.. 'సీబీఐ విచారణ' జీవోను సవరించాలి

- బీజేఎల్పీ ఉపనేత పాయల్‌శంకర్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణకు జారీ చేసిన జీవోను 15 రోజుల్లోగా సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేఎల్పీ ఉపనేత పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన జీవోలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల అవినీతిపై మాత్రమే విచారణకు ఆదేశించడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులోని అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిగితేనే లక్ష కోట్ల అవినీతి బయట పడుతుందన్నారు. పూర్తి స్థాయిలో విచారణకు జీవోలో సవరణలు చేయకపోతే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కయ్యాయని భావించాల్సి వస్తుందని శంకర్ పేర్కొన్నారు.

## ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరు ఐఏఎస్ అధికారులకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జీవో 1220ని విడుదల చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం.. పశు సంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి కె.సీతాలక్ష్మికి రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# గ్రూప్-1 ఫలితాల రద్దు



(మొదటిపేజీ తరువాయి)

చేపట్టి మళ్లీ తాజా ఫలితాలను ప్రకటించడం ద్వారా 563 పోస్టుల భర్తీకి సంబంధించిన నియామక ప్రక్రియ కొనసాగించుకోవచ్చని తెలిపింది. పునర్ మూల్యాంకనం చేపట్టకపోతే మెయిన్ పరీక్షలను మొత్తం రద్దు చేస్తామని జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం స్పష్టం చేసింది. అంతేకాదు.. మెయిన్ పరీక్షలు రద్దయితే ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన వారందరికీ మళ్లీ మెయిన్స్ నిర్వహించాల్సి వస్తుందని పేర్కొంది. ఈ మొత్తం ప్రక్రియను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని తెలిపింది. ఈ మేరకు జూలై 7న రిజర్వు చేసిన 222 పేజీల తీర్పును తాజాగా వెలువరించింది.

### టీజీపీఎస్సీ పూర్తిగా విఫలం..

గ్రూప్-1 ఫలితాలపై తీర్పులో టీజీపీఎస్సీ పనితీరుపై హైకోర్టు సింగిల్ జడ్జి ధర్మాసనం మండిపడింది. "పిటిషనర్లు, టీజీపీఎస్సీ, ఇతరులు సమర్పించిన వాదనలు, గత తీర్పులు, అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించిన తర్వాత పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో టీజీపీఎస్సీ దారుణంగా విఫలమైందని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, సమగ్రతను పాటించకపోవడంతో పాటు వివక్షాపూరిత ధోరణితో వ్యవహరించింది. తన సొంత నిబంధనలను తానే తుంగలో తొక్కింది. టీజీపీఎస్సీ నిర్లక్ష్యం, అసమర్థత కారణంగా తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులు, యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రూప్-1 మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థులు ఈ పరీక్షల కోసం భారీ మొత్తంలో డబ్బులు ఖర్చు పెట్టుకున్నారు. కోచింగ్‌తోపాటు ప్రతిరోజూ 10 నుంచి 12 గంటలపాటు పరీక్షల కోసం సన్నద్ధమయ్యారు. కొంతమంది అభ్యర్థులు తాము చేస్తున్న ఉద్యోగాలకు సైతం రాజీనామా చేసి పరీక్షలకు సిద్ధమయ్యారు. కమిషన్ విధానపరమైన అంశాలతో పాటు సమాధాన పత్రాల మూల్యాంకన పద్ధతిలో సైతం దారుణంగా విఫలమైంది. ఇదివరకే గ్రూప్-1 పరీక్షలు రెండుసార్లు రద్దయినప్పటికీ గత అనుభవాల నుంచి కమిషన్‌కు బుద్ధిరాలేదు. గత తప్పుల నుంచి ఏమీ నేర్చుకోలేదు" అని ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

### మూల్యాంకనంపైనే ప్రధాన ఆరోపణలు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేపర్ లీకేజీ కారణంగా ఒకసారి, బయోమెట్రిక్ తీసుకోలేదనే కారణంతో హైకోర్టు కొట్టేయడం వల్ల రెండోసారి గ్రూప్-1 పరీక్షలు రద్దయ్యాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరి 19న 563 పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేశారు. గతేడాది జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించి.. అందులో అర్హత సాధించిన 21 వేల మంది అభ్యర్థులకు అక్టోబరు 21 నుంచి 27 వరకు మెయిన్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం తుది మార్కుల జాబితా, జనరల్ ర్యాంకింగ్ లిస్టును విడుదల చేయడంతోపాటు మొత్తం ప్రక్రియను టీజీపీఎస్సీ పూర్తిచేసింది. ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాల జారీ మాత్రమే మిగిలి ఉంది. ఈ దశలో ప్రధాన పరీక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం సరిగా చేపట్టలేదని, పరీక్షా కేంద్రాల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, రెండు సెంటర్ల నుంచే ఎక్కువ మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని ఆరోపిస్తూ హైకోర్టులో 14 పిటిషన్లు దాఖలయ్యాయి. అంతేకాక.. తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని, సబ్జెక్టుకు సంబంధం లేని ఎవాల్యుయేటర్లు పేపర్లు దిద్దారని, ప్రైవేటు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులను ఎవాల్యుయేటర్లుగా తీసుకున్నారని తెలిపారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

### రెండు హాల్ టికెట్లు ఎందుకు?

ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు ప్రత్యేకంగా రెండు హాల్‌టికెట్లు జారీ చేయడాన్ని కూడా హైకోర్టు తప్పుబట్టింది. కమిషన్ రూల్స్‌లోగానీ, నోటిఫికేషన్‌లో గానీ ఎక్కడా రెండు హాల్‌టికెట్లు జారీ చేస్తామని ఎక్కడా చెప్పలేదని గుర్తు చేసింది. ఈ విషయంలో కమిషన్ చర్య అనుమానాలకు తావిచ్చేలా ఉందని పేర్కొంది. కమిషన్ చెప్పినట్లు పరీక్షా కేంద్రాల కేటాయింపులో ర్యాండమ్ పద్ధతిని పాటిస్తే కేవలం రెండు కేంద్రాల్లోనే మహిళా అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో ఎలా వచ్చారని ప్రశ్నించింది. సమాధాన పత్రాల మూల్యాంకనంలో మూడంచెల పద్ధతిని పాటించినా.. మొదటి రెండు అంచెల్లో మాత్రమే బార్ కోడ్, బబ్లింగ్స్ ఉన్నాయని, మూడో దశలో లేవని ధర్మాసనం పేర్కొంది. దీంతో మార్కులను మార్చడానికి, మోసం చేయడానికి అన్నిరకాల అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడింది. వాస్తవానికి మూడో దశ మూల్యాంకనం గురించి కమిషన్ నోటిఫికేషన్‌లో ఎక్కడా పేర్కొనలేదని, తద్వారా తన రూల్స్‌ను తానే అతిక్రమించిందని పేర్కొంది. కమిషన్ నిబంధనల ప్రకారం.. అందరు అభ్యర్థుల మార్కులను సబ్జెక్టులవారీగా పబ్లిష్ చేయాల్సి ఉండగా.. ఎవరి మార్కులు వారు మాత్రమే చూసుకునేలా పెట్టారని, తద్వారా కమిషన్ తన రూల్స్‌ను తానే తుంగలో తొక్కిందని తెలిపింది. ఈ విషయాన్ని ప్రశ్నించే హక్కు అభ్యర్థులకు లేదనే విధంగా కమిషన్ వ్యవహరించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. జనరల్ ఇంగ్లీష్‌లో అర్హత సాధించని కొందరు అభ్యర్థుల ఇతర పేపర్లను దిద్దడమే కాకుండా..వారి మొత్తం మార్కులను పబ్లిష్ చేయడం ద్వారా కమిషన్ తప్పు చేసిందని, అసలు పారదర్శకత లేదనడానికి ఇదే నిదర్శనమని స్పష్టం చేసింది.

### ఎవాల్యుయేటర్ల ఎంపికలో లోపాలు..

మూల్యాంకనం చేసే ఎవాల్యుయేటర్ల ఎంపిక విషయంలోనూ కమిషన్ తప్పు చేసిందని హైకోర్టు పేర్కొంది. ఎవాల్యుయేటర్లుగా రెగ్యులర్ ఫ్యాకల్టీని మాత్రమే తీసుకుంటామని చెప్పి.. రిటైర్ అయిన వారిని సైతం తీసుకుందని తెలిపింది. ప్రైవేటు ట్యూటర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎంఏ మాలిక్ ఎవాల్యుయేటర్‌గా సేవలందించారని, ఆయన ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్‌గా ఉన్నారని, 'ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో పనిచేయలేదని కమిషన్ పేర్కొంటున్నప్పటికీ.. ఆయన రాసిన 'ఇండియన్ ఎకానమీ ఫర్ గ్రూప్-1' పుస్తకంలో ఆర్‌సీ రెడ్డి మ్యాగజైన్ కోసం పనిచేసినట్లు ఉందని ధర్మాసనం గుర్తుచేసింది. ఆర్‌సీ రెడ్డి ఇన్‌స్టిట్యూట్‌లో చదివిన అభ్యర్థులకు ఆయన గైడ్ చేసినట్లు స్పష్టంగా తెలుస్తోందని, ఈ అంశాన్ని బయటపెట్టిన పిటిషనర్లను కేసు పెడతామని టీజీపీఎస్సీ బెదిరించడమేంటని ప్రశ్నించింది. మూల్యాంకనం విషయంలో కమిషన్ సరైన పద్ధతి ఏదీ పాటించలేదని పేర్కొంది. "తెలంగాణ ఉద్యమంపై ప్రశ్నకు ఏయే అంశాలు ప్రస్తావిస్తే ప్రామాణిక మార్కులు ఇస్తారు? ఒక అభ్యర్థి ఒక పేజీలోనే అన్ని కీలక విషయాలు ప్రస్తావిస్తారు. మరో అభ్యర్థి పది పేజీలు రాసినా ప్రామాణిక అంశాలు రాకపోవచ్చు. ఇలాంటి సందర్భంలో మార్కులెలా ఇస్తారని ఈ కోర్టు అడిగిన ప్రశ్నకు కమిషన్ నుంచి సమాధానం లేదు" అని హైకోర్టు వ్యాఖ్యానించింది. పేపర్లు దిద్దే ఎవాల్యుయేటర్లు విషయ నిపుణులు కాబట్టి ఎలాంటి కీ ఉండదని, వారే చూసుకుంటారనే సమాధానం ద్వారా కమిషన్ సరైన పద్ధతి పాటించలేదని స్పష్టమవుతోందని పేర్కొంది. మోడరేషన్ పద్ధతి పాటించామని మొదట పేర్కొన్న కమిషన్.. కౌంటర్‌లో మాత్రం మోడరేషన్ పద్ధతి అవసరం లేదని పేర్కొనడాన్ని తప్పుబట్టింది. తెలుగు మీడియం అభ్యర్థుల సమాధాన పత్రాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని తెలిపింది. ఇంగ్లీష్ మీడియం అభ్యర్థులు 89.88% ఎంపికైతే.. తెలుగు మీడియం అభ్యర్థులు 9.95% ఎంపికయ్యారని పేర్కొంది. 18, 19 సెంటర్లలో ఎక్కువ మంది మహిళలు ఎంపికయ్యారని తెలిపింది. 719 మంది అభ్యర్థులకు సమాన మార్కులు రావడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తంచేసింది.

## గ్రూప్-1పై హైకోర్టు తీర్పును గౌరవిస్తాం

- పదేళ్లు పరీక్ష నిర్వహించలేని అసమర్థత బీఆర్ఎస్‌ది: జూపల్లి
- టీజీపీఎస్సీని రోడ్డు మీదకు లాగిందే బీఆర్ఎస్సే
- ఎంపీలు మల్లు రవి, చామల, బలరాం నాయక్

హైదరాబాద్, న్యూఢిల్లీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల అంశంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఇక, దేశంలోనే పేరొందిన టీజీపీఎస్సీని బీఆర్ఎస్ పార్టీ రోడ్డు మీదకు లాగిందని కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బలరాం నాయక్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోమంత్రి జూపల్లి, ఢిల్లీలో ఎంపీలు మల్లు రవి, చామల, బలరాం నాయక్ గ్రూప్-1 అంశంపై మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రూప్-1 అంశంలో కోర్టు తీర్పును పరిశీలించి ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని జూపల్లి చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉండి కూడా గ్రూప్-1 పరీక్ష నిర్వహించలేని అసమర్థత బీఆర్ఎస్‌ది అని జూపల్లి ఎద్దేవా చేశారు. ఇక, టీజీపీఎస్సీని రోడ్డు మీదకు లాగిన బీఆర్ఎస్ ఇప్పుడు గురువింద నీతులు చెబుతుంటే రాష్ట్రంలోని నిరుద్యోగులంతా నవ్వుకుంటున్నారని ఎంపీలు మల్లు రవి, చామల, బలరాం నాయక్ అన్నారు. పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను నడిరోడ్డుపై పెట్టి బేరాలు సాగించిన బీఆర్ఎస్ ఇప్పుడు నీతులు మాట్లాడడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. నిధులు, నీళ్లు, నియామకాల కోసం 1,600 మంది విద్యార్థులు బలిదానాలు చేస్తే, కేవలం కేసీఆర్, కేటీఆర్, హరీశ్, సంతోష్, కవిత మాత్రమే లబ్ధి పొందారని ఆరోపించారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

### రేవంత్ సర్కారుకు చెంప పెట్టు: రాంచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష పత్రాలను రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న విషయాన్ని తాము మొదటి నుంచీ చెబుతున్నామని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు మొండిపట్టుకు పోయి వేలాది మంది అభ్యర్థుల జీవితాలతో చెలగాటమాడిందని విమర్శించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి సమాధాన పత్రాల మూల్యాంకనం వరకు అన్నీ తప్పుడు విధానాలనే టీజీపీఎస్సీ అవలంబించిందని ఆరోపించారు. అభ్యర్థుల విజ్ఞప్తులను పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు.

## గ్రూప్-1పై అప్పీలుకెళ్దామా?

### ఆలోచనలో టీజీపీఎస్సీ యంత్రాంగం

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుతో.. పరీక్షల విషయం మళ్లీ మొదటికొచ్చింది. సమాధానపత్రాలను మళ్లీ మూల్యాంకనం చేయాలని.. లేనిపక్షంలో పరీక్షలను రద్దుచేస్తామని హైకోర్టు వ్యాఖ్యానించడంతోపాటు.. టీజీపీఎస్సీ పనితీరును తీవ్రంగా ఆక్షేపించింది. ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యచరణపై మంగళవారం టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించారు. పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని, అభ్యర్థుల అన్ని అనుమానాలను నివృత్తి చేశామని కమిషన్ చెబుతోంది. కొందరు రాజకీయ దురుద్దేశంతో దీన్ని వివాదాస్పదం చేస్తున్నారని పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో డివిజన్ బెంచ్‌కి అప్పీలు చేయాలని కమిషన్ నిర్ణయించినట్లు తెలిసింది. దీనిపై బుధవారం అధికారిక ప్రకటన విడుదలయ్యే అవకాశాలున్నాయి. డివిజన్ బెంచ్‌లో తన వాదనను మరింత సమర్థంగా వినిపించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. మరోవైపు ఇప్పటికే విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి, ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను పూర్తిచేసుకుని, నియామక పత్రాల కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులు సైతం హైకోర్టు తీర్పును సవాల్ చేయాలని నిర్ణయించారు. వారు కూడా డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేయనున్నారు. అక్కడా న్యాయం జరగకపోతే.. సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని చెబుతున్నారు.

## గ్రూప్-1 అక్రమాలపై జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలి

- పరీక్షలు మళ్లీ నిర్వహించి నిరుద్యోగులకు న్యాయం చేయాలి: కేటీఆర్



హైదరాబాద్/మహబూబ్‌నగర్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్షల్లో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అవకతవకలకు పాల్పడ్డాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ అవినీతి, పరీక్షల అస్తవ్యస్త నిర్వహణపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలను అమ్ముకున్న వారెవరో బయటికి రావాలన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని తమ నివాసంలో గ్రూప్-1 అభ్యర్థులతో కేటీఆర్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పులను గుర్తించిన హైకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని, ఇది రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి గుణపాఠమని కేటీఆర్ పేర్కొన్నారు. నిరుద్యోగుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా అవకతవకలకు పాల్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలన్నారు. కాంగ్రెస్ నిరుద్యోగుల ఓట్లు దండుకొని రాష్ట్రంలో గద్దెనెక్కిందని, వారికి మాయమాటలు చెప్పిన రాహుల్‌గాంధీ ఈ వ్యవహారంపై స్పందించాలని డిమాండ్ చేశారు. భారీగా ఉద్యోగాలు ఇచ్చామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. దీనిపై చర్చించేందుకు ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.

### ప్రజలను పిచ్చివాళ్లను చేస్తున్నారు..

నిన్నగాక మొన్న పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని చెప్పి ఫిరాయింపులపై టీపీసీసీ అధ్యక్షుడు అప్రూవర్‌గా మారారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేర్కొన్నారు. పీసీసీ చీఫ్ నేరాంగీకారం చేసిన తర్వాత ఆ పదిమందిపై వేటు వేయడానికి స్పీకర్‌కు మొహమాటం ఎందుకని ప్రశ్నించారు. ఆ పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నా కూడా సిగ్గులేకుండా బీఆర్ఎస్‌లో ఉన్నామని చెబుతున్నారని మండిపడ్డారు. మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి మొదటి వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. ఆ పది మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోనే ఉంటే పార్టీ ఆఫీసుకు ఎందుకు రావడం లేదని,పార్టీ కార్యక్రమాల్లో ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. ఫిరాయింపులపై చర్యలు తీసుకోవాలని సుప్రీం కోర్టు ఇప్పటికే స్పీకర్‌కు సూచించిందని, స్పీకర్ ఏదైనా ఉల్టా పల్టా చేస్తే పీసీసీ ప్రెసిడెంట్ చెప్పిన విషయాన్ని కోర్టు ముందు పెడతామని చెప్పారు. కాగా, డబ్బులు తీసుకుని సీఎం రేవంత్ గ్రూప్-1 పోస్టులను అమ్ముకున్నారని బీఆర్ఎస్ నేతలు పాడి కౌశిక్ రెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆరోపించారు.

# తేలిన హ్యామ్ రోడ్ల లెక్క!

- 5,526 కి.మీ మేర అభివృద్ధి
- ఇందుకు రూ.10,646 కోట్లు అవసరం
- గతంతో పోల్చితే పెరిగిన 4,168 కోట్లు
- కొత్తగా 43 కి.మీ మేర గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు
- ఉమ్మడి జిల్లాల వారీగా జాబితా సిద్ధం
- నేడో, రేపో హ్యామ్ రోడ్లపై మంత్రి సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, భవనాల శాఖలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్)లో అభివృద్ధి చేయడానికి తలపెట్టిన రహదారుల లెక్క తేలింది. ఈ మేరకు గతంలో ఖరారు చేసిన పలు రోడ్లలో అధికారులు మార్పులు చేసి హైదరాబాద్ మినహా 9 ఉమ్మడి జిల్లాల వారీగా తుది జాబితాను సిద్ధం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 401 పనులకు సంబంధించి 5,526.92 కి.మీ మేర రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ.10,646.59 కోట్ల నిధులు అవసరపడతాయని తేల్చారు. ఇందులో రెండులేన్ల రోడ్ల పనులు 862కి.మీ మేర, రెండులేన్లు ప్లస్ పేవ్‌డ్ షోల్డర్స్ పనులు 663 కి.మీ మేర, 4లేన్ల రోడ్లు 135 కి.మీ మేర, గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు 43 కి.మీ మేర అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఉన్నతీకరణ కింద సింగిల్‌లేన్ రోడ్డు 780 కి.మీ మేర, రెండు వరుసల రోడ్లు 2,657 కి.మీ మేర, రెండులేన్లు ప్లస్ పేవ్‌డ్ షోల్డర్స్ 143 కి.మీ మేర, 4లేన్ల రోడ్డు 220 కి.మీ మేర చేపట్టాలని నిర్ణయించారు. గతంలో హ్యామ్ కింద 373 పనులకు సంబంధించి 5,190 కి.మీ మేర రోడ్లను అభివృద్ధి చేయాలని.. ఇందుకు రూ.6,478 కోట్లు అవసరమవుతాయని తేల్చారు. తాజాగా సవరించిన లెక్కల ప్రకారం గతంలో కన్నా 28 పనులు, అభివృద్ధి చేయాల్సిన రోడ్లు 336 కి.మీ మేర పెరిగాయి. ఈ మేరకు గతంలో కన్నా రూ.4,168 కోట్ల నిధులు పెరిగాయి. గతంలో చేసిన ప్రతిపాదనల్లో గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు లేవు. తాజా ప్రతిపాదనల్లో 43 కి.మీ మేర గ్రీన్‌ఫీల్డ్ రోడ్లుగా అభివృద్ధి చేయాలని పొందుపర్చారు. ఉమ్మడి జిల్లాల వారీగా జాబితాను పరిశీలిస్తే అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 765.57 కి.మీ మేర 62 పనులకు సంబంధించి రూ.1245.41 కోట్లు అవసరపడతాయని ప్రతిపాదించారు. తాజాగా తేలిన హ్యామ్ రోడ్లు, నిధులకు సంబంధించిన అంశాలపై శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నేడోరేపో సమీక్ష నిర్వహించనున్నారు.

### 60శాతం రుణాల రూపంలో..

హ్యామ్ నిబంధనల ప్రకారం మొత్తంగా రూ.10,646.59 కోట్లలో 40 శాతం అంటే రూ.4,260 కోట్లను ప్రభుత్వం తొలుత కాంట్రాక్టర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. మిగిలిన 60 శాతం అంటే రూ.6,390 కోట్లను కాంట్రాక్టర్లు రుణాల రూపంలో సేకరించాల్సి ఉంటుంది. అయితే అసలు చిక్కుముడి ఇక్కడే ఉంది. కాంట్రాక్టర్లు 60శాతం నిధులను బ్యాంకుల నుంచి తీసుకున్న తర్వాత కొంతకాలానికి ప్రభుత్వం బ్యాంకులకు సమయానికి చెల్లింపులు చేయకపోతే బ్యాంకులు తమ రేటింగ్స్ తగ్గిస్తాయని, దీనిపై స్పష్టతనివ్వాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. రుణం ఇచ్చే అంశం కూడా పనులు దక్కించుకున్న కంపెనీ రేటింగ్స్‌ని బట్టే ఉంటాయని, బ్యాంకు నిబంధనలకు తగ్గట్టుగా లేకపోతే ఇవ్వలేమని బ్యాంకర్లు తేల్చిచెప్పారు. దీంతోపాటు ఒక రోడ్డు విస్తరణ పని పూర్తయ్యాక దాని నిర్వహణ, బ్యాంకులో తీసుకున్న రుణం, వడ్డీ కలిపి ప్రభుత్వం 15ఏళ్లలో ఎంత చొప్పున చెల్లిస్తుందన్న విషయాలపై స్పష్టతనివ్వాలని కాంట్రాక్టర్లు అడుగుతున్నారు. వీటిపై సమీక్ష అనంతరం మంత్రి స్పష్టతనిచ్చే అవకాశం ఉంది.

**హ్యామ్‌లో కొత్త ప్రతిపాదనలు.. ఉమ్మడి జిల్లాల వారీగా..**

| జిల్లా | పనులు | కి.మీ | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 30 | 572.06 | 1091.07 |
| కరీంనగర్ | 48 | 616.41 | 947.21 |
| ఖమ్మం | 47 | 702.59 | 1738.98 |
| మహబూబ్‌నగర్ | 50 | 718.11 | 1470.97 |
| మెదక్ | 44 | 553.04 | 1000.97 |
| నల్లగొండ | 56 | 737.75 | 1490.97 |
| నిజామాబాద్ | 25 | 364.83 | 572.53 |
| రంగారెడ్డి | 39 | 495.94 | 1088.48 |
| వరంగల్ | 62 | 765.57 | 1245.41 |

# యూరియా కోసం ఆగని ఆందోళనలు

**పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు.. అందనిచోట ధర్నాలు, రాస్తారోకోలు.. యూరియా పంపిణీ పర్యవేక్షణలో నిర్లక్ష్యం**

- ఆత్మకూర్(ఎస్) మండల ఏవో సస్పెన్షన్
- 2 యూరియా బస్తాలిచ్చి 5 ఇచ్చినట్లు స్లిప్
- నెమ్మికల్ పీఏసీఎస్‌లో సిబ్బంది మోసం
- ఫిర్యాదుతో సూర్యాపేట కలెక్టర్ చర్యలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రైతుల యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కానీ యూరియా అందకపోవడంతో ఆందోళనకు దిగుతున్నారు. మంగళవారం కరీంనగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా నిరసన చేపట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా యూరియా ఇవ్వడం లేదని కాంగ్రెస్ నాయకులు ప్రధాని మోదీ దిష్టిబొమ్మను, రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని బీజేపీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్, ఓదెలలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అయోధ్య, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పడ్తన్‌పల్లి, వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపల్లిలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో పలు కేంద్రాల వద్ద అలజడి రేగింది. పెద్దనాగారం క్లస్టర్ రైతులు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బైఠాయించారు. తమకు సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం నారాయణపురంలో సత్యనారాయణ అనే యువరైతు తెల్లవారుజామునే వచ్చి గంటల తరబడి లైన్‌లో



బయ్యారం మండలం ఉప్పలపాడులో యూరియా కోసం బారులు రైతులు

సమయంలో సొమ్మసిల్లి పడిపోయాడు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో క్యూ లైన్‌లో ఇద్దరు మహిళా రైతుల మధ్య మాటామాటా పెరిగి చెప్పులతో కొట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలో కూడా రాస్తారోకో చేశారు. దౌల్తాబాద్‌లో రైతులు అర్ధరాత్రి నుంచే పడిగాపులు పడ్డారు. క్యూలో చెప్పులు, వరిగుజ్జు కట్టలు, మందు బాటిళ్లు పెట్టారు. వికారాబాద్ జిల్లా యాలాల మండల రైతులు హైవేపై బైఠాయించారు. యూరియా పంపిణీ పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు ఆత్మకూరు(ఎస్) మండల వ్యవసాయ అధికారి దివ్యను సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సస్పెండ్ చేశారు. నెమ్మికల్ పీఏసీఎస్ సిబ్బంది తనకు 5 బస్తాల యూరియా అందజేసినట్లు స్లిప్ ఇచ్చి 2 బస్తాలే ఇవ్వడంతో ఓ రైతు కలెక్టర్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇలా చాలామంది రైతులను మోసం చేస్తున్నారని తెలిపాడు. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి తనిఖీ చేసి.. అవకతవకలు జరిగినట్లు గుర్తించి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు.

## డ్యూటీ మీట్.. సంస్కరణలకు మైలురాయి

» రాష్ట్ర జైళ్ల శాఖ పనితీరు అభినందనీయం: గవర్నర్

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్ కార్యక్రమం జైళ్ల సిబ్బంది మధ్య పోటీ కోసం కాదని.. క్రమశిక్షణ, విధి నిర్వహణలో అంకితభావం పెంపొందించుకునేందుకు చక్కని వేదిక అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ప్రిజన్స్ డ్యూటీ మీట్ దేశవ్యాప్తంగా జైళ్లల్లో సంస్కరణలకు మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ పోలీస్ శిక్షణ కేంద్రంలో మంగళవారం జరిగిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్స్ డ్యూటీ మీట్-2025ని గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖైదీల్లో పరివర్తన తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం, జైళ్ల శాఖ అనేక సంస్కరణలు తెచ్చిందని అభినందించారు. విధి నిర్వహణలో జైలు సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతను గవర్నర్ ప్రశంసించారు. క్రీడల వల్ల విధి నిర్వహణలో ఉత్సాహం పెరుగుతుందని సీఎస్ రామకృష్ణారావు అన్నారు. డ్యూటీ మీట్‌తో అన్ని రాష్ట్రాల జైళ్ల శాఖ సిబ్బంది ఒక చోట కలుసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించాలని హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా అన్నారు. సిబ్బంది నైతిక విలువలతో పనిచేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖలో అనేక సంస్కరణలు జరిగాయని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. ఖైదీల పట్ల జైలు సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.

## ఈ నెల 12 నుంచి 17 వరకు 'ఛాప్-2025'

» శిల్పారామంలో చేనేత హస్త కళాఖండాల ప్రదర్శన

» రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి వల్లూరు క్రాంతి

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారతీయ హస్తకళలు, హస్తకళాకారులను ప్రోత్సహించడానికి ఈ నెల 12 నుంచి 17 వరకూ శిల్పారామంలో జాతీయస్థాయి హస్తకళాఖండాల ప్రదర్శన (ఛాప్-2025) నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ వల్లూరు క్రాంతి తెలిపారు. ఇందులో భాగంగా హస్తకళాఖండాల ప్రదర్శన, వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తున్నామని మంగళవారం మీడియాకు చెప్పారు. పర్యాటక రంగ ప్రాధాన్యం పెంపుదల కోసం నిఫ్ట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ) ఆధ్వర్యంలో నిర్వహించే 'ఛాప్-2025'కు అవసరమైన సహకారం అందిస్తున్నామన్నారు. నిఫ్ట్ డైరెక్టర్ డాక్టర్ మాలిని దివకళ మాట్లాడుతూ ఛాప్-2025లో దేశంలోని వివిధ ప్రాంతాల కళాకారుల హస్తకళాఖండాలు, సంప్రదాయ చేనేత ఉత్పత్తుల ప్రదర్శనలుంటాయన్నారు.

## వారంలో గురుకులాల టైం టేబుల్ మార్పు

» ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తిపై మంత్రి లక్ష్మణ్ స్పందన

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యా సంస్థలకు ప్రత్యేక టైం టేబుల్ ప్రకటిస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు. గతంలో గురుకులాల టైంటేబుల్ ఉదయం 9 గంటల నుంచి ఉండేదని, ఇప్పుడు 8 గంటల నుంచే మొదలుకావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మంత్రిని కలిసి.. గురుకులాలన్నింటికీ ఒకే సమయం ఉండటంతో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావించారు. ఉదయం 8గంటలకే తరగతులు ప్రారంభమవుతుండటంతో అనేక మంది విద్యార్థులు అల్పాహారం తినకుండానే తరగతులకు హాజరుకావాల్సి వస్తోందన్నారు. అన్ని గురుకులాలకు ఒకే సమయం కాకుండా.. బీసీ, ఎస్సీ, గిరిజన, మైనారిటీ గురుకులాలకు వేర్వేరు టైం టేబుల్ ఏర్పాటు చేసుకునే వెసులుబాటును ఆయా గురుకులాలకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి లక్ష్మణ్.. సీఎస్ రామకృష్ణారావుతో ఫోన్‌లో మాట్లాడారు. దీనిపై వారంలోపు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు.

## కాళేశ్వరం హైడ్రాలిక్ అధ్యయన డేటా ఇవ్వండి

» రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన సీడబ్ల్యూపీఆర్ఎస్

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నమూనా హైడ్రాలిక్ అధ్యయనానికి అవసరమైన డేటా అందించాలని తెలంగాణను పుణెలోని కేంద్ర విద్యుత్, నీటి పరిశోధన కేంద్రం (సీడబ్ల్యూపీఆర్ఎస్) కోరింది. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదికనుగుణంగా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీల్లో పరీక్షలు జరిపి నివేదిక ఇవ్వాలని సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంచిర్యాల, టెక్రా, సోమన్‌పల్లి, కాళేశ్వరం, పేరూర్‌ల వద్ద ఉన్న గేజ్ డిశ్చార్జి డేటాను గణిత నమూనాలో విశ్లేషించి, అందించాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులకు సీడబ్ల్యూపీఆర్ఎస్ లేఖ రాసింది. వరదల తీరు విశ్లేషణకు ఈ డేటా అవసరమని పేర్కొంది. సకాలంలో అత్యంత కీలకమైన ఈ డేటా సమకూరిస్తే సమగ్ర వివరాలు వెలుగు చూస్తాయని సీడబ్ల్యూపీఆర్ఎస్ తేల్చి చెప్పింది.

## మండలి పునర్నిర్మాణ పనులు వేగిరం చేయండి: చైర్మన్ గుత్తా

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ భవనంలోని శాసన మండలి పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శాసనసభ స్పీకర్ ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, సెక్రెటరీ నరసింహాచార్యులు మంగళవారం మండలి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం స్పీకర్ కార్యాలయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, ఆగాఖాన్ సంస్థ ప్రతినిధులతో పునర్నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా మంగళవారం అసెంబ్లీ లాంజ్‌లో ఆయన చిత్ర పటానికి స్పీకర్ ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాళులర్పించారు.

## బీఆర్ఎస్‌లో చేరినోళ్లూ అదే కోవనా..?: బీర్ల

హైదరాబాద్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): "పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఆడా కాదు, మగా కాదంటూ కేటీఆర్ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలూ అదే కోవకు చెందుతారా..? ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను మంత్రివర్గంలోకి తీసుకున్నవారు ఏ జాబితాలోకి వస్తారు..?" అని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య కేటీఆర్‌ను ప్రశ్నించారు. గోదావరి నీళ్లను మూసీకి తీసుకొస్తామంటే కేటీఆర్‌కు ఎందుకంత కడుపు మంటని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్, బీజేపీలు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు.

## ప్రజా పాలనా దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి: సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17న నిర్వహించే తెలంగాణ ప్రజాపాలనా దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని సీఎస్ రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. ఉత్సవ ఏర్పాట్లపై మంగళవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, పర్యాటక ప్రదేశాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. 17న ఉదయం గన్‌పార్క్‌లోని అమరుల స్థూపం వద్ద సీఎం నివాళులర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే ప్రజాపాలనా దినోత్సవంలో పాల్గొంటారని సీఎస్ తెలిపారు.

## ఎస్సీ గురుకుల 'ఉద్యోగుల' జీతాలు చెల్లించండి

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ గురుకుల సొసైటీలో పనిచేస్తున్న 2,469 మంది పార్ట్ టైమ్, ఔట్‌సోర్సింగ్, సబ్జెక్ట్ అసోసియేట్లకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ గురుకుల టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. రెగ్యులర్ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన నాలుగు డీఏలకు సంబంధించి రూ.27కోట్లను చెల్లించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

## మంత్రి జూపల్లికి టీజీవో కృతజ్ఞతలు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆబ్కారీ శాఖలో అపరిష్కృతంగా ఉన్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఆర్థిక శాఖ విధించిన అడ్డంకులను తొలగించేందుకు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకున్నారని టీజీవో పేర్కొంది. సీఎం ద్వారా ఫైల్ క్లియర్ చేయించినందుకు జూపల్లికి టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఆ రూ.30 వేల కోట్లు అప్పు లెక్కల్లో వద్దు!

(మొదటిపేజీ తరువాయి)



కేంద్ర మంత్రి నిర్మలతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇవ్వాలని, ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి మినహాయింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కోరారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అడ్డగోలుగా అప్పులు తెచ్చిందని, వాటి చెల్లింపు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారిందని వివరించారు. ఆ రుణాలను సులభమార్గాల్లో చెల్లించేందుకు అనుమతించాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌లో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. మరోవైపు ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలకు మంగళవారం ఉదయమే అల్పాహార విందు ఏర్పాటుచేసి, దిశానిర్దేశం చేశారు.

## ఒకే వ్యక్తి పేరుతో ఆరు జిల్లాల్లో ఉద్యోగాలు

**9 ఏళ్లుగా సాగుతున్న మోసం.. దర్యాప్తునకు యూపీ సీఎం ఆదేశం**

లఖ్‌నవూ, సెప్టెంబరు 9: ఒకే వ్యక్తి పేరుతో ఆరు జిల్లాల్లో కొందరు ఉద్యోగాలు చేస్తుండడం, వారు నెలనెలా జీతాలు తీసుకుంటుండం ఉత్తరప్రదేశ్‌లో సంచలనం కలిగించింది. తొమ్మిదేళ్లుగా సాగుతున్న ఈ మోసం కారణంగా ఇంతవరకు ప్రభుత్వానికి రూ.4.5 కోట్ల మేర నష్టం వచ్చినట్టు తేలింది. 2016లో జరిగిన ఉద్యోగాల భర్తీలో ఆగ్రాకు చెందిన అర్పిత్ సింగ్ ఎక్స్ రే టెక్నీషియన్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆయనకు బందా, బలరాంపూర్, షామ్లీ, అమ్రోహా, ఫరూఖాబాద్, రాంపూర్ జిల్లాల్లో ఉద్యోగాలు వచ్చాయి. తండ్రి పేరు అనిల్ కుమార్ సింగ్ అని, మెరిట్ లిస్టులో 80వ నెంబరు అని నమోదయింది. ఒక చోట ఆయన పని చేస్తుండగా, మిగిలిన అయిదు చోట్ల అర్పిత్ సింగ్ పేరుతో ఇతరులు చేరి జీతాలు పొందుతున్నారు. ఇటీవల జరిగిన ఉద్యోగుల డిజిటలైజేషన్‌లో ఈ మోసం బయటపడింది. ఎక్కడ మోసం జరిగిందో తెలుసుకునేందుకు సమగ్రంగా దర్యాప్తు జరపాలని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశించారు.

## హైదరాబాద్-బందర్ మధ్య 12 వరుసల

# కొత్త రోడ్డుకు అనుమతివ్వండి

**ఆర్ఆర్ఆర్ ఉత్తరం పనులు ప్రారంభించండి.. శ్రీశైలానికి 4వరుసల ఎలివేటెడ్ కారిడార్ కావాలి**

» హైదరాబాద్-మంచిర్యాల మధ్య కొత్త రోడ్డు వేయాలి

» కేంద్ర మంత్రి గడ్కరీకి సీఎం రేవంత్ వినతి

» 868 కోట్ల పనులకు వారంలో అనుమతిస్తాం.. కొత్త రోడ్లపై చర్చకు అధికారుల్ని పంపుతా: గడ్కరీ



కేంద్రమంత్రి గడ్కరిని కలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం తెలంగాణ-ఏపీ రాజధానుల మధ్య గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మించాల్సి ఉందని గుర్తుచేశారు. తెలంగాణకు సముద్రమార్గం లేనందున బందరు పోర్టు వరకు సరకు రవాణాకు వీలుగా గ్రీన్‌ఫీల్డ్ రహదారి మంజూరు చేయాలని కోరారు. ఈ రహదారిలో 118 కిలోమీటర్లు తెలంగాణలో ఉంటుందని మిగతా భాగం ఏపీలో ఉంటుందని వివరించారు. మంగళవారం కేంద్రమంత్రిని ఆయన నివాసంలో రేవంత్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు జాతీయ రహదారుల నిర్మాణం, అనుమతులు, పనుల వేగవంతం చేయాల్సిన అవసరంపై కేంద్రమంత్రితో చర్చించారు. హైదరాబాద్ రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబంధించి 90% భూసేకరణ పూర్తయిందని తెలిపారు. వెంటనే ఆర్థిక అనుమతి, కేంద్రమంత్రివర్గ అనుమతి ఇచ్చి పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర భాగం పనులతోనే దక్షిణభాగం పనులు కూడా చేపట్టాలని కోరారు. దీనికి సంబంధించిన అనుమతులు వేగంగా ఇవ్వాలని కోరారు. హైదరాబాద్‌ను ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీశైలంతో అనుసంధానించే మన్ననూర్-శ్రీశైలం రహదారి అమ్రాబాద్ టైగర్ రిజర్వు పరిధిలో ఉన్నందున నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి తోడుగా ఓఆర్ఆర్ దగ్గర రావిర్యాల నుంచి ఆమనగల్ మీదుగా మన్ననూరు వరకు నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిని నిర్మించాలని కోరారు. అలాగే, హైదరాబాద్-మంచిర్యాల మధ్య ఉన్న రాజీవ్ రహదారిపై వాహన రద్దీ అధికంగా ఉన్నందున.. నూతన గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఆర్ఐఎఫ్ కింద రూ.868 కోట్లతో ప్రతిపాదించిన రహదారుల పనులను మంజూరు చేయాలని కోరారు. ఈ వినతుల పట్ల నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ పనులకు వారం లోపు అనుమతులు ఇస్తామని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారికి సంబంధించి తమ శాఖ అధికారులను హైదరాబాద్‌కు పంపుతానని హామీ ఇచ్చారు. ఈ అంశంపై ఎన్‌హెచ్ఏఐ అధికారులతో ఈ నెల 22న హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహిస్తామని రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి తెలిపారు.

## ఆర్టీసీ 'యాత్రాదానం'..!

» ప్రత్యేక సందర్భాలకు యాత్రలను దానం చేసే సదుపాయం

» పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 'యాత్రాదానం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు, పర్యాటక ప్రాంతాలకు అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, నిరుపేదలను తీసుకెళ్లడమే 'యాత్రాదానం' ముఖ్య ఉద్దేశమని సంస్థ పేర్కొంది. హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఈ కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం ఆవిష్కరించారు. ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్‌తో పాటు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యక్తులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ యాత్రాదానం కార్యక్రమానికి విరాళాలు అందించాలని ఈ సందర్భంగా ఎండీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం ప్రత్యేక నిధిని సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ ప్రత్యేకమైన, సంతోషకరమైన రోజుల్లో కొంత మొత్తాన్ని సంస్థకు విరాళం ఇవ్వడం ద్వారా ఇతరులకు ఆనందం కలిగించాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవలో భాగంగా వినూత్న ఆలోచనతో ముందుకొచ్చిన ఆర్టీసీ యాజమాన్యాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లే స్తోమత లేనివారికి యాత్రాదానం ఒక వరమన్నారు. కాగా, యాత్రాదానం నిధికి మంత్రి పొన్నం ప్రభాకర్, సజ్జనార్ చెరో లక్ష విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సంస్థ రూపొందించింది. టూర్ ప్రారంభానికి వారం రోజుల ముందు బస్సులను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని, మరింత సమాచారం కోసం ఆర్టీసీ హెల్ప్ లైన్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని ఆర్టీసీ ప్రకటించింది.



తిరుప్పూరులోని ఓ దుస్తుల పరిశ్రమను పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్

## దుస్తుల తయారీ పరిశ్రమలు పెట్టండి

**తెలంగాణలో ప్రత్యేక పాలసీ రూపొందిస్తాం**

**కోయంబత్తూరు, తిరుప్పూరులో పర్యటించిన మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో దుస్తుల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తే ప్రత్యేక పాలసీని ప్రకటించి అమలు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తమిళనాడులోని తిరుప్పూరు దుస్తుల తయారీ పరిశ్రమల యాజమాన్యాలను ఆహ్వానించారు. తెలంగాణలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వస్త్ర పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రపంచస్థాయి మౌలిక వసతులు ఉన్నాయని తెలిపారు. మంగళవారం మంత్రి తమిళనాడులోని కోయంబత్తూరు, తిరుప్పూరులో పర్యటించారు. అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అతిపెద్ద దుస్తుల తయారీ కేంద్రంగా తిరుప్పూరు గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని అన్నారు. దాదాపు 10 వేలకు పైగా దుస్తుల పరిశ్రమలతో 'నిట్ వేర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తిరుపూరు లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని ప్రశంసించారు. తెలంగాణ జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన త్వరలో ఏర్పాటు చేసే రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాల్సిందిగా అక్కడి పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. అందరితో చర్చించిన తర్వాత తెలంగాణ నూతన టెక్స్‌టైల్స్ పాలసీని రూపొందిస్తామని ఆయన వెల్లడించారు.

## కాగితంపై జీఎస్టీ 5 శాతానికి తగ్గించాలి

**తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్**

బేగంపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాగితంపై ఉన్న 18% జీఎస్టీని, 5 శాతానికి తగ్గించాలని రాష్ట్ర పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్ విజయవార్గీ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కాగితం విలాస వస్తువు కాదని, అత్యవసర వస్తువని అన్నారు. మంగళవారం బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం విద్యార్థులు, ప్రచురణకర్తలు, ప్యాకేజింగ్ పరిశ్రమతో ఇలా నిత్యం ఎంతో మంది కాగితాన్ని అత్యవసర వస్తువుగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. కాగితం కోసం అడవులను నరకడం లేదని, సాగుకు పనికిరాని భూముల్లోనే పెంచుతున్నామని తెలిపారు. గ్రామీణ రైతులకు ఇది ఓ ఆదాయ మార్గంగా మారిందన్నారు.

# గ్రామాల్లోనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

**త్వరలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాలు.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

» రాష్ట్రంలోని 34 జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ప్రారంభం

» ఆ సెంటర్లలో క్యాన్సర్ డయాగ్నసిస్, కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ సేవలు




క్యాన్సర్ డే కేర్ సెంటర్లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసే విధంగా జిల్లాకో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రాష్ట్రంలోని 34 జిల్లాల్లో ఉన్న బోధనాస్పత్రుల్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిక్ట్ క్యాన్సర్ డే కేర్ సెంటర్లను సంగారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల నుంచి మంగళవారం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్యాన్సర్ రోగుల సంఖ్య ఏటా పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రముఖ అంకాలజిస్టు నోరి దత్తాత్రేయుడు సూచనల మేరకు ఈ క్యాన్సర్ డే కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. క్యాన్సర్ బాధితులు కీమోథెరపీ కోసం ఇకపై హైదరాబాద్ వెళ్లనవసరం లేదన్నారు. క్యాన్సర్ డే కేర్ సెంటర్లలో క్యాన్సర్ స్క్రీనింగ్, డయాగ్నసిస్, కీమోథెరపీ, పాలియేటివ్ కేర్ వంటి సేవలన్నీ అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. డే కేర్ సెంటర్ల వల్ల రోగులపై ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ఇక, ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించేందుకు మొబైల్ స్క్రీనింగ్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ వాహనాలు గ్రామాలకు వెళ్లి పరీక్షలు చేస్తాయని, క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని డే కేర్ సెంటర్‌కు సిఫారసు చేస్తాయని మంత్రి వివరించారు. అనంతరం, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు జర్మన్, జపనీస్ భాషల బోధనకు సంబంధించి ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఈఎఫ్ఎల్‌యూ)తో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంగళవారం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. నర్సులకు మెరుగైన ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని మంత్రి దామోదర ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా, డీఎంఈ నరేంద్రకుమార్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ శ్రీనివాసులు, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**'గాంధీ'లో పాలియేటివ్.. వనస్థలిపురంలో కీమోథెరపీ యూనిట్లు**

అడ్డగుట్ట, వనస్థలిపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ప్రారంభించడంతో హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో పాలియేటివ్ కేర్ యూనిట్, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో కీమోథెరపీ యూనిట్ ప్రారంభమయ్యాయి. క్యాన్సర్ రోగులు డే కేర్ సెంటర్‌లో కిమోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణ ఈ సందర్భంగా కోరారు.

# అమెరికా పత్తి దిగుమతిపై సుంకం ఎత్తివేయటం అన్యాయం

» కేంద్రం నిర్ణయంతో పత్తి రైతులకు తీరని నష్టం

» రైతు ప్రయోజనాల కోసం ఉద్యమం చేస్తాం: తుమ్మల



మార్కెట్లలో సమస్యలను పరిష్కరించాలని మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్లు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై సుంకాన్ని ఎత్తివేయడం ద్వారా కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులకు తీరని అన్యాయం చేస్తున్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మనదేశం ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుల్లో ఒకటైనప్పటికీ, అమెరికా ఒత్తిడికి లొంగి పత్తి దిగుమతులపై అమలులో ఉన్న 11% సుంకాన్ని ఎత్తివేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో దేశీయ రైతులకు తీరని నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. 2025 ఆగస్టు 19 నుంచి సెప్టెంబరు 30 వరకు మాత్రమే అని ప్రకటించిన ఈ మినహాయింపును తాజాగా డిసెంబరు 31 వరకు పొడిగించడం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమని మంగళవారం మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికా విధించిన 50% దిగుమతి సుంకాల ఒత్తిడిని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకుండా... టెక్స్‌టైల్ ఎగుమతిదారులకు చవక ముడి సరుకు సమకూర్చేందుకు దేశీయ పత్తి రైతులకు నష్టం చేయటం సరైన చర్య కాదన్నారు. ఈ నిర్ణయంతో రైతులకు, ప్రభుత్వానికి, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)కు నష్టం జరుగుతుందని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం అవసరమైతే దేశవ్యాప్తంగా రైతు సంఘాలతో కలసి ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం 10% భూమిని సేంద్రియ వ్యవసాయంలోకి తీసుకొచ్చే లక్ష్యంతో ముందుకు సాగుతున్నదని, కేంద్ర ప్రభుత్వం 3 సంవత్సరాలపాటు రైతులకు ఆదాయ మద్దతు ఇవ్వాలని కోరారు. సేంద్రియ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, రైతులకు ఆదాయ మార్గం పెరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా, వ్యవసాయ మార్కెట్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మంత్రి తుమ్మలకు.. రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం గౌరవాధ్యక్షుడు చిలుక మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.నర్సింలు యాదవ్‌లు విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో మంత్రి కలిసి వినతిపత్రం అందజేశారు.

**మార్క్‌ఫెడ్ కార్యాలయంలో తనిఖీ**

మంత్రి తుమ్మల మంగళవారం నాంపల్లిలోని మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి 10.40 మధ్య సమయంలో ఆయన కార్యాలయానికి వెళ్లగా.. అప్పటివరకు చాలామంది అధికారులు, ఉద్యోగులు రాలేదు. సమయానికి అధికారులు, సిబ్బంది అంతా కార్యాలయానికి చేరుకోవాలని మంత్రి సూచించారు.

# అగ్నిగుండం నేపాల్


అగ్ని కీలల్లో నేపాల్ పార్లమెంటు


పార్లమెంటు భవనంపై ఆందోళనకారులు


ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్‌ను తంతున్న ఆందోళనకారుడు



పోలీసు జాకెట్ వేసుకొని నినాదం చేస్తున్న ఆందోళనకారుడు

(మొదటిపేజీ తరువాయి)

విచక్షణారహితంగా పిడిగుద్దుల వర్షం కురిపించగా.. ఆర్థిక మంత్రిని నడిరోడ్డుపై తన్నుతూ.. తరిమి కొట్టారు. ఈ పరిణామాల మధ్య ప్రధాని కేపీ ఓలి రాజీనామా చేయగా.. దాన్ని ఆమోదించిన దేశాధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ కూడా తన పదవిని త్యజించారు. మాజీ ప్రధాని ప్రచండ పిలుపుతో యువత ఆందోళన పగ్గాలను అందుకునేందుకు కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా(బాలెన్) సిద్ధమయ్యారు. తాజా పరిణామాల నేపథ్యంలో నేపాల్‌లో పాలన పగ్గాలను ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ చేపట్టే అవకాశాలున్నాయి.

### అర్ధరాత్రి నుంచి హింసాత్మక ఘటనలు

నేపాల్ పార్లమెంట్ వద్ద పోలీసులు సోమవారం రబ్బర్ బుల్లెట్లతో జరిపిన కాల్పుల్లో 20 మంది మరణించడంతో.. సోషల్ మీడియాను పునరుద్ధరించిన ప్రభుత్వం.. రాత్రి 10 గంటల సమయంలో మాటమార్చింది. ప్రభుత్వాదేశాలతో సైన్యం, పోలీసులు ప్రజల ఇళ్లలోకి వెళ్లి, వందల సంఖ్యలో యువతను అరెస్టు చేశారు. దీంతో.. అర్ధరాత్రి నుంచి నేపాల్ భగ్గుమంది. ప్రధాని ఓలి ఇంటిపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు గాల్లోకి కాల్పులు జరిపారు. వేర్వేరు సంఘటనల్లో మరో ఇద్దరు ఆందోళనకారులు మృతిచెందారు. దీంతో.. మంగళవారం ఉదయం నుంచి హింస ఉధృత రూపు దాల్చింది. సోషల్ మీడియాపై నిషేధం విధించాలని ఆదేశించిన సుప్రీంకోర్టు భవనాన్ని ఆందోళనకారులు టార్గెట్‌గా చేసుకున్నారు. సుప్రీంకోర్టుతోపాటు.. పలు న్యాయస్థానాలకు నిప్పుపెట్టారు. ప్రధాని ఓలి ప్రైవేటు ఇంటిని తగులబెట్టారు. దేశాధ్యక్షుడి నివాసం 'శీతల్ నివాస్', కార్యాలయాన్ని దహనం చేశారు. సోమవారం నాటి హింసకు సాక్షిగా ఉన్న పార్లమెంట్ భవనం అగ్నికీలల్లో మండిపోతున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. మాజీ ప్రధానులు– డాక్టర్ బాబూరాం భట్టరాయ్(నేపాల్ సోషలిస్ట్ పార్టీ చీఫ్), పుష్పకమల్ దహల్(ప్రచండ), షేర్ బహదూర్ దేవుబా(నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు), జలనాథ్ ఖనాల్ ఇళ్లకు నిరసనకారులు నిప్పంటించారు. జలనాథ్ ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రాకర్ సజీవదహనమైనట్లు నేపాలీ పత్రికలు పేర్కొన్నాయి. అయితే.. కొన ఊపిరితో ఉన్న ఆమె ఆస్పత్రిలో చనిపోయినట్లు ఇండియాటుడే ప్రచురించింది. దేవుబా ఇంటిని తగులబెట్టడానికి ముందు ఆందోళనకారులు అక్కడున్న వారిపై భీకర దాడులు చేశారు. దేవుబా, ఆయన భార్య, నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి అర్జూరాణా దేవుబాపై విచక్షణారహితంగా దాడులు చేసిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. ఇక ఆర్థిక శాఖ మంత్రి, 65 ఏళ్ల వయసున్న బిష్ణు ప్రసాద్ పౌడెల్‌ను ఆందోళనకారులు వీధుల్లో తరిమికొట్టారు. ప్రభుత్వ ఆఫీసులకు నిప్పుపెట్టారు.

### ఆర్మీ బ్యారెక్‌లకు ప్రముఖులు

నేపాల్‌లో హింస నేపథ్యంలో అధికారులు త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం సహా.. అన్ని ఎయిర్‌పోర్టులను మూసివేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద 300 మంది సైనికులు పహారాకాస్తున్నారు. ప్రముఖులు దేశం విడిచి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో.. సైన్యం తమ హెలికాప్టర్లలో వారిని ఆర్మీ బ్యారెక్‌లకు తరలించింది. కఠ్మాండూలోని ఆర్మీ బేస్‌లలో ప్రధాని ఓలి సహా.. పలువురు మంత్రులు, అధికారులు, వీఐపీలు ఉన్నట్లు తెలుస్తోంది.

### రంగంలోకి ఆర్మీ..

'ఓలీ రాజీనామా చేయాలి..'.. 'కేపీ చోర్.. నేపాల్ ఛోడ్( కేపీ శర్మ ఓ దొంగ.. ఆయన నేపాల్‌ను వీడాలి)..'.. అంటూ యువత ఉద్యమం ఊపందుకోవడంతో.. మంగళవారం ఉదయం ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్డెల్ ప్రధాని ఓలిని కలిశారు. "మీరు రాజీనామా చేస్తే తప్ప పరిస్థితి సద్దుమణిగేలా లేదు. మీరు రాజీనామా చేస్తే.. ఆందోళనల విరమణకు యువతను ఒప్పిస్తాం" అని ఆయన కోరినట్లు తెలిసింది. దాంతో ఓలి రాజీనామా చేశారు. ఆయన భరోసా ఇవ్వడంతోనే.. ఓలి దేశాన్ని వీడకుండా కఠ్మాండూలోనే ఉండిపోయినట్లు సమాచారం. ఆ వెంటనే "యువత సంయమనం పాటించాలి.. ఓలి రాజీనామా చేశారు" అంటూ ఓ ప్రకటన చేశారు. చర్చలకు రావాలంటూ యువతను ఆహ్వానించారు. ఈ పరిణామాలను బట్టి.. పాలనపగ్గాలను ఆర్మీ చీఫ్ తాత్కాలికంగా చేపట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మంగళవారం రాత్రి 10 గంటల సమయం యువత ఆందోళనలను వీడకుంటే.. కఠిన చర్యలు తీసుకునే అవకాశాలుంటాయంటూ మైకుల్లో హెచ్చరికలు జారీ చేసింది.

### జైళ్ల ధ్వంసం.. ఖైదీల పరారీ

నేపాల్ ఆందోళనలను పలు జైళ్లలోని ఖైదీలు అవకాశంగా మలచుకున్నారు. జలేశ్వర్ జైలులో 576 మంది ఖైదీలుండగా.. 575 మంది గేట్లను బద్దలుకొట్టి పారిపోయారు. కాస్కీ జైలులో 981 మంది ఖైదీల్లో 900 మంది, తులసీపూర్‌లో 179 మంది ఖైదీలకు గాను 124 మంది, నక్కీ జైలులో 90 మంది పరారయ్యారు. దీంతో.. పలు జైళ్లలో ఖైదీలు ఆందోళనలు చేశారు. ఆందోళనలు ఉధృతమవుతుండడంతో.. ఆయా జైళ్ల అధికారులు ఖైదీలను స్వచ్ఛందంగా విడుదల చేశారు. దేశవ్యాప్తంగా వివిధ జైళ్లనుంచి విడుదలైన/పారిపోయిన ఖైదీల సంఖ్య 6,500గా ఉన్నట్లు నేపాల్ పత్రికలు పేర్కొన్నాయి. కాగా, ఆందోళనకారులు పార్లమెంటు భవనంలో వస్తువులను, తుపాకులను ఎత్తుకెళ్లారు.

### ప్రధాని పదవిపై బాలెన్, రవి ఫోకస్

తదుపరి నేపాల్ ప్రధానిగా కఠ్మాండూ మేయర్ బాలేంద్ర షా(బాలెన్) పేరు వినిపిస్తోంది. సోమవారం రాత్రే మాజీ ప్రధాని ప్రచండ యువత ఉద్యమానికి నాయకత్వం వహించాలని బాలెన్‌ను కోరడం గమనార్హం..! ప్రధాని రాజీనామా తర్వాత బాలెన్ యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఆందోళనలను విరమించుకోవాలని కోరారు. అయితే.. ఆందోళనకారులు మాత్రం.. రాజీనామాలు సరిపోవని, అవినీతి నాయకులను జైళ్లకు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. బాలెన్ తర్వాత.. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ(ఆర్ఎస్‌పీ) అధ్యక్షుడు రవి లామిచానే పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఓలి ప్రభుత్వం రవిని జైలులో పెట్టగా.. ఆయనను అధికారులు మంగళవారమే విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

### అగ్నికి 'టిక్ టాక్' ఆజ్యం

కఠ్మాండూ, సెప్టెంబరు 9 : నేపాల్‌ను కుదిపేస్తున్న డిజిటల్ యువ ఆందోళనలకు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'టిక్‌టాక్' మరింత ఆజ్యం పోసింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, టిక్‌టాక్‌లోని 'న్యూ నేపాల్' అనే ఖాతాలో పోస్టు అయిన పలు ఫొటోలు, వ్యాఖ్యానాలు సోమవారం జరిగిన పార్లమెంటు ముట్టడిని ప్రేరేపించాయి. నేపాల్‌లో నిషేధం నుంచి తప్పించుకున్న ఒకే ఒక్క సామాజిక మాధ్యమం 'టిక్ టాక్'. ఇందులో 'సెప్టెంబరు 8' అనే శీర్షికతో పార్లమెంటు ఫొటోను 'న్యూ నేపాల్' పోస్టు చేసింది. అలాగే, తగలబడిపోతున్న పార్లమెంటు.. మంటలు ఆర్పుతున్న సిబ్బందికి చెందిన మరో ఫొటోను కూడా పోస్టు చేసింది.

### ఎవరీ సుదన్ గురుంగ్?



సోషల్ మీడియాపై నిషేధాన్ని వ్యతిరేకిస్తూ నేపాల్‌లో బద్దలైన ఆందోళనల నేపథ్యంలో తెరపైకి వచ్చిన పేరు సుదన్ గురుంగ్ (36). ఈయన నడుపుతున్న ఎన్‌జీవో సంస్థ 'హమీ నేపాల్'... నేపాల్ ఆందోళనలకు నాయకత్వం వహిస్తోంది. డిజిటల్ కట్టడితో మొదలైన ఉద్యమం గురుంగ్ చొరవతో ఇప్పుడు పౌర ఉద్యమంగా రూపుదాల్చింది. నేపాల్‌లో శాంతియుత ఆందోళనలకు పిలుపునిస్తూ ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో మొదటినుంచీ పోస్టులు పెడుతూ వచ్చారు. అంతేకాదు, ఆందోళనలు మొదలయితే.. ఏఏ మార్గాలు పోరాటాలకు అనుకూలం, ఎక్కడెక్కడ అప్రమత్తంగా ఉండాలనేది ముందస్తుగానే గురుంగ్ సూచించేవారు. గురుంగ్ పేరు నేపాల్‌లో తొలిసారి 2015 భూకంపం సమయంలో వినిపించింది. ఆ భూకంపంలో సొంత కుమారుడిని ఆయన కోల్పోయారు. ఆ ఘటన తర్వాత ఎన్‌జీవోను పెట్టారు. ఈవెంట్ మేనేజర్‌గా చేస్తున్న పనిని మానివేసి పూర్తి కాలం పౌర ఉద్యమకారుడిగా మారారు.

### ఏపీ భవన్‌లో ప్రత్యేక సెల్

న్యూఢిల్లీ/శ్రీకాకుళం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నేపాల్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో.. ఆ దేశంలో చిక్కుకున్న తెలుగు వారి తక్షణ సహాయార్థం ఏపీ ప్రభుత్వం న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర సెల్‌ను ఏర్పాటు చేసింది. పర్యాటకం నిమిత్తం నేపాల్‌కు వెళ్లి అక్కడి హోటళ్లలో చిక్కుకుపోయిన తెలుగు పౌరుల సహాయార్థం ఈ సెల్ పనిచేస్తుంది. సహాయం కోసం +91 9818395787 నంబరులో సంప్రదించవచ్చని తెలిపింది. మానస సరోవర్ యాత్రకు వెళ్లి నేపాల్‌లో చిక్కుకుపోయిన తెలుగువారు ఆందోళన చెందవద్దని, తాము అండగా ఉంటామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ భరోసా ఇచ్చారు. మరోవైపు, నేపాల్ పరిణామాలపై భారత్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. హింస నేపథ్యంలో నేపాల్‌లో ఉన్న భారతీయులు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు పాటించాలని కోరింది.


నేపాల్ అధ్యక్ష నివాసం


నేపాల్ సుప్రీంకోర్టు

## ఆపరేషన్ సిందూర్ వేళ ప్రధాని మోదీ, ఆర్మీ చీఫ్ మధ్య విభేదాలు!

- దాయాది దేశం పాకిస్థాన్ దుష్ప్రచారం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: భారత్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికలపైనే అబద్ధాలు ప్రచారం చేసే అలవాటున్న పాకిస్థాన్.. ఇప్పుడు 'ఆపరేషన్ సిందూర్'పై ఇంటర్‌నెట్ వేదికగా ఫేక్ ప్రచారం చేస్తోంది. ఆ ఆపరేషన్ చేపట్టినప్పుడు భారత ప్రధాని మోదీకి- ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీకి మధ్య తీవ్ర విభేదాలు నెలకొన్నాయని.. మనవద్ద ఉన్న ఆయుధ వ్యవస్థలను పెద్ద ఎత్తున ఆధునికీకరించనిదే సైన్యం యుద్ధం చేయబోదంటూ ద్వివేదీ మోదీకి చెప్పారని.. సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తోంది. ఈ ఫేక్ ప్రచారాన్ని 'ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో నిజనిర్ధారణ విభాగం' తీవ్రంగా ఖండించింది. "భారత ప్రధాని మోదీకి- ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదీకి మధ్య విభేదాలు నెలకొన్నట్టు పాకిస్థాన్‌కు చెందిన కొన్ని (ఎక్స్) ఖాతాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మకండి. ఆ ఆరోపణలు అసత్యం" అని పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ యూనిట్ పేర్కొంది.

### 'సిందూర్'లో 400 మంది ఇస్రో శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఆపరేషన్ సిందూర్ సమయంలో 400 మందికిపైగా ఇస్రో శాస్త్రవేత్తలు 24 గంటలూ పనిచేశారని, ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ ఉపగ్రహాల ద్వారా మన సైన్యానికి తగిన సహకారం అందించారని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ వెల్లడించారు. జాతీయ భద్రత అవసరాల మేరకు తమ సంస్థ ఉపగ్రహ సమాచారాన్ని అందించిందన్నారు. మంగళవారం ఢిల్లీలో ఓ సదస్సులో ఆయన మాట్లాడుతూ 'ఆపరేషన్ సిందూర్ సమయంలో అన్ని అవసరాలూ తీరుస్తూ ఉపగ్రహాలన్నీ 24/7 పర్ఫెక్ట్‌గా పనిచేశాయి. 400 మందికిపైగా శాస్త్రవేత్తలు 24/7 పనిచేస్తూ.. ఎర్త్ అబ్జర్వేషన్, కమ్యూనికేషన్ కోసం అన్ని ఉపగ్రహాలనూ పూర్తి సమయం వినియోగించారు' అని తెలిపారు.

## నిరుడు బంగ్లా.. నేడు నేపాల్

### ఉద్యమాల ఉధృతికి 'పొరుగు' నేతలు పతనం!



అవినీతి, నిరుద్యోగం, ఆర్థిక అవకతవకలు, అసమర్థ పాలన భారత ఉపఖండంలోని కొన్ని దేశాలకు శాపంగా మారుతున్నాయి. వీటిని సహించలేని యువత ఉద్యమోన్ముఖులై.. ప్రత్యక్ష కార్యాచరణకు దిగడంతో రెండు దేశాల ప్రధానులు పదవీచ్యుతులయ్యారు. గత ఏడాది బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఈ ఉద్యమానికి బలి కాగా.. ఈసారి వంతు నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలిది. హసీనా భారత్‌లో ఆశ్రయం సంపాదించగా.. ఓలి దుబాయ్ వెళ్తున్నట్లు సమాచారం. 2022లో శ్రీలంకలో అధ్యక్షుడు గొటబయ రాజపక్ష, ఆయన అన్న-ప్రధాని మహీంద రాజపక్షను ఆందోళనకారులు తరిమికొట్టిన సంగతి తెలిసిందే. నేపాల్, బంగ్లాల్లో సంభవించిన ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల్లో సారూప్యతలు కనిపిస్తున్నాయి. బంగ్లాదేశ్ ఆవిర్భావానికి మూలకారణం.. తూర్పు పాకిస్థాన్‌లోని బెంగాలీలపై.. పాక్ పంజాబీల ఆధిపత్యం. రాజకీయంగా, ఉద్యోగపరంగానే గాక భాష, సాంస్కృతికపరంగానూ బెంగాలీలను అణచివేసేందుకు పాక్ పాలకులు చేసిన ప్రయత్నాలతో.. బెంగాలీల ఉద్యమం పతాక స్థాయికి చేరి.. బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది. ఈ ఉద్యమానికి అవామీలీగ్ పార్టీ నాయకత్వం వహించింది. 50 ఏళ్ల తర్వాత సీన్ రివర్స్ అయింది. అదే అవామీలీగ్ ప్రభుత్వాన్ని నడుపుతున్న షేక్ హసీనాను ఉద్యమకారులు పదవీచ్యుతురాలిని చేశారు. ఆమె సర్కారు నిరంకుశంగా వ్యవహరిస్తోందని.. ఆమెను తొలగించాలంటూ విద్యార్థులు రోడ్లెక్కారు. ఒకప్పుడు విప్లవాన్ని ముందుండి నడిపిన పార్టీ.. మరో విప్లవం కారణంగా రాజకీయంగా తెరమరుగైంది.

#### ఓలీ గతంలో సఫలం.. ఇప్పుడు విఫలం

నేపాల్లో రాడికల్ వామపక్షవాదులు రాచరిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీశారు. 2008 మేలో రాచరిక పాలనను రద్దుచేశారు కూడా. ఆ రద్దు చేసిన సంకీర్ణ ప్రభుత్వంలో కేపీ శర్మ ఓలికి చెందిన కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ (యునిఫైడ్ మార్క్సిస్ట్-లెనినిస్ట్) కూడా భాగస్వామి. ప్రజాస్వామ్య విధానానికి మారినా పరిస్థితుల్లో మార్పు రాకపోవడంతో ఇటీవలి కాలంలో తిరిగి రాచరిక పాలన రావాలని నేపాల్ సమాజంలోని ఓ వర్గం కోరుతోంది. ఆ మధ్య రోడ్డెక్కి భారీఎత్తున ఉద్యమించింది కూడా. దానిని అణచివేయడంలో ఓలి సఫలమయ్యారు. కానీ ఇప్పుడు తన ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా 'జెన్-జడ్' చేపట్టిన ఉద్యమ ధాటికి ఓలి రాజీనామా చేయాల్సి వచ్చింది.

#### బంగ్లాదేశ్‌లో అణచివేతపై ప్రతిఘటన

బంగ్లా స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న సమరయోధుల సంతానానికి ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించడంపై బంగ్లాదేశ్‌లో యువత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీనివల్ల తమకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయన్న ఆందోళన వారిలో ఉంది. ఈ రిజర్వేషన్లను వాస్తవానికి హసీనా ప్రభుత్వం 2018లోనే తొలగించింది. కానీ గత ఏడాది జూన్‌లో దిగువ కోర్టు ఆ కోటాలను పునరుద్ధరించింది. దానిని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. అన్ని రకాల రిజర్వేషన్‌ను 93 శాతానికే పరిమితం చేసింది. అయితే దిగువ కోర్టు నిర్ణయంతో అప్పటికే యువత ఉద్యమబాట పట్టారు. రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా బంగ్లా సుప్రీంకోర్టు నిర్ణయం వెలువరించినా.. ఉద్యమం ఉధృత రూపం దాల్చింది. హసీనా ప్రభుత్వం ఉక్కుపాదంతో వారిని అణచివేయాలని చూసింది. 1,500 మంది నిరసనకారులు ప్రాణాలు కోల్పోయారు. అయినా యువత వెనుదీయలేదు.

#### నేపాల్‌లో అవినీతి, బంధుప్రీతి ..

నేపాల్లో రాజకీయ నేతలు, అధికారుల సంతానం, బంధుమిత్రులకే ప్రభుత్వ ఉద్యోగాలు దక్కుతుండగా.. మిగతా సాధారణ యువత మాత్రం నిరుద్యోగంలో మగ్గుతోంది. దీనిపై 'నెపోకిడ్స్' హ్యాష్‌టాగ్‌తో ఆందోళనకారులు నిరసనలు మొదలుపెట్టారు. ఈ సమయంలోనే ఫేస్‌బుక్, స్నాప్‌చాట్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌పై ఓలి ప్రభుత్వం నిషేధం విధించింది. దీనిపై యువత రోడ్డెక్కారు. వారిని అణచివేసేందుకు భద్రతాబలగాలు కాల్పులు, బాష్పవాయు ప్రయోగం చేశాయి. 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత ఆయా ప్లాట్‌ఫామ్స్‌పై నిషేధం ఎత్తివేసినా.. ప్రాణనష్టం చూసిన యువత 'జెన్-జడ్' పేరిట ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేశారు. నేతల అవినీతి, బంధుప్రీతికి వ్యతిరేకంగా పోరాటం పెంచారు. ఫలితంగా ఓలీ రాజీనామా చేశారు.

## దక్షిణ మధ్య రైల్వే 'ఆపరేషన్ అమానత్'..

### 22 ఫోన్లు స్వాధీనం.. యజమానులకు 9 మొబైల్స్ అప్పగింత

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఆగస్టు నెలలో 125 మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకున్నట్టుగా ఫిర్యాదులు వచ్చాయి. 'ఆపరేషన్ అమానత్'లో భాగంగా వీటిలో 96 ఫోన్‌లను రైల్వే పోలీసులు బ్లాక్ చేశారు. అందులో 34 ఫోన్‌ల జాడ గుర్తించి, 22 ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 9 ఫోన్‌లను యజమానులకు అప్పగించారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అపహరణకు గురైన మొబైల్ ఫోన్‌లను బ్లాక్ చేయవచ్చని రైల్వే అధికారులు తెలిపారు. గత నెలలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్లలో అపహరణకు గురైన ఫోన్‌లను స్వాధీనం చేసుకునేందుకు రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆర్పీఎఫ్ చేస్తున్న ఈ కృషిని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ప్రశంసించారు.

### రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్తుకు డిమాండ్ పెరుగుతోంది. ఈ నెల 8న(సోమవారం) తెలంగాణలో 15,906 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. సెప్టెంబరు నెలకు సంబంధించి ఇది రికార్డు. రాష్ట్రంలో ఇటీవల వరినాట్లు బాగా పెరగడంతోనే కరెంటుకు డిమాండ్ ఎక్కువైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న గృహ, పారిశ్రామిక విద్యుత్ వినియోగాలకు తోడు, పంటల సీజన్‌లో వ్యవసాయానికి కరెంటు డిమాండ్ ఎక్కువవుతుందని, ఈ నేపథ్యంలో గ్రామీణ జిల్లాల విద్యుత్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అయితే, గతేడాది సెప్టెంబరు 8న కేవలం 9,543 మెగావాట్ల డిమాండే నమోదు కావడం ఇక్కడ గమనార్హం.

## నైజీరియా డ్రగ్స్ వయా యూరప్

- కొరియర్ ద్వారా భారత్‌కు చేరవేత
- ఈగల్ బృందాల దాడుల్లో వెల్లడి
- దేశవ్యాప్తంగా 24 చోట్ల దాడులు
- 20 మంది హవాలా ఆపరేటర్ల అరెస్టు

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నైజీరియా నుంచి పెద్ద ఎత్తున డ్రగ్స్ భారత్‌కు సరఫరా అవుతున్నాయి. అయితే స్మగ్లర్లు వాటిని నేరుగా భారత్‌కు పంపించకుండా.. సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. నైజీరియా నుంచి తొలుత యూరప్‌కు పంపించి.. అక్కడి నుంచి ఫెడెక్స్, డీహెచ్ఎల్ వంటి కొరియర్ల ద్వారా భారత్‌లోని వివిధ ప్రాంతాలకు చేరవేస్తున్నారు. రాచకొండ ఈగల్ బృందాలు ఇటీవల అరెస్టు చేసిన నైజీరియా దేశస్తుడు కెన్నత్ మ్యాక్స్‌వెల్ డ్రగ్స్ లింకులపై జరిపిన దాడుల్లో ఈ విషయం వెల్లడైంది. ఈగల్ బృందాలు దేశవ్యాప్తంగా 24 చోట్ల దాడులు నిర్వహించి.. 20 మంది హవాలా ఆపరేటర్లను అరెస్టు చేశాయి. రూ.3 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నాయి. రాజస్థాన్, మహారాష్ట్ర, గుజరాత్, గోవా, ఢిల్లీలోని ప్రాంతాల్లో ఈగల్ బృందాలు దాడి చేశాయి. యూరప్ నుంచి కొరియర్ కంపెనీల ద్వారా ముంబై, పుణె చేరిన 35 డ్రగ్స్ పార్శిళ్ల ఇన్వాయిస్‌లను గుర్తించాయి. ముంబై, పుణె నుంచి స్థానిక కొరియర్ కంపెనీల ద్వారా డ్రగ్స్ గోవాకు చేరుతుండగా, అక్కడి నుంచి హైదరాబాద్‌కు మ్యాక్స్‌వెల్ ముఠా పంపినట్లు ఈగల్ బృందాల దర్యాప్తులో వెల్లడైంది. కాగా, డ్రగ్స్ సరఫరాదారులు వాటి అమ్మకాలతో వచ్చిన డబ్బును హవాలా మార్గంలో మళ్లించి, ఆ డబ్బుతో వస్తువులను కొనుగోలు చేసి నైజీరియాకు పంపుతున్నట్లు గుర్తించామని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య ఒక ప్రకటనలో తెలిపారు. 50 మంది హవాలా ఆపరేటర్లను గుర్తించి.. 20 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల మ్యాక్స్‌వెల్‌ను అరెస్టు చేశాక.. అతనికి సంబంధించిన 150 నగదు లావాదేవీలను గుర్తించారు. కేవలం ఏడాది వ్యవధిలోనే మత్తుమందుల అమ్మకాల ద్వారా తనకు వచ్చే 20% కమిషన్ కింద మ్యాక్స్‌వెల్ రూ.68 లక్షలు సంపాదించినట్లు కనుగొన్నారు.

### వస్తువులు కొనుగోలు చేసి నైజీరియాకు..

నైజీరియన్ల నుంచి హవాలా ఆపరేటర్లయిన ఉత్తమ్‌సింగ్, చేతన్ మమానియా, దుర్గారామ్, చేతన్‌సింగ్, చగన్‌లాల్‌కు డ్రగ్స్ అమ్మకాల డబ్బు అందేది. నైజీరియన్లు తమకు అందిన డబ్బును ప్రధాన హవాలా ఆపరేటర్లకు పంపించి.. తమకు ఏ వస్తువులు కావాలో తెలియజేసేవారు. ప్రధానంగా వస్త్రాలు, బేబీ ఫ్రాక్స్, టీ షర్టులు, కుర్తాలు, కేశాలు కొనుగోలు చేసి.. వాటిని సముద్ర మార్గం ద్వారా కార్గోలో నైజీరియాకు పంపించాలని హవాలా ఆపరేటర్లను కోరేవారు. ఈ క్రమంలో హవాలా ఆపరేటర్లు దేశవ్యాప్తంగా ఉన్న తమ నెట్‌వర్క్‌ను ఉపయోగించి నైజీరియన్లు కోరిన వస్తువులను వారి దేశానికి పంపించేవారు. గోవాలోని హవాలా ఆపరేటర్ ఉత్తమ్‌సింగ్‌కు మత్తుమందుల అమ్మకాలకు సంబంధించి నైజీరియన్ల నుంచి రోజుకు రూ.25 లక్షల నగదు అందుతుంది. ఇలా వారానికి రూ.2.1 కోట్ల నగదును గోవాలోని వ్యాపారులు, హవాలా ఆపరేటర్ల ద్వారా ఉత్తమ్‌సింగ్ మార్పిడి చేసేవాడు. అతని నుంచి చేతన్‌సింగ్‌కు, అక్కడి నుంచి భరత్‌కుమార్‌కు చేరి.. ముంబై, సూరత్‌లో కొనుగోళ్లు జరిపేవారని సందీప్ శాండిల్య వివరించారు. ఇది కేవలం మ్యాక్స్‌వెల్‌కు సంబంధించిన నెట్‌వర్క్‌పై జరిపిన దాడుల్లోనే తేలిన విషయమని, దేశవ్యాప్తంగా పలువురు నైజీరియన్లు మత్తుమందుల దందాలో ఉండటంతో.. ఇంకా ఎంత పెద్దమొత్తంలో హవాలా మార్గంలో నగదు చెలామణి అవుతుందో గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు.

## నిషేధిత భూముల వివరాలు వారంలో పంపండి

- తహసీల్దార్లకు రెవెన్యూ శాఖ ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ కేటగిరీల కింద ఉన్న నిషేధిత భూముల వివరాలన్నీ క్రోడీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. వారం రోజుల్లో మండలాల వారీగా నిషేధిత భూముల వివరాలు పంపాలని కలెక్టర్లను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి డీఎస్ లోకేశ్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ చట్టంలోని నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎందుకు పంపడం లేదని ఇటీవల హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే. ఆ వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెంటనే పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో వివరాల సేకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వాస్తవానికి 2017 సెప్టెంబరు 15వ తేదీ నుంచి అదే ఏడాది డిసెంబరు మధ్య తెలంగాణలో భూరికార్డుల నవీకరణ జరిగింది. ఆ వివరాల ఆధారంగా జాబితాలను సిద్ధం చేసి ప్రజలందరూ చూడగలిగేలా వెబ్‌సైట్ (పబ్లిక్ డొమైన్)లో పెట్టాలి. కానీ గత సర్కారు దీనిని పట్టించుకోకపోవడంతో సర్కారు, దేవాదాయ, వక్ఫ్ భూములు భారీగా అన్యాక్రాంతం అయ్యాయి. 2017 సెప్టెంబరులో చేపట్టిన భూరికార్డుల నవీకరణకు ముందు రాష్ట్రంలో పట్టాభూములు 1.30 కోట్ల ఎకరాలు ఉంటే.. 2020 అక్టోబరు 23వ తేదీ నాటికి 1.55 కోట్ల ఎకరాలకు పెరిగాయి. మరోవైపు రాష్ట్రంలో అటవీ, దేవాదాయ, వక్ఫ్‌భూములు తగ్గిపోయాయి. నిషేధిత జాబితాలోని ఈ భూముల వివరాలు లేకపోవడంతో అక్రమంగా రిజిస్ట్రేషన్లు అయి పట్టాభూములుగా మారుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో నిషేధిత జాబితాలోని భూముల వివరాలను సేకరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. స్పష్టత వచ్చాక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా నిషేధిత భూముల వివరాలను ప్రకటించవచ్చనిరెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి.

*Printed and Published by* **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor:* **N.Rahul Kumar.** *Ph. No. (0870) 2100480/84,*
*RNI No:APTEL/2003/9741,* **Managing Director : Vemuri Radha Krishna** *Founder: K.L.N.Prasad.*